ఆంధ్రపత్రిక

రాక్షసనామసంవత్సరాది సంచిక

[అరువదియేడవ సంచిక]

[1975 - 76]

వ్యవస్థాపకులు: శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు

*

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

[1938 – 1972]

*

సంపాదకుడు : శివలెంక రాధాకృష్ణ

వెల రూ. 3

ఆంధ్రపత్రికా కార్యాలయమున ముద్రితము

Supplement to Andhra Patrika Issue Dated 12-4-1975 Regd No. H/VJ No 49

రాక్షసనామ సంవత్సరాది సంచిక

విషయానుక్రమణిక


సంచిక : 65 **సంవత్సరము 1975-76**

★

ముఖచిత్రం: **శుక సుందరి**

తంజావూరు చిత్రం

(శ్రీ కోడూరి రామమూర్తి గారి కలెక్షన్)




ఆంధ్రపత్రిక హైదరాబాద్ ఎడిషన్ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 27 ఉదయం హైదరాబాదులోని ఆంధ్రపత్రిక కార్యాలయావరణలో జరిగిన సభలో ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ఉపన్యసిస్తున్న దృశ్యం. వేదికపై ఆసీనులైనవారిలో సభాపతి రేబాల దశరథరామిరెడ్డి, తెలంగాణా నాయకులు శ్రీ మందుముల నరసింగరావు, ఆంధ్రపత్రిక సంపాదకులు శ్రీ శివలెంక రాధాకృష్ణ, జనరల్ మేనేజరు శ్రీ కుంచితపాదం, శ్రీ శివలెంక నాగేశ్వరరావు, దేశీయాంగమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రభృతి ప్రముఖులున్నారు. కుడివైపు చిత్రంలో ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, దేశీయాంగమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి, ఆర్థికమంత్రి శ్రీ రంగారెడ్డి, విద్యుచ్ఛక్తిమంత్రి శ్రీ రాజారాంలు ఆంధ్రపత్రిక ప్రత్యేక సంచికను పరిశీలిస్తున్న దృశ్యం.


స్వవిషయం

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ఆంధ్రపత్రికని వారపత్రికగా 1908 లో బొంబాయిలో స్థాపించారు. 1914 నుంచి ఆంధ్రపత్రిక దినపత్రికగా మదరాసునుంచి వెలువడింది. 1965లో ఆంధ్రపత్రిక దినపత్రిక విజయవాడ ఎడిషన్ మొదలయింది. 1974 డిసెంబరు ముప్పయిఒకటవతేదీతో మదరాసు ఎడిషన్ ఆగిపోయింది. 1975 మార్చి 27 నాడు ఆంధ్రపత్రిక తెలుగువారి రాష్ట్రం రాజధాని హైదరాబాదునుంచి వెలువడటం మొదలు పెట్టింది. ఆంధ్రపత్రిక స్థాపకులు విశాలాంధ్ర ఆశయం ఎంత గొప్పదో చాలాకాలం కిందనే తెలిపారు. ఆంధ్రపత్రికకి ముప్పయి అయిదు సంవత్సరాలపాటు ఆధిపత్యం వహించిన శివలెంక శంభుప్రసాద్‌గారు హైదరాబాదునుంచి ఆంధ్రపత్రికని వెలువరించటానికి సంకల్పించుకున్నారు. ఈ సంకల్పం ఆయన జీవితకాలంలో నెరవేరలేదు. అయితే తెలుగువారి రాష్ట్రం యొక్క రాజధాని నుంచి ఆంధ్రపత్రిక వెలువడటానికి తగిన పునాదులు ఆయన వేసినవే అని సందేహం లేకుండా చెప్పవచ్చు. ఆంధ్రపత్రిక హైదరాబాదుకి తరలివెళ్లటానికి ఎందరో తోడ్పడ్డారు. వారందరికీ మా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. దేశసేవకన్నా ముఖ్యమయిన మరొక లక్ష్యం ఆంధ్రపత్రికకి లేదని పాఠకులకి మనవిచేసుకుంటున్నాము

పెరిగేవయస్సు ఆరోగ్యవంతముగా అవుతుంది- ఇన్‌క్రిమిన్*తో

బాల్యదశ రోజులు—వలపువ్వు భరితంగా పెరిగే రోజులు! ఈ రోజుల్లో పిల్లల శరీరం పూవులాగా వికసిస్తుంది. వీరికి ఇన్‌క్రిమిన్ సిరప్ తప్పక ఇవ్వండి ఇహ చూడండి ఆహారము తినకుండా మారాము చేసే పిల్లల ఆకలి ఎంత పెరుగుతుందో—వీరు తినే, తాగే ఆహారమంతా కూడా వంటికి బాగా పడుతుంది. లాభదాయకమైన విటమిన్లు మరియు ఐరన్‌తో పరిపూర్ణమైన ఇన్‌క్రిమిన్‌లో, ఆహారము యొక్క అన్ని పోషక తత్వములను గ్రహించేందుకు సహాయము చేసే విశేషమైన అమినో ఏసిడ్, లైసిన్, కూడా ఉన్నాయి.





ఇన్‌క్రిమిన్* టానిక్

డ్రాప్స్—శిశువులకు 2 నెలల నుంచీ 2 సంవత్సరాల వరకు
సిరప్— 14 సంవత్సరముల వయస్సు వరకు పిల్లలకు

అధిక ఆహారాన్ని అధిక పెరుగుదలగా మారుస్తుంది తింటున్న ఆహారమంతా వంటికి పట్టేట్టు చేస్తుంది.

డాక్టర్లు విశ్వసించే పేరు—Lederle సయానమిడ్ ఇండియా లిమిటెడ్ వారి ఒక విభాగం

*అమెరికన్ సయానమిడ్ కంపెనీవారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కు

Sista's INC-362 I/76-Tel

ఉగాది

శ్రీ దూపాటి సంపత్కుమారాచార్య

ధనధాన్య సంతత దాయివై సంబరాల్
కలబోసి నింపిన గాదివగుచు!
నిరత నిరుద్యోగ నీరధి నెదురీదు
వారికి నవనవో పాధివగుచు!
నీరసంపదు ధరణీలోహ గృహమును
పైడి చేసెడి రసవాది వగుచు!
జనుల నెడందల సంతోష సౌఖ్యముల్
వరుసగూర్చెడి శుభాపాది వగుచు!

శాశ్వతమ్మగు నానంద జలధివగుచు
పుణ్యవృక్షమునకు క్రొత్త బోదివగుచు!
యువకవులకు — మంచి — ఉగాది కవిత వగుచు!
కదలిరమ్మింక! రాక్షసోగాది లక్ష్మి!

ధనరాశి మసిబూసి జనరాశి జలరాశి
ప్రోదోసి దాగుడుమూతలాడె!
ధరలన్ని ధరవీడి త్వరతోడి పరువెత్తి
వినువీధి బరువెత్తి వెక్కిరించె
ప్రతి యింట వెనువెంట పసిపాపలే యుంట!
యెఱ్ఱ త్రికోణమ్ము యెగిరెమింట!
తప్పేమి? హిప్పీగ తలపెంచి, సతిముందు
మనుజుండు "పప్పీ"గ మారిపోయె

ఈ యుగాది పచ్చడి మరింత చేదు
బెల్లమందు కల్తీవల్ల పెరిగిపోయె
చింతపండిన యీ పరిస్థితుల మార్చ
రమ్మ! రాక్షస సంవత్సరమ్మ వచ్చి!

అవకాశం ఎదురుచూస్తూంది!

ఆంధ్రప్రదేశ్ రాజధాని–హైదరాబాద్ ఇటీవల సంవత్సరాలతో, విద్యుకు దక్షిణంగా ప్రముఖ పారిశ్రామికకేంద్రంగా విలసిల్లుతోంది గర్వించదగ్గ అనేక బృహత్పరిశ్రమలు కేంద్ర–పబ్లిక్ రంగంలో భారత్ హెవీ ఏలెక్ట్రికల్స్, ది ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్, హిందుస్థానే యంత్ర పరికరాల సంస్థ విభాగము, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, రాష్ట్ర పబ్లిక్ రంగంలో రిపబ్లిక్ ఫోర్జ్ కంపెనీ, ఇండో నిప్పన్ ప్రెసిషన్ బేరింగ్స్ యింకా సంయుక్త ప్రయివేటురంగాలలో అనేకప్రాజెక్టులు హైదరాబాద్‌లో క్రొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహనిస్తున్నవి.

1973–74 తో భారతప్రభుత్వము భారీ పారిశ్రామిక రంగంలో రు 161.67 కోట్ల పెట్టుబడితో 17000 మందికి ఉపాధి లభించగల యాభయి పరిశ్రమలకు పారిశ్రామిక లైసెన్సులు మంజూరుచేసింది. అయితే 1972–73 రు. 67కోట్ల పెట్టుబడి గల 60 పరిశ్రమలకు లైసెన్సులు మంజూరు చేసినదాంతో పోల్చితే యిప్పటి పరిస్థితి గణనీయమైన అభివృద్ధిని సూచిస్తోంది.

పారిశ్రామిక వేత్తలకు తమ క్రొత్త పరిశ్రమల స్థాపనకు ఆంధ్రప్రదేశ్ ఆదర పూర్వకమైన ఆహ్వానాన్ని అందిస్తోంది. ఈరోజు రాష్ట్రంలో అవకాశాలు మెండుగా ఎదురు చూస్తున్నాయి. ఈ సదవకాశాన్ని ఎక్కువమంది వినియోగించుకో గలరనే ఆశించబడుతోంది.

డైరెక్టర్,

సమాచార పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము

DIPR 542 63 Advt/75

ఉపన్యాసిక

మాటలు

శ్రీ మిరియాల రామకృష్ణ

నేనివాళ మాటల్ని గూర్చి ముచ్చటిస్తాను. మాటల్ని కలిపి మూట కడతాను. మాటల్ని గుచ్చి దండకడతాను. నాకు కొన్ని జ్ఞాపకాని కొస్తాయి. గడచిన నా జీవితంలోని స్మృతులెన్నో కనిపిస్తాయి. అవన్నీ రైలులో పోతూండగా కనిపించే చెట్లలాగ, దారిలో నడుస్తూండగా మీదపడే నీడల్లాగ, పొలంలో కూర్చుంటే బారులుగా కనిపించే ఆకాశపక్షుల్లాగ నాకు కనిపిస్తాయి. అవి నన్ను పలకరిస్తాయి. నాతో నవ్వుతాయి. నావైపు చూస్తాయి. అందుకే నాకు వాటిమీద సరదా. వాటిమీద ప్రేమ. వాటిమీద ఆలోచన. వాటిమీద సంగీతం. వాటిమీద కవిత్వం.

నే నివాళ మాటల్ని గూర్చి ముచ్చటిస్తున్నాను. మాటలు కూడా మనలాగే జాతి కడుపునుంచి పుడతాయి. ఏడుస్తాయి. స్నానం చేస్తాయి. శుభ్రంగా నిద్రపోతాయి. ప్రాకుతాయి. నడుస్తాయి. పరుగెత్తుతాయి. పడతాయి. నవ్వుతాయి. ఏవన్నా నములుతాయి. కనక వాటికీ జీవితం ఉంది. వాటికీ పడుచుతనం, ఆవేదనా, విరహం, శృంగార కరుణాదులూ అనుభవాలూ, విభావాలూ, సంచారీ భావాలూ ఉన్నాయి. ఇవన్నీ లేకపోతే అవి మనుషులతో జతగూడవు. మనుషులంటే అవి ఎందుకింత ప్రేమ ఒలికిస్తాయి మరి ? అందుకే మాటలు కూడా మనలాంటివే.

కొన్ని మాటలకి ముసలితనం వస్తుంది. వాటిని గూర్చి అప్పుడెవరూ పట్టించుకోరు. మా కర్మమిలా కాలిందని అవి ఏడుస్తాయి. అప్పుడప్పుడూ ఒక్కో కవి వాటిని డాక్టరులాగా పరిశీలించి, మందు వేస్తాడు. మళ్లీ వాటికి చైతన్యం కొంచెం కలుగుతుంది. కర్రలాంటి ఛందస్సు పుచ్చుకుని, మంచంలాంటి శైలి మీద కూచుని అవి కాలక్షేపం చేస్తాయి. ప్రయోగ దక్షత అనే వసంత కుసుమాకరాన్ని ప్రయోగించి వార్ధక్యాన్ని నివారిస్తారు మహాకవులు.

మాటలు **పాతబడటం** అంటె అది కాలానికి సంబంధించిన విషయం. పాతపుస్తకాలు చూస్తే ఎన్నిమాటలు పాతబడిపోయాయో ఇప్పుడు తెలుస్తుంది. పాతబడిపోవడం తెలుగు మాటల ముఖ్యలక్షణం. కొన్నిమాటలు నవనవోత్తేజంతో పడుచుతనపు నెత్తుటిపొంగు కనిపించే చెక్కిళ్లతో, గుండెలోని భావాన్నంతటినీ చూపించే పెద్దకళ్లతో శిరీషకుసుమ పేశలమైన తనుమార్దవంతో సుఖస్పర్శ కలిగిస్తూ మధురంగా రమణీయంగా చెవులకి విందుగా, నాలుకకు పసందుగా ఎన్నాళ్లయినా సరే అలాగే అలాగే కనిపిస్తాయి. నీ వ్యాకరణ దక్షతను పదిమందీ మెచ్చుకోవాలనీ గుండెలు బద్దలై చావాలనీ గండపెండేరాలు వేయించుకోవాలనీ కోశాల్లో మారుమూల ఉన్న గీర్వాణాన్ని అంతటినీ దుంప తెంచుతూ రాసి పారేస్తావు. వాటిలో యవ్వనం ఉండదూ, దిబ్బా ఉండదూ.

శ్రీకృష్ణుడికి సైతం రవంత వెన్నపూస వెదుక్కోకుండా దొరకని గోపికల యిళ్లలాంటి కవిత్వాలు చాలానే చూశాను. దేవతలకు సైతం ఆవంత అమృతం దొరకని సముద్రాలూ చూశాను. దీనిక్కారణం మాటల్లోని కటుత్వం. మాటల్లోని కొబ్బరికాయ పీచులాంటి గట్టితనం మాటల్లోని అంతఃకలహం, మాటల్లోని పాతబడ్డతనం. అయినా వాళ్లూ కవిత్వం గలవాళ్లే. నిరంకుశులు కూడాను. మిట్టమధ్యాహ్నపు సూర్యభగవానుళ్లు వాళ్లు. వాళ్ల ఎండల్లాంటి అర్థాల్ని చూడటానికి టీకలనే కళ్లద్దాలు కావాలి, బహుశా వాళ్ల రోజుల్లో ఆ మాటలన్నీ కొత్తకొత్తగానే ఉండేవేమో ? ఎవరికి తెలుసు ?

మనల్ని మనం దాచుకుందామనుకున్నా మన మాటలు మనల్ని దాచవు. నాకిక్కడో కథ జ్ఞాపకాని కొస్తోంది. కచుడు మృతసంజీవనీ విద్యకోసం శుక్రాచార్యుడి దగ్గరి కెళ్లాడు. చదువుకోడాని కొచ్చాను. బృహస్పతిగా రబ్బాయినని మాత్రం చెప్పుకున్నాడు కచుడు. శుక్రుడు బ్రహ్మానంద పడ్డాడు. కచుడు ఎంత బుద్ధి మంతుడో! శుక్రుడికి చాలా మంచి **Impression**

కలిగింది కచుడి మీద. రాక్షసులూ ఉన్నారు. ఒట్టి బడుద్ధాయిలు. శుక్రుడి కూతురు దేవయానికీ కచుడికీ మాటలు చూపులూ కలిశాయి. కచుడి ప్రేమలో ఒక్క పిసరైనా మోహం లేదు... అతణ్ని పగబట్టి చంపారు రాక్షసులు, రహస్యంగా. కచుడు రాలేదని దేవయాని విచారించింది. గుమ్మందగ్గర నిలబడి చూసింది. రాలేదు. అప్పటికి సూర్యుడు పడమటి సముద్రంలోకి దూకుతున్నాడు. కచుడు రాలేదు. రోజూ ఈపాటికి వచ్చేసేవాడు అడవికి మేతకెళ్లిన ఆవులన్నీ వచ్చేశాయి. ఈఅమ్మాయి యింకా చూస్తూనే ఉంది. కచుడు రాలేదు. శుక్రుడు సాయం సంధ్యా వందనానికి అగ్నిహోత్రం ముందు ఆసీనుడయ్యాడు. ఆ హోమం పూర్తయింది. కచుడు అప్పటికీ రాలేదు. పొద్దుపూర్తిగా క్రుంకిపోయింది. ఎంతసేపటినుంచి చూస్తోందో దేవయాని కచుడి కోసం. ఇకరాడని ఆమె కనిపించింది. గబగబా తండ్రి దగ్గరకెళ్లి చెబుతోంది — వాడియుష్ఖముల్ గలుగువాడపరాంబుధి గ్రుంకె— కచుడు రాలేదు. ధేనువుల్ నేడిట వచ్చె—కచుడు రాలేదు. నిష్ఠ మెయిన్ భవదగ్ని హోత్రముల్ పొడిగ వేల్పగా బడియె— కచుడు రాలేదు. ప్రొద్దును బోయె— కచుడేడీ రాలేదు. వనంబులోన మృగరాక్షస పన్నగబాధ నొందెనో.

ఈ పద్యంలోని మాటలన్నీ దేవయాని అంతకు ముందు ఎంతోసేపటినుంచి అతగాడికోసం నిరీక్షించిందో దాచకుండా చెబుతున్నాయి. ఆమె తాను నిరీక్షించానని చెప్పలేదు... శుక్రుడు కచుణ్ని బతికించాడు. మళ్లా ఒకరోజున కచుణ్ని ఖూనీచేశారు రాక్షసులు.అతణ్ని కాల్చారు. బూడిదతీసి సారాలో కలిపి శుక్రుడికిచ్చారు. అతను త్రాగేశాడు. నిషాలో ఉన్నాడు. అలాంటి వాడికి తనమీద పిడుగులు పడుతున్నా లెక్కఉండదు. మనకి తెలుసు తాగినవాడి తందనాల తీరు...దేవయాని మళ్లా ఏడ్చింది. శుక్రుడికి సాను భూతి కూడా కలగలేదీసారి. వాడా! చచ్చాడా ! చావనీ చావనీ, స్వర్గాని కెడతాడు; ఏడుస్తారా ఎవరేనా చస్తే అన్నాడు. ఈ మాటలెంత అసంబద్ధ ప్రలాపాలో చూడండి. ఔచిత్యపు హద్దులనుంచి తప్పించుకుని అతనిలోని మత్తుని వెలిగక్కుతున్నాయి. ఈలాంటి మత్తుని విరగగొట్టి మెలకువ తెప్పించగల మహాశక్తి కూడా మాటల్లో ఉంది. నిజానికి మాటల కా శక్తి నిస్తున్నవాడు వక్త. అయితే వక్త కా శక్తి నిస్తున్నవి మళ్లా మాటలే మరి. మనల్ని మాటలూ, మాటల్ని మనమూ వదిలి బ్రతకలేం. మనం వదిలేసిన మాటలు మూగివై పోతాయి. కుంటివై పోతాయి. గ్రుడ్డివై పోతాయి. మాటల్ని వదిలేస్తే మనం బంగారం వదిలేసినట్లు... దేవయాని తిరిగి ఉపన్యసించాలి శుక్రుడి గుండెల్లో గుచ్చుకునే మాటల్ని విసరాలి అస్త్రాల్ని.

ఆమె అంటుంది—నాన్నా ఎవరనుకున్నావ్ కచుడు. అంత గొప్పవాడయిన అంగిరసుడి మనవడు. ఆ బృహస్పతి గారబ్బాయి. నీ దగ్గరికి చదువుకోసం వచ్చిన బుల్లివాడు. ఇంకా బ్రహ్మచారి. రాక్షసు లతణ్ని చంపి బ్రహ్మహత్యా పాతకాన్ని నీ తలకు చుట్టారు. అతణ్ని ఖూనీ చేయాల్సిన కారణం ఏమిటి? అసలు. నీకు ధర్మాలు తెలియవని నేనెలా అనుకుంటాను? నువ్వే ఉపేక్షిస్తే, నే నతడికోసం ఏడవకుండా ఎలా ఉంటాను? అంది. కచుణ్ని వర్ణించింది. కులశీలాలు చెప్పింది. బ్రహ్మచారి అంది. చూడండి—తాను పెళ్లి కావలసిన పిల్ల. అతనింకా పెళ్లికానివాడు. తన కోరిక నామె చెప్పలేదు విప్పి. ధ్వనిస్తోంది ఆమె మాటల్లో అచ్యుత ధర్మజ్ఞ మహాత్మ యక్కచునకే శోకింప కెట్లుండుదున్ అనిపించాడు మహాకవి. అనౌచిత్యాన్ని క్రక్కే మాటలకి ఔచిత్యం మెరిసే మాటలే మందులు...తేరుకున్నాడు శుక్రుడు. చూశాడు కచుణ్ని. ఎక్కడున్నాడు? తన ఉదరంలోనే ఉన్నాడు. అతణ్ని బతికించాడు. అతడికి మృతసంజీవని ఉపదేశించాడు. తన్ను తిరిగి బతికించమన్నాడు. కచుడు బయటికి వచ్చాడు. గురువుని బతికించాడు మళ్లీ.

మాటలకి ఉండే శక్తి ఉచ్చారణలో కూడా ఉంటుంది. మాటల్లో శక్తి నిద్రపోతూ ఉంటుంది. అవి దక్షతగలవాడి ముఖ యంత్రంలోపడి నాదతంత్రుల సునిశితత్వంచేత పదునుపొంది వాగుత్పత్తి స్థాన కరణాల కదలికలోని గొప్పతనానికి కంపించి ఎదుటివాడి చెవుల్లోకేగాక గుండెల్లోకేగాక నరాల్లోకీ నెత్తుటిలోకీ దూసుకుపోగలవు. సుప్తమైన మాటల శక్తి ఆ విధంగా మేల్కొని శ్రోతను తడుతుంది. ఒక్కొక్కప్పుడు చప్పగా ఉన్న మాట కూడా ఛందస్సులోనూ శైలిలోనూ అతుక్కొని ప్రబలమై ఉచ్చారణదక్షుడి జిహ్వారంగం మీదనుంచి బాణంలాగ రివ్వున బయలుదేరుతుంది. ఇది ధ్వనికి సంబంధించిన రహస్యం. ఇంతకన్నా గొప్పది అర్థానికి సంబంధించిన రహస్యం. ఒక్కొక్కమాటనూ తూచి తూచి అర్థాను

గుణంగా అనురూప సందర్భం చూసి వాడితే అది శ్రోత తలలోకి దూరి చాలాసేపు మారు మోగుతుంది. దీనికే నీ ఉచ్చారణశక్తి తోడవుతుంది. ఆధునిక కాలంలో ఉచ్చారణశక్తి నీకు లేకపోయినా ఫర్వాలేదు. మన **Loud Speaker** నీకా శక్తిని ప్రసాదిస్తుంది. ఇది విద్యుచ్ఛక్తి. అంటే నీలోనాలో సహజంగా ఉండే ఉచ్చారణ శక్తి విద్యుత్తులాంటిదే.

శుక్రుడు బతికాడు. విగత జీవుడై పడియున్న వేదమూర్తి! అతనిచేత సంజీవితుడై వెలింగె! దనుజమంత్రి ఉచ్చారణ దక్షుచేత! అభిహితంబగు శబ్దంబు నట్ల పోలె'' అంటాడు మహాకవి. ఉచ్చారణ దక్షుడు కానివాడి నోటిలో మాటలు చచ్చిపోతాయి. మూర్ఛపోతాయి. వంకరలు తిరుగు తాయి. ఫలితాన్ని ఇవ్వవు. ఉచ్చారణచేత నయినవాడి నాల్కమీద మాటలు బతుకుతాయి. చైతన్యంతో నడుస్తాయి. ఎదుటి వాణ్ని నిద్రలోంచి మూర్ఛలోంచి రోగంలోంచి లేవదీస్తాయి. అందుకే అంటారు వైయాకరణులు— ఏమయ్యా మాటలు నేర్చా నంటావు. వ్యాకరణం చదివా నంటావు. మంచిది. ఒక్క మాటను దాన్ని అర్థాన్ని బాగా తెలుసుకుని, చక్కగా వాడి చూపించు. అది నువ్వు ఎక్కడికెళ్లినా, అన్నీ అమిరిఉన్న స్వర్గా నికి వెళ్లినా కామధేనువులా కనిపించి, నీ కోరికలన్నీ తప్పక తీరు స్తుంది'— అని వాగ్దానంచేస్తారు. మనకొక వరాన్ని ప్రసాదించారు.

నిఘంటువులనిండా మాటలున్నాయి. కవుల కావ్యాల నిండా ఉన్నాయి. ప్రజల నాల్కలనిండా ప్రవహిస్తున్నాయి. గాలిలో ఈదుతున్నాయి. కానీ వాటిని నువ్వు వాడటంలోగదా ఉంది నీ శక్తి. భావ శూన్యుడవైతే మాటల్ని వాడలేవు నువ్వు. మాటల్ని వాడ టానికి ముందు నీలో భావాలు పైకి రావాలి. అవి మేలుకోవాలి. భావం ప్రతిభావంతుడివయితే కలుగుతుంది. ఆ ప్రతిభ ఎలా వస్తుంది? పూర్వ జన్మల నుంచి వస్తుందంటారు కొందరు. ఈ జన్మలోనూ దాన్ని సంస్కారంవల్ల సంపాదించవచ్చునంటారు కొందరు. మంత్రతంత్రాదులవల్ల సాధిస్తాడు మరొకడు.

ప్రతిభావంతుడివయితే పాత మాటల కొమ్మల నుంచి కొత్త అర్థాల చివురులు తొడిగిస్తావు నువ్వు. మధుమాసం అడుగుపెట్టగానే ఆ పాత మోళ్లే చిగిరించి కొత్తవై కూర్చుం టాయి.

గ్రంథాల్లో కావ్యాల్లో అవి ఉన్న బీరువాల్లో పాపం మాటలు నిద్రపోతున్నాయి. అవి మహాకవులచేత వాడబడ్డా, వాటి కింకా నిద్ర తప్పనేలేదు. నువ్వు మాటల తామరపువ్వులకి కాస్త వెలుగునిస్తూ ఉదయించాలి. అవి లేచి, రెక్కలు విప్పుకుని, కనిపించి, ఇంద్రియాలకు బువ్వ పెడతాయి.

ప్రియమైన పాఠకుడా నువ్వు మమ్మల్ని మౌనంగా చద వాలని చూస్తావు. మేము చచ్చిపోతున్నాం మహాకవులు మమ్మల్ని పద్య బంధాల్లో గేయపంథాల్లో ఉంచారు. గణసూత్రాలకి గుచ్చారు. మేమే చప్పని వచనాల్ని వద్దు పొమ్మన్నాం. పద్యాల్లో పాటల్లో మేము హాయిగా నిద్రించగలం. మమ్మల్ని గట్టిగా చదువుకో మేము చటుక్కున లేస్తాం. అలాగే చదువుతూ ఉండు. నీ హృదయ సముద్రంలో తరంగాల్లా మేము పొంగుతూ ఉంటాము. చచ్చినా, మమ్మల్ని నిమ్మళంగా చదవకు; నీకు పుణ్య ముంటుంది— అంటున్నాయి మాటలు. ఆ రహస్యం గుర్తించండి అంటున్నాను నేను.



చూచి ఆనందించండి!
మనోరంజని పిక్చర్స్
భారతి
నిర్మాత: కె.వి.రెడ్డి
కథ-స్క్రీన్‌ప్లే-మాటలు-దర్శకత్వం: వేటూరి
సంగీతం: కీ.శే. ఎస్.పి.కోదండపాణి
నేపథ్యసంగీతం సత్యం
కెమెరా: దేవరాజ్
ఆంధ్రా సీడెడ్
విజయా కంబైన్స్
నైజాం
విజయా సురేష్ కంబైన్స్
మైసూర్
చిత్ర చేతనా మూవీస్

ఆశ

శ్రీ వాడపల్లి విజయభాస్కరరామారావు

బయుట ఎండ కొంచెం తగ్గింది. అప్పుడే పక్క గదిలోంచి సియస్టా నుండి లేచి వచ్చిన వెంకట్రామయ్యగారికి ఇక ఊపిరి తీసుకోడానికి వ్యవధి ఉండదు. క్రిందకు వెళ్ళి ప్రెస్ అంతా వో మాటు చూచి రావాలి. సంపాదకీయం రాయాలి. తీసుకోవలసిన నిర్ణయాలు చాలా ఉన్నాయ్. ఆలోచిస్తూనే క్రిందకెళ్ళి నాలుగూ వో మారు చూసి వచ్చేసరికి పోస్టు వచ్చింది. గుమాస్తా సార్ట్ చేసి తన సొంత ఉత్తరాలను తన గదిలోకి పంపించాడు.

ఉత్తరాల బొత్తిలో పసుపుబొట్ల కవరు. ముందు అదే తీశారు వెంకట్రామయ్యగారు పెళ్ళి ఎవరికా అనుకుంటూ.

బాబాయివద్దనుండి శుభలేఖ. కొడుక్కి పెళ్ళి. పెళ్ళి కార్డుమీద బాబాయ్ కనపడుతున్నాడు.

తన నెంత ముద్దుచేసేవాడు బాబయ్య! తనకీ బాబయ్యంటే ఎంతో ప్రేమే. తన కంటె సుమారు పదేళ్ళు పెద్దేమో? తల నెత్తుకుని ఆడించేవాడు చిన్నతనంలో. బాబాయిని చూచి ఏన్నాళ్లయింది ? వో మారు వెళ్ళివస్తే! అబ్బే తనకు ఊరు కదిలేందుకెక్కడ దొరుకుతుంది అవకాశం ?

పెళ్ళి అయిన తరువాత బాబాయిని కొడుకునీ కోడలినీ తీసుకుని హైదరాబాదు రమ్మంటే ?

ముందు పెళ్ళి పిలుపును గురించి కామాక్షికి చెప్పాలి. "గ్రేస్! కామాక్షిని పిలుస్తావా?" టేబిల్ మీద ఫోన్ తీసి ఆపరేటర్‌కు చెప్పాడు.

భర్తకు క్యారియర్ సర్ది, కొడుకు అరుణకు వడ్డించి తనూ భోజనం చేసి వో అరగంట పడుకుందామని తనగదిలో కెళ్లింది కామాక్షమ్మ. అంతే నిద్రపట్టేసింది.

"హలో, ఎడిటర్ వెంకట్రామయ్యగారి ఇల్లు" ఆవులిస్తూ అంది.

"కామాక్షమ్మగారా! పంతులుగారు మిమ్మల్ని పిలవమన్నా రమ్మా!"

వెంకట్రామయ్యగారిని కార్యాలయంలోని వారందరూ పంతులుగారని పిలవడం రివాజు. ఈ వేళలో అంత అర్జంటు పనేమిటి చెప్మా అని ఆత్రంగా వింటోంది కామాక్షమ్మ.

బల్లమీద ఫోన్ మోగగానే తీసుకున్నారు వెంకట్రామయ్య "కామాక్షీ, బాబాయి వద్దనుండి ఇప్పుడే శుభలేఖ వచ్చింది. రాజేంద్రుణ్ణి జ్ఞాపకం ఉందా, కృష్ణమూర్తి బాబాయి కొడుకు. ఇన్నాళ్లకి పెండ్లికి ఒప్పుకున్నాడన్న మాట. నారాయణమూర్తి గారని నాన్నగారి స్నేహితుడు. నీకు జ్ఞాపకం ఉందా ? అతని కూతుర్ని ఇచ్చి పెళ్లేట ముఫ్ఫైయవ తేదీని. ఇక నాలుగు రోజులే ఉంది పెళ్ళి. అరుణని తీసుకుని నువ్వెళ్లరాదూ. ఎలానూ వాడికి పరీక్షలై పోయాయి కదా!"

"మీరూ రాకూడదూ!"

"నాకెక్కడ తీరిక ? ఇక్కడ పత్రికో! నాకైతే రావాలనే ఉందికాని దేశంలో రాజకీయ పరిస్థితి... విద్యార్థుల అల్లర్లు..."

"సరేలెండి వాటిని గురించి పత్రికలో రాద్దురుగాని" కస్సుమంది. ఎడిటర్‌గారికి ఏమనాలో తోచలేదు. కామాక్షమ్మ ఊరికే భర్తమీద విసుక్కుని బుసలుకొట్టే సామాన్య స్త్రీ కాదు.

ఏం మాటాడాలో తోచకా, ఫోన్ పెట్టేసి భార్య మనసు నొప్పించనూ లేక, మెల్లగా అడిగారు:

"అరుణ ఏంచేస్తున్నాడూ ?"

"భోజనం చేస్తుండగా పక్కవాళ్ళ మహేందర్ వచ్చాడు. ఇద్దరూ ఎక్కడికో వెళ్ళారు."

"రేపురాత్రే బయలుదేరాలి. కావలసినవన్నీ సర్దుకో. నేను ఏడింటికే ఇంటికొచ్చేస్తా" ఫోన్ పెట్టేసి మళ్ళీ తీసారు.

"గ్రేస్ ! ట్రేడ్‌వింగ్స్‌కి ఫోన్‌చేసి విజయనగరానికి రేపు ఎక్స్‌ప్రెస్‌లో రెండు ఫస్ట్ క్లాసు బర్త్స్ బుక్‌చేయించు. టిక్కెట్లు ఇంటికి పంపమను నా ప్రయివేటు ఎకౌంట్‌లో బిల్ చేయమని చెప్పు."

* * *

టేంక్‌బండ్ మీద స్కూటర్ శరవేగంతో పోతోంది.

"ధీరేసే జానాభాయ్ ! " పిలియన్‌మీద కూర్చున్న మహేందర్ అన్నాడు అరుణ చెవిలో.

"చూ(డా, ఆటాక్సీవాడి పొగరు, మనకంటె ముందువెడదామని!" టాక్సీవాడికి సైడ్ ఇయ్యకుండా రోడ్డుమధ్యగా వెడుతున్నాడు. అటునుండి సరాసరిగా లారీ నడుపుకుని వస్తున్నాడు. వాడి స్పీడు చూస్తుంటే అరుణకే భయం వేసింది. చటుక్కున గేరుమార్చి ఎడమకు తప్పుకుని లారీ వెళ్ళగానే మళ్ళీ రోడ్డు మధ్య కొచ్చాడు.

అరుణని మాటాడిస్తే మరీ ప్రమాదమని నోరుమూసుకు కూచున్నాడు మార్వాడీ మహేందర్.

కిశోర్ ఇంటిలో కలసిన మిత్రులకు ఊక దంపుడులో కాలం తెలియటంలేదు. "రేయ్ మహేందర్, నువ్వేం చెయ్యాలనుకుంటున్నావ్‌రా?" సడన్‌గా అడిగాడు కిశోర్.

"అరెయార్, ఇప్పుడెందుకురా ఆ గొడవంతా, రిజల్ట్స్ రానీయ్."

"వాడికేంరా, వాళ్ల నాన్న బిజినెస్‌లో దూరిపోతే సరి". అన్నాడు కరుణ.

"సి మొహం. ఏడిశావ్, నాకు పితాజీ బిజినెస్‌తో క్యా జరూరత్, ఓ చిన్న ఫ్యాక్టరీ పెట్టుకుంటాను."

"అది మరీ మంచిదిరా, మరో పది మందికి ఉపాధి కల్పించినట్టవుతుంది. నన్ను జనరల్ మేనేజర్‌గా వేసుకో. నెలకు వెయ్యి చాలు." మాష్టారి అబ్బాయి ప్రసాద్ అన్నాడు.

"పాపం మనవాడు అల్పసంతోషి!" అరుణ కామెంట్ చేశాడు.

"ఒరేయ్ అరుణా నువ్వేం చెయ్యాలనుకుంటున్నావ్‌రా?" కిశోర్ అడిగాడు.

"నేనా, నాకేం చెయ్యాలని లేదు".

వాడికేంరా. కుసుమ్‌ని పెళ్లాడి సంసారం చేసుకుంటే చాలు. ఆమె ద్రాక్ష తోటలన్నీ వాడివే. వ్యవసాయం మనవాడికి పట్టుబడాలి కాని"... సాగదీశాడు తెలివిగా ప్రసాద్. కుసుమ్ అనగానే ఒళ్ళు గగుర్పొడిచింది అరుణకి. వాచీ చూసుకున్నాడు నాలుగే అయింది. ఆరింటికి వస్తాను రెడీగా ఉండమని చెప్పాడు ఆమెకి.

కుసుమ్ తండ్రికి ఒక్కర్తే కూతురు. కాబోయే అల్లుడే ఆసరా కావాలనుకుంటున్నాడు ముసలాయన. చాలా మర్యాదస్తుడు. మంచివాడు.

ఒరేయ్ ఇవాళ మనమంతా ఏడింటికి సరోజినిదేవి రోడ్‌లో నియోరిట్జ్‌లో ములాకత్ కావాలి. చాల రోజులైంది బార్‌కిపోయి. వెధవ పరీక్షలు...హడావుడి. ఓమారు ఖుషీ చెయ్యాలి."

ప్రసాద్, అరుణ సాంగత్యంతో తెలుగు బాగా పట్టుబడింది మహేందర్‌కి.

అరుణ ఆలోచనలకి ఆకస్మికంగా అవరోధం కలిగింది. "మొన్ననే అమ్మ దగ్గర ఓ వంద తీసుకున్నారా...మరి ఇవ్వదు" నిట్టూర్చాడు.

"అరే భాయ్, ఇస్‌మే క్యాహై. మత్‌గభ్‌రావ్. పైసా మేరా పాస్ హై!"

"పైసా కాదురా చిట్టితండ్రీ, ఇవాల్టికి నన్నొదిలెయ్యండి. నాకు వేరే పనుంది." ఎలా బయటపడాలో తోచలేదు అరుణకి.

"బోధ పడిందిలేరా!" కిశోర్‌గాడు వెధవ. ఊరుకోరాగూ, విసుగ్గా ఉంది అరుణకి.

"క్యా మత్‌లబ్, కుసుమ్‌కే వాస్తే క్యా?"

మిత్రులంతా నవ్వారు.

* * *

కామాక్షమ్మ మనసు గ్రామం మీదకు పోయింది. గ్రామం వెళ్లి ఎన్నాళ్లయిందీ! మళ్ళీ అందరినీ చూడొచ్చు. ఎంత హైదరాబాదు జీవితానికి అంకితమైపోయినా మళ్ళీ స్వగ్రామంలో ఓ వారం రోజులుండాలంటే ఎంత ఉత్సాహం!

అన్నయ్య పద్మనాభం కూడా పెళ్లికి వస్తాడు. వాడికేం మహారాజు. ఇల్లు కదలవలసిన అవసరం లేదు. అథవా వ్యాపారరీత్యా ఎక్కడికైనా వెళితే మూడోరోజు రాత్రికి తిరిగి వచ్చేస్తాడు. నిర్మల ఎలాగైనా అదృష్టవంతురాలు.

అనూరాధ ఎలా ఉందో! అనూరాధ ఇప్పుడు పెళ్ళి కూతుర్ని పెంచుకున్న తల్లి, నారాయణమూర్తిగారి భార్య. పాపం అనూరాధ. తను కాపురానికి వచ్చేసరికే అనూరాధకు పాతికేళ్ళు పైబడ్డయ్.

పిల్లలకోసం ఎన్ని నోములూ, వ్రతాలూ, చేసిందనీ! కన బడ్డ ప్రతిరాయికీ, రప్పకీ పుట్టకీ, గట్టుకీ మొక్కింది. అభిషే కాలు చేయించింది. పూజలు చేసింది. తీర్థాలు సేవించింది. భొత్తిగా సత్తెకాలపు మనిషి.

నారాయణమూర్తిగారు కొద్దిగా చదువుకున్నారు.

మంత్రాలని చింతకాయలు కొట్టలేని శబ్దాలని తీసిపారె య్యక పోయినా, ఎందుకేనా మంచిదని పెద్ద పెద్ద డాక్టర్లను సంప్రదించారు. దంపతులిద్దరూ ఏవేవో మందులు వాడారు. అనూరాధ ఆపరేషన్ చేయించుకుంది. లాభం లేకపోయింది. మాన సికంగా కుంగిపోయారు దంపతులు. పోనీ వారు పెంచుకున్న ఈ అమ్మాయికైనా సంతానం కలిగితే వారి లోటు కొంత తీరు తుంది.

క్రింద స్కూటర్ శబ్దం.

"అమ్మా రాత్రి సినిమా కెళుతున్నాం. నేనొచ్చేసరికి ఆల స్యం అవుతుంది."

సినిమా సరేలేరా, బట్టలుసర్దుకో, గంట్వాడ తాతగారింటికి వెళదాం. రాజేంద్రుడి పెళ్ళట, నాన్నగారు చెప్పారు."

"గంట్వాడా, పెళ్ళికి నే నెందుకమ్మా, నువ్వెళ్లరాదూ, నాకు చాలా పనులున్నాయ్. ఫ్రెంచిక్లాసులు పోతాయ్. నేను రావడానికి వీలుకాదమ్మా!" తువాలు తీసుకొని బాత్‌రూమ్ లోకి వెళ్ళి పోయాడు

—ఇంటిదగ్గర కామాక్షమ్మ మనసుతోబాటు ఆఫీసులో అర్జంటుగా సంపాదకీయం రాయాల్సిన వెంట్రామయ్యగారి మనసు కూడా గతంలోకి పోయింది

నాన్నగారంటే తనకెంతో భయం. బాబాయి తన నెంతో గారంగా చూసేవాడు. తను స్కూల్లో చదివేరోజుల్లో తన మీద ఈగవాలనిచ్చే వాడు కాదు. ఊళ్లో తనసైజు కుర్రకాయలందరికీ బాబాయంటే హడల్.

తనుచిన్నప్పటినుంచీ భావ ప్రపంచంలోనే విహరించేవాడు. పిల్లలందరితోనూ కలిసి ఆటలాడడం తనకు చేతకాని పని. తనలాగే దూరంగా కూచునే మరో పిల్లవాడుండేవాడు; గుర్నాథం అని. ఇప్పుడెక్కడున్నాడో! అతన్ని మిగిలిన పిల్లలంతా బాగా ఏడి పించేవారు. క్లాసులో అతని పుస్తకాలు మాయమైపోతూ ఉండేవి. కంపసు బాక్సులో ఉండవలసినవి ఉండేవికావు. పుస్త కాల మీద, ముఖ్యంగా కాంపొజిషన్ పుస్తకంమీద ఇంకుసీసా బోర్ల గిల పడుతూఉండేది.

అన్నిటికీ అందరూ మేష్టారు వద్ద గుర్నాథం మీదే రిపోర్ట్ చేసేవారు. ఇలా అల్లరిపట్టించే కుర్రాళ్ళు తనజోలికి మాత్రం వచ్చేవారుకారు. తను ఎక్కడో కూచుని చదువుకుం టుండేవాడు.

"ఆ కృష్ణమూర్తి చంపేస్తాడోయ్!" అంటూ తనజోలికి మాత్రం వచ్చేవారుకారు...ఈ పెళ్ళి కెలా వెళ్ళడం?

తన కాలం తన చేతిలోలేదు. పత్రికా తన సర్వసం అయి కూచుంది. సుమారు ఇరవై ఏళ్ళయింది తను హైదరాబాదు వచ్చి. ఎప్పుడూ మూడురోజులు ముందు స్వగ్రామం వెళ్ళలేక పోతున్నాడు. అదైనా నాలుగైదేళ్ల కొకసారి.

పత్రిక మీద తనకు పూర్తి పెత్తనం వచ్చినదగ్గరనుండీ ఊరు కదలడమే కష్టంగావుంది.

అమ్మనీ, నాన్నగారినీ చూసి యెన్నాళ్ళయింది? వాళ్ళే యెప్పుడైనా యిటు రావడం కాని తనెప్పుడైనా వెళ్ళి వాళ్లతో ఓ నెల రోజులున్నాడా ?

ఇదిగో మరో రెండేళ్ళు, తనింక రిటైరైపోవాలి. అరుణ ఎం. ఏ. పూర్తి అయితే ఓ సంవత్సరం జర్నలిజం చదివించి తనదగ్గరే కొన్నినెలలపాటు తరిఫీదిచ్చి మెల్లగా వానప్రస్థం పుచ్చు కోవాలని ఆశ. కొడుకు పెద్దయి కాలేజీ క్లాసులోకి వచ్చినప్పటి నుండీ తన కదే ఆరాటం.

ఆలోచిస్తూ ఉత్తరాలు తిరగేస్తుండగా నాన్నగారి దస్తూరీతో కార్డు. చి. వెంకట్రామయ్యకు.

నాన్న ఆశీర్వచనములు. ఉభయకుశలోపరి. కృష్ణమూర్తి కొడుక్కి 30 వ తేదీన పెళ్ళి. చాలా రోజులనుండి అనుకుంటున్న సంబంధమైనా ఇంత జరుగుర్‌గా పెళ్ళి జరుగుతుందని అనుకో లేదు. కాల వ్యవధి లేదు. కోడలినీ, అరుణనీ తీసుకుని తప్పకుండా రా. ముసలివాళ్లమయి పోతున్నాం. నీ పేపరుకోసం కన్నవాళ్ళను వదిలేస్తావా? మీ అమ్మ ఆరోగ్యం బాగులేదు. చూడాలని ఉందని మరీ మరీ రాయమంది.

నాన్న.

నాన్నగారికి తనేం చెయ్యగలిగాడు ?

అంత పొలాన్ని ఒక్కరే చూసుకుంటూ నానా యాతనా

పడుతున్నారు. అమ్మకి కన్ను ఆపరేషన్ అని రాస్తే ఐదేళ్ళ క్రితం విశాఖపట్నంవెళ్ళి ఆస్పత్రిలో ఉన్న అమ్మని ఓ గంట చూసి మళ్ళీ విమానం ఎక్కేశాడు. వాళ్ళకడుపునపుట్టి తనువాళ్ళనేం సుఖ పెట్టినట్టు ?

మనసులో ఆరాటపడుతుంటే తన కోరిక, తన ఆశా జ్ఞాపకం వచ్చాయ్. తన కొడుకు తన వృత్తిని స్వీకరించి తనకు కొంత భారాన్ని తగ్గిస్తాడని తనెంత ఆశిస్తున్నాడు? తన తల్లి దండ్రుల ఆశ తనేం తీర్చేడని తన కొడుకుమీద తనకంత ఆశ?

"ఆశా, ఆకలీ, అందరిదీ ఒకటే"

—బామ్మ మాటలు జ్ఞాపకం వచ్చాయ్.

ఛీ, తన జీవితం వ్యర్థం!

"అయ్యగారూ, డిక్టేషన్ తీసుకోడానికి రమ్మంటారా అని శేఖర్ బాబుగారడుగుతున్నారు."

—మెల్లగా జవాను చెప్పాడు సొంతం గదిలోకి రాకుండానే.

"ఈ వేళ నా వంట్లో బాగులేదు. శేషయ్యగారి దగ్గరకు వెళ్ళమని చెప్పు."

—బొంగురుపోతున్న గొంతుతో సమాధానం చెప్పి కండువాతో కళ్ళు తుడుచుకున్నారు వెంకట్రామయ్యగారు.

స్వాగతి

శ్రీ శనగన నరసింహస్వామి

1

కొమ్మకొమ్మకు సభచేసి కోకిలములు
తీగతీగకు మూగి యిందీవరములు
కలరవమ్ముల నీకు స్వాగతముపలికె
రాక్షసాహ్వయహాయనా! రమ్ము! రమ్ము!

2

పేరు గొప్ప లోన సారమ్ము శూన్యము
నేతి బీరకాయ ఖ్యాతియెల్ల
అరిగె ధరలు పెంచి యానందవర్షమ్ము
రమ్మగాది! సౌఖ్య రాజవీధి!

3

కేవలసుఖమ్ము తృప్తికి త్రోవకాదు
దుస్సహము నిత్యదారిద్ర్య దుఃఖభరము
చేదుతీపుల కొకపాటి చెలిమిచెల్లు
బ్రదుకు చూపుము! నూత్నసంవత్సరాది!

నన్నయ ప్రస్తావించిన

"ఈశ్వరాగమ" భక్తిమార్గము

డాక్టర్ వి. వి. ఎల్. నరసింహారావు

శ్రీమదాంధ్ర మహాభారతము యొక్క అవతరణమునకు ఆది కారణులయిన పుణ్యులు నన్నయ రాజరాజ నరేంద్రులు. వ్యాసభారతము 'నధికధీయుక్తితో తెనుగున రచియింపు' మని రాజరాజు నన్నయ కానతి యిచ్చుటకు ముందు ఆ ప్రభువు తనకు 'కరం బిష్టము' లయిన అంశము లొక కొన్ని వక్కాణి చెనట.

రాజరాజు 'విమలమతితో పురాణములు విన్నవాడు; అనేకములయిన అర్థ ధర్మశాస్త్రముల తెఱంగెఱిగినవాడు; ఉదాత్తరసాన్వితకావ్య నాటకక్రమములు పెక్కులు చూచినవాడు! అంతే కాదు— "జగత్పరి పూజ్యములైన ఈశ్వరాగమములయందు ప్రకాశముగా హృదయంబు భక్తితో నిల్పినవాడు. (ఆది 1–10)

ఇంతచేసియు 'ఆయనకు శ్రీ మహాభారతమునందలి అభిప్రాయము వినవలయునన్న అభిలాష మాత్రము పెద్దయై యుండెను. (ఆది 1–11)

ఆయనకు కరంబిష్టములైన అంశము లయిదు గలవు: భూదేవకులాభి తర్పణ మహీయః ప్రీతియు, భారత శ్రవణాసక్తియు సంతత దానశీలతయు, శశ్వత్సాధు సాంగత్యమును— పార్వతీపతి పదాబ్జధ్యాన పూజా మహోత్సవము'— నననవే ఈ అయిదంశములును. (ఆది 1–12)

రాజరాజ నరేంద్రుని సంకల్పాభీష్టములను, సంస్కార విశేషములను వివరించు నీ వాక్కులలో భారత శ్రవణాసక్తితోపాటు ఒకటికి రెండుమార్లు నొక్కి వక్కాణింపబడిన అంశములు జగత్పరి పూజ్యములైన "ఈశ్వరాగమములయం దాయనకుకుదురు కొన్న భక్తియు; పార్వతీపతి పదాబ్జ ధ్యానపూజామహోత్సవమందలి రక్తియు— అనునవి.

ఇంతకు రాజరాజు న భీప్సితముగా నన్నయ ప్రస్తావించిన ఈ "ఈశ్వరాగమ — భక్తి" మార్గ మెట్టిదై యుండును?

రాజరాజా నభీప్సితమెరిగిన, నన్నయ భారతానువాద మూలమున తనతేని 'ఈశ్వరాగమ—భక్తి మార్గమును యధావకాశము సూచించు టసహజము కాదుగదా!

శివభక్తి విషయకముగా హృదయములో ఇట్టి అభీష్టము కలుగుటకు పెక్కు కారణములు గలవు. తూర్పు చాళుక్య ప్రభువులలో కుబ్జ విష్ణువర్ధనుడు మొదలుగా రాజరాజు వరకుగల ఆంధ్ర ప్రభువులలో పలువురు జైన మతాభిమానులై వైదిక మతమునకు సంపూర్ణ సహకార మొసంగినవారు కారైరి. అందాక యెందుకు? రాజరాజు తండ్రియైన విమలాదిత్యుడు జైన మతావలంబి. త్రికాలయోగి సిద్ధాంతదేవుడను జైనాచార్యునకు శిష్యుడు. జైనమతావలంబి యయ్యును ఈతడు మత సహనము కలవాడై యజ్ఞయాగాది క్రతువులొనర్చిన కర్మిష్ఠులకు సైతము గ్రామదానము లొనర్చెను. ఈతని మంత్రియగు వజ్జియ ప్రగ్గడకు ఈతడొనర్చిన రణస్థలపూడి గ్రామదానమే యిందుకు నిదర్శనము. ఇట్లు తన తండ్రి వైదికము నెడ బద్ధద్వేషి కాకున్నను జైనమాదరించిన వాడగుటచే రాజరాజు అట్లుగాక తానభిమానించిన వైదిక మతమునకు శివభక్తి తాత్పర్యముతో ప్రశస్తి కల్పింప నెంచెను.

ఒక విధముగా నీ విషయమున రాజరాజునకు కాలము కూడ కలిసివచ్చెను. నాటికి కొంతకు కొంత జైనుల పశుపతి నాధుడు పార్వతీనాథుడై పొడగట సాగెను. జైనుల వృషభమూర్తి నంది మూర్తియై బుసలు కొట్టసాగెను. తంత్రశక్తి స్వరూపముల ప్రభావముచే బౌద్ధ జైనములు క్షీణదశ నందసాగెను. నకులీశ పాశుపత ప్రభావముచే జైనము శైవముగా పరిణతి నందదొడగెను. శుద్ధ జైనులు కనుమఱుగై వారే క్రమముగా జైన ప్రభువులుగను, జైన బ్రాహ్మణులుగను జైన గోమఠంలు

(కోమటులు) గనఁ పొడసూపగా తిరిగి వర్ణవ్యవస్థ స్పష్ట రూపమున కనుపట్టసాగెను.

అటు ద్రవిడ దేశమున ఆళ్వారులు, శఠగోపుడు, నాథముని మొదలగువారు భక్తిమార్గమును ఉణ్ణమొనర్చుటకు మహా ప్రయత్న మొనర్చుచుండిరి. శైవమునకు భక్తివాసనలు సోకించి నయనారులు జన జీవితమును మిక్కిలిగా నాకరించుచుండిరి. ఈ భక్తివాసనలు రాజరాజు శుద్ధాంత సదనములలోనికి పాకి కమ్మతావులు గుబాళింపజేయసాగెను. అన్నట్లు రాజరాజు తల్లి యగు "కుందన" తంజాపుర పాలకుడగు చోళ నృపాలుని కొమార్తె. రాజరాజు భార్యయగు 'అమ్మంగదేవి' రాజేంద్రచోళుని కొమార్తె. ఇట్లు పుట్టింట—అత్తింట ప్రాకివచ్చిన భక్తి రాజరాజ నరేంద్రుని ఆత్మతత్త్వమై "ఈశ్వరాగమముల"యందలి పరమ "భక్తి"గా పరిణమించెను. 'పార్వతీపతి పదాబ్జధ్యానపూజా మహాత్త్వవమీ కారణముచేకూడ నాతనికి 'కరంబిష్ట'మయ్యెను.

వైదికమతాభిమానముతో గూడిన ఈశ్వరాగమ భక్తి, బ్రాహ్మణ రక్తి, భారత శ్రవణాసక్తి— ఈ సర్వమునకు సంబంధించిన అంతర్మథనమును రాజరాజు తనకు (నన్నయకు) ఎఱిగించి "జననుత కృష్ణ ద్వైపాయన ముని వృషభాభిహిత భారత బద్ధ (శబ్ద—అని పాఠాంతరము) నిరూపితార్థ మేర్పడఁ దెనుగున నధిక ధీశక్తితో రచన సాగింపవలసినదిగా కోరినట్లు నన్నయ వ్రాసెను.

రాజరాజు కోరిన కోర్కె సుందరోదారముగనే యున్నది. కాని యాయనకు కరంబిష్టంబులైయున్న యంశములన్నియు ఆంధ్రభారతమున నభివ్యక్త మొనర్చుటలోనె నన్నయ క్లేశమంతయు నున్నది. రాజరాజు సంకల్పము నన్నయ కభీష్టము కానిచో ఇబ్బందియే లేదు. కాని వచ్చిన ఇబ్బందియంతయు రాజరాజు సంకల్పమేదియో నన్నయ అభీష్టమును నదేయగుట ఈ రాజ కవుల సంకల్పాభీష్టము లొకదానితో నొకటి సంవందిచుకొనుటలో నన్నయ బరువు బాధ్యతలు పెరిగినవి. ఇంతటి బరువు బాధ్యతలందును నన్నయ కేర్పడిన గొప్ప సౌకర్యములలో నొకటి యేమనగా—తమ సంకల్పాభీష్టములు సిద్ధించుట కనుకూలములైన మూలపదార్థము లన్నియు వ్యాస రచిత భారతామ్నాయమునందే సన్నివిష్టములై యుండుట. వాని నక్షర రమ్యముగా తెనుగున తీర్చిదిద్దుటయందే నన్నయ ప్రజ్ఞ యావశ్యక మయ్యెను.

'పార్వతీపతి పదాబ్జ ధ్యాన పూజమ హాత్త్వవ' తత్పరమైన రాజరాజు హృదయము సుప్రకాశితమైన భక్తితో 'ఈశ్వరాగమముల'యందు నిల్చియున్నట్లు నన్నయ గుర్తించెను. ఇంతకీ 'ఈశ్వరాగమము లనగా నేవి? సంప్రదాయము ననుసరించి ఇందు ప్రమాణములు మూడు. (1) ప్రత్యక్షము (2) అనుమానము (3) శ్రుతి. శ్రుతి శబ్దముచే వేదోపనిషత్తులను అష్టవింశతి శైవాగమములును గ్రాహ్యములు. ఈ శైవాగమములు సంహితము ప్రామాణ్యవివక్షచే తిరిగి రెండు వరములుగా గోచరించుచున్నవి. (1) శివాగమములు. (2) రుద్రాగమములు. ఇందు శివాగమములు వరత్రయముచే ననుసరింపబడుచున్నవి. ద్విజాతులకే పరిమితమయిన శివాగమములు మొత్తము పది (1) కామితాగమము (2) యోగజాగమము (3) చింత్యాగమము (4) కారణాగమము (5) అజితాగమము (6) దీప్తాగమము (7) సూక్ష్మాగమము (8) సహస్రాగమము (9) అంశుమదాగమము (10) సుప్రభేదాగమము — ఇవి యే ఈశ్వర ప్రోక్తములగు, మూలాగమములుగా విశ్వసింపబడినవి. కనుక 'ఈశ్వరాగమ'ములుగా నివియే యని గ్రహింప నగును. రాజరాజు హృదయము భక్తితో నిలిచిన దీ ఈశ్వరాగమములందే యనిపించును. వీనినే శైవాగమములనియు నందురు

శైవ సిద్ధాంతమున పతి యనగా ఈశ్వరుడు పశువనగా జీవుడు. పాశమనగా సంసారము. జీవేశ్వర సంసారత్రయమునకు సంబంధించిన తత్త్వాన్వేషణమే శైవ సిద్ధాంతమున ప్రధాన సూత్రము. పశు—పతి—పాశము లనెడి త్రికమును గూర్చిన విచారమే శైవాగమములందలి ప్రధాన విషయము.

శైవము ప్రధానముగా మూడు భేదములతో నున్నట్లు సుప్రభేదా ద్యాగమములు చెప్పుచున్నవి.

(1) శుద్ధము (2) సామాన్యము (3) మిశ్రము. ఇందు శుద్ధము శివేతర దైవము నంగీకరింపదు. సామాన్యము అన్యదేవతాద్వేషము లేక సర్వత్ర శివ భావన కలిగియుండును. మిశ్రము' ఈ ఉభయమునకు మధ్యేమార్గ గామి. అనగా అన్యదేవతా పూజను సైతము నంగీకరించి శివభక్తికే ప్రోప చూపు పద్ధతి. రాజరాజిట్టి మిశ్రమ శైవమునే ఆదరించినవాడుగా తోచును. అన్య దేవతాపూజ అనిష్టముగాని పార్వతీపతి పదాబ్జధ్యాన పూజామహాత్త్వవ తత్పరు డాయన. నన్నయయు ఇట్టి పద్ధతినే అవలంబించెను. కనుకనే సమచిత్తముతో వేదత్రయమూర్తులయిన 'పురుషోత్తమాంబుజ భవశ్రీ కంధరా' ప్రస్తుతి తోనే కార్య మారంభము చేసెను. అయినను ఈశ్వరాగమములయందలి భక్తిచే నెడనెడ సందర్భానుసారముగా శైవ సంప్రదాయములను నన్నయ భారత కథలో పెక్కుతావుల ప్రపంచించెను. ఇందుకు నిదర్శనముగా ఒకటి రెండు సందర్భములను పరిశీలింపవచ్చును.

అర్జునుడు పాశుపతాస్త్రము పడసిన సందర్భమున్నది. ఇచ్చట నొక ప్రశ్న తారసిల్లును ''పాశుపతమునకు సంబంధించిన కథలో పశుపతి ప్రసక్తి రాక యేమగును? అంతమాత్రమున అచ్చట పాశుపత సిద్ధాంతమో ప్రత్యభిజ్ఞాసిద్ధాంతమో ప్రతిపాదితమైనట్లగునా?'' అని— నిజమే; కాని ఒకసంగతి మరువరాదు పేరు ప్రసక్తికి వచ్చుట వేఱు; సంప్రదాయార్థము స్పష్టముగా భాసించుటవేఱు. ఈ రెండవ పద్ధతి గోచరించినపుడు సిద్ధాంతము ప్రతిపాదితమైనట్లే భావింప వచ్చును

దివ్యాస్త్రలాభ ముద్దేశించి అర్జును డీశ్వరుని గూర్చి తపస్సు చేయుటకై ఇంద్రకీలముపైకి పోబోవునపుడు నన్నయ ఈ క్రింది పద్యము వ్రాసెను

> వీరుఁడు యోగవిద్యయును విల్లును తోడుగ నింద్రకీలమన్
> భూరినగంబుపైఁ గడఁగి పోవగబోయెనట [అర1–286]

అస్త్రార్థియై పోవుచున్నాడు కనుక విల్లుతోడుగా అర్జునుడు బయలుదేరి నాడనవచ్చును. మఱి యీ ''యోగవిద్య'' యేమి? తపము చేయుటకై బయలుదేరెను గనుక నిది యావశ్యకమా? నిజమున కిది అర్జునుడు తనంత తాను సాధించినది కాదు. దయాశాలియగు వ్యాసుడు ధర్మజుని ద్వారమున అర్జునునకా యోగవిద్య'' ప్రసాదించెను. దివ్యాస్త్ర విదులగు భీష్మద్రోణాదుల నోర్చుటకై అర్జునునకు వలసిన అస్త్రలాభము కలిగించుటకై అతని తపస్సున కీ యోగవిద్య ఆవశ్యకము కాబోలు! అట్టియెడ వ్యాసుడు దీనిని నేరుగా నర్జునున కుపదేశింపరాదా? అట్లుప దేశింప గూడని విద్యయేమొయిది? దీనిపేరు ''ప్రతిస్మృతి'' కదా! ఉపదిష్టుడు ప్రతిస్మృతి పూర్వకముగా గ్రహింపదగిన విద్య యన్నమాట. ప్రయోజనము పొందువాడగు అర్జునుడు వ్యాసోపదిష్టమైన యా విద్యను ధర్మజుడు ముందు స్మరణ చేయగా పిమ్మట ప్రతిస్మరణ పూర్వకముగా ఆతని నుండి తాను గ్రహించెను. పరమ గుహ్యములయిన విద్యలు గురువులు నేరుగా నుపదేశింపక శిష్యుల మూలమున ప్రశిష్యుల కుపదేశించు టయు గలదు 'ప్రతిస్మృతి' యెంతటి గుహ్య విద్యయో వ్యాసుడు ధర్మజున కుపదేశించుచు నిట్లు చెప్పెను.

> ''అధిక యోగ లబ్ధ, మతి రహస్య,
> మీ విశేష విద్య సేవింపఁగా బార్థు
> బనుపు; మితఁడు దీన బడయు సిద్ధి'' అర1–275

ఇంత స్పష్టముగా కాకున్నను ఇట్టి విశేషార్థము మూలమునందును ప్రతిపాదింపబడినది

> తత ఏకాంత మున్నీయ పారశర్యోయుధిష్ఠిరమ్
> అబ్రవీ దుప పన్నార్థ మిదం వాక్య విశారద;
> గృహాణే మాం మయాప్రోక్తాం సిద్ధింమూర్తిమతీ మివ
> విద్యాం ప్రతిస్మృతిం నామ ప్రసన్నాయ బ్రవీమితే.
> వ్యాస భారతము—పుట732

వాక్య విశారదుడైన పారాశర్యుడు యుధిష్ఠిరున కావిద్యను సోప పత్తికముగా ఏకాంతమందుద్బోధించెను. ప్రతిస్మృతియను నావిద్య మూర్తీభవించిన పరమసిద్ధి వంటిది.

స్మృతి యనగా జ్ఞప్తి —గురుతు — అభిజ్ఞానము—అభిజ్ఞత— అని అర్థము. ప్రతిస్మృతియనగా ప్రత్యభిజ్ఞతాబోధకము.

శైవ సంప్రదాయములో—పాశుపతము, శైవ సిద్ధాంతము, ప్రత్యభిజ్ఞా దర్శనము అను నీ మూడును పరస్పరము సంబంధమున్న శైవశాఖ లనునది ప్రసిద్ధము. వ్యాస భారత కాలము నాటికే తలసూపి యుండె ననుటకు పాశుపతాస్త్ర ప్రసక్తియే నిదర్శనము. 'ప్రతిస్మృతి' విద్యయే కాలక్రమమున ప్రత్యభిజ్ఞాదర్శనముగను రూపొందియుండనచ్చును. ఉత్తరభారత మున కాశ్మీర శైవ సంప్రదాయమున ఇట్టి దర్శనమొకటి ప్రశస్తి వహించియే యుండెను. 'ప్రతిస్మృతి' రూపమగు యోగ విద్యా గ్రహణ ప్రభావము చేతనే అర్జునుడు అధిక తేజో మూర్తి యయ్యెనట. (అర 1–282)

శివాగమము లన్నిటను ఈ 'యోగము' అత్యంత ప్రాధాన్యము వహించును. వ్యాసుని నాటికి కేవల శివరుద్ర తత్త్వాత్మకమై యున్న పశుపతి లక్షణమే ప్రాధాన్యము వహించినను నన్నయ నాటికి అంతకంటె విశిష్టమగు నకులీశపాశుపతము ప్రాధాన్యము వహించెను. ఇంతకీనకులీశుడెవ్వరు ? పాశుపత దర్శనమునకు సంబంధించిన గురుపరంపరలోని పదునెనమండు గురిలో ప్రథముడు పాశుపత దర్శన సూత్రకర్త యితడే. పాశుపత దర్శనమునకు నకులీశపాశుపత మనియు పేరు. నకులీశ పాశుపతమునకు రాశీకరుడొనర్చిన 'పంచార్థ భాష్యమును' గలదు. దీనిని రాశీకరీయ వ్యాఖ్యయనియు నందురు. ఈ వ్యాఖ్యననుసరించి పంచార్థములనగా (1) కారణ (2) కార్య (3) యోగ (4) విధి (5) దుఃఖాంతములు. శత్రువుల నిర్జించుటకై అర్జునుడు పొంద నెంచిన అస్త్రలాభము కారణము. తపస్సు

కార్యము; తపస్సిద్ధిహేతువు యోగము; యోగాభ్యాసము విధి; శత్రు నిరాసకమైన అస్త్ర లాభ సంసిద్ధియే దుఃఖాంతము. శత్రువులగా అర్జునుని విషయమున బాహ్యార్థమునందు భీష్మ ద్రోణాదులని అనిపించినను పరమార్థమున నంతః శత్రువు లనియే భావము. వాని నోర్వక దుఃఖమున కంతము లేదు.

పార్థుడు యోగాత్మకమైన తపోవిధికి కడగెను. యోగ విద్యా ప్రభావముచే శివతత్త్వము ప్రసన్నము కావలెను. శివతత్త్వ మెప్పుడును శక్తి తత్త్వ సమన్వితమై యుండును. శక్తితత్త్వము శివుని ఇచ్ఛా జ్ఞానములకు ప్రతీక. శక్తి సహిత శివతత్త్వము సకలాతత్త్వముగా చెప్పబడినది. ఇది మాయాచ్ఛాదితము.

"కాంచన వర్ణావపుషునుండై మహోన్నత
కార్ముకహస్తుడై కాలకంఠుఁ
డెఱుకు రాజయ్యె; నద్రీంద్ర తనూజయు
వనచరీ భావంబు వఱలఁదాల్చె"

(అర 1–300)

శివతత్త్వము మాయాచ్ఛాదితమై కానవచ్చిన రీతియిది

శైవ సిద్ధాంతమున జీవున కభీష్ట సాధనమునందు స్వయం ప్రయత్నము చాలదు. జాగృతి కలిగించు బోధకు నావశ్యక మెంతేని కలదు. పశుపతి సందర్శన విషయమున నీ జాగృతి అర్జునునకు— వ్యాస ధర్మజ మహేంద్రులచే నొక క్రమ పద్ధతిలో చేయబడ్డెను.

ఈ సిద్ధాంతములో మఱొక విశేషమును గలదు. "శివుడు—జీవుడు" అను నీయిరువురును ఇందు సమానస్థాయిలో నుందురు; కారణము వారు నిత్యము లయిన రెండు భిన్న తత్త్వము లగుటయే. కనుక పరమేశ్వర పార్థు లిరువురును పోరాడునపు డొకరికొకరు తీసిపోని వారుగా వర్ణింపబడిరి.

జీవేశ్వర తుల్య బలత్వ విషయములో వ్యాస నన్నయలు భిన్నాభిప్రాయము కనబఱచినట్లుతోచును. వ్యాసుని దృష్టిలో జీవుని కంటె శివు డధికుడు నన్నయ దృష్టికూడ అట్టిదేయైనను శివా ర్జునులు తుల్యబలులన్న అభిప్రాయమునే ఆయన సూచించెను

హరుఁబెనఁగి పట్టుకొని భీ
కరబలుఁ డర్జునుడు ముష్టిఘాతంబుల సం
గర మొనరించెను, వనచర
వరులాతని శౌర్యగౌరవముఁ బొగడి రెదన్

(అర 1–318)

వ్యాసుని కథన మిట్లుగాక విలక్షణముగా నున్నది.

"పరమేశ్వరునిచే పార్థునకు జరిగిన గాత్రపీడచే పార్థు నుచ్ఛ్వాసము నిరుద్ధ మయ్యెను. ఒడలంతయు రక్తపు ముద్ద యయ్యెను. దుఃఖితుడగు పార్థుడు ముహూర్త కాలము మూర్ఛ యందు మునిగెను. తోడనే తెప్పరిల్లెను గాని తనతో పోరాడునది శివుడే యను జ్ఞానము లేకపోవుటచే మట్టితో శివుని రూపముచేసి పూజించెను శివుని రూపమునకు వేయబడిన ఆ దండపోయి చిత్రముగా కిరాతుని తలపై బడెను. అప్పుడు విషయ మవ గతమై అర్జునుడు కిరాతాకృతినున్న కంతేకాలుని కాళులపై బడి మొక్కెనట." (వావిళ్ళవారి ప్రతి పు. 740)

ఇందు పరమేశ్వరునికంటె పార్థుని న్యూనత్వము స్పష్టము. నన్నయ చిత్రించిన యర్జునకు సైతము పరమేశ్వరు డొనర్చిన గాత్రపీడచే మూర్ఛపోయినను మట్టి బొమ్మలు చేసి పూలమాలతో పూజ లొనర్చుట మొదలగు పనులు చేయలేదు. పట్టి పల్లార్చిన బద్ధశత్రువు కట్టెదుట కన్పట్టుచుండ—సవ్యసాచి శివపూజలు చేయుటలో ఔచిత్యము ఉండదు. కనుక నన్నయ వానిని తొలగించి అర్జున పరాక్రమాతిశయము నతిలోకముగా వర్ణించి శివార్జునులు తుల్యబలులన్న స్ఫూర్తి కలిగించెను. శైవ సిద్ధాంత మనుసరించెడు జీవేశ్వరీ తుల్యబలత్వ స్ఫూర్తి కిది అవకాశమిచ్చు చున్నది.

ఇట్టి శైవ సిద్ధాంతపు బెడదయేలేని కన్నడ భారత (విక్రమార్జున విజయ) కర్తయగు పంపకవి యున్నాడు. జైను డగు నీ పంపడు పార్థునిచేత పరమేశ్వరుని నేలను త్రోయించి పరమేశ్వరుని కుత్తుకపై పార్థుని పాదము పెట్టించి కృతార్థు డయ్యెను. పంపనివలెగాక, వైదికమార్గనిష్ఠుడును. ఈశ్వరాగమతత్పరు డును నగు నన్నయ జాగరూకుడై జీవేశ్వరతుల్యత్వ లక్షణమునుసూచిం చుట గుర్తింపదగిన యంశము. వ్యాసున కర్వాచీనుడగు భారవి కాని, నన్నయ కర్వాచీనులగు శ్రీనాథ ధూర్జటులుకాని ఈ సంద ర్భమునెట్లు నిర్వహించిరను నంశ మాసక్తి జనకమే యయ్యును విషయ విస్తరభీతిచే వానినిచ్చట తడవుటలేదు.

పార్థునకు పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యెను. క్రీడి కను లకు కనిపించు రూపముతోనే ప్రత్యక్షమయ్యెను. ఇట్టి రూపము తటస్థ మగు 'కలాసహిత' రూపము. కాని తత్త్వదర్శనమిచ్చు

యందు జీవుడు కోరున దిదికాదు. 'నిష్కలారూప' తత్త్వము. దానిని చూడగలుగుటయే సత్యమగు 'పాశుపత' లాభము. కేవలా యుధమ్మైన పాశుపతము భౌతికము.

ప్రసన్నుడై పరమేశ్వరుడు పార్థునితో నిట్లు పలికెను. 'నీతపః క్షాత్ర గుణంబులకు మెచ్చితిని; నీ కోర్కి సఫలంబు చేసెద; దేవాసురమానుషంబైన జగంబంతయు నీవజయంతు నా స్వరూపంబు సూడు' (అర 1-322) యని దివ్య దృష్టి యిచ్చినంజూచి పార్థుడు కృతార్థుడైనట్లు నన్నయ వర్ణించెను. ఇచ్చట మూలముకంటె విశిష్టముగా నన్నయ అర్జునునిచేత సందర్శింప జేయనెంచిన పరమేశ్వరదివ్యరూపము యొక్క వర్ణనమున కిది ఉపస్కారరూపమయిన నాందీ వాక్యము.

అర్జునుడు అజ్ఞానములో పరమేశ్వరు నెదిరించి పోరి నందులకు మిగుల పశ్చాత్తాపమందెను. పశ్చాత్తాపజన్యమై పరమేశ్వరస్తోత్ర రూపమున అర్జునుని నోటవెలువడిన ఛందోబద్ధ వాక్యములు నన్నయ యిచ్చట పొదివెను. ఇచ్చట అత్యద్భుతమైనది నన్నయ విస్తరించి దండక రూపకముగా ప్రతిపాదించిన శివ తత్త్వము. ఈ శివతత్త్వ ప్రతిపాదనము మూలమునందు మాత్రము లేదా? లేకేమి? ఉన్నది. కాని అది సూచనాప్రాయము. నన్నయ ప్రపంచించినంత విస్తరముగా లేదు.

పంపనికవితను ప్రస్తుతించువారు సయితము ఈ సన్నివేశములోని కల్పనములో నాతనితో నేకీభవింపలేక పోయిరి. అర్జునుడు శివుని కుత్తుకపై కాళ్లుపెట్టిన ఘట్టము నుటంకించి శ్రీ వి. సీతారామయ్యగారిట్లు వ్రాసిరి.

"This sounds unpious and is certainly not the issue either in Mahabharata or in Kiratarjuneeya where Siva is able to humble Arjuna. Pampa wants to show up Arjuna, his hero as more powerful than Siva himself and so Arjuna is made to throw Siva down and plant his feet on his neck·

Himself being a Jaina, no piety or reverence could inhibit Pampa here."

— Mahakavi Pampa, p. 104

''...దేవ దేవ మహాదేవ నీలగ్రీవ జటాధర
కారణాంచ పరమం జానేత్వాం త్ర్యంబకం విభుమ్
దేవానాంచ గతిందేవ త్వత్ప్రసూత మిదం జగత్
అజేయ స్త్వం త్రిభిర్లోకైస్స దేవాసుర మానుషైః;
శివాయ విష్ణురూపాయ విష్ణవే శివరూపిణే.

దక్షయజ్ఞ వినాశాయ హరి రుద్రాయవై నమః''

వ్యా. భా. పు. 740

శివకేశవ సమాహార రూపమ్మైన శివతత్త్వముగాక నన్నయ కేవల శివతత్త్వ ప్రధానమ్మైన రూపము నభివర్ణించుట గుర్తింపదగి యున్నది.

'శ్రీకంఠ! లోకేశ! లోకోద్భవ స్థాన సంహారకారీ! పురారీ! మురారిప్రియా! చంద్రధారీ! మహేంద్రాది బృందారకానంద సందోహ సంధాయ పుణ్యస్వరూపా! విరూపాక్ష! దక్షాధ్వరధ్వంసకా!......

ఇంతవరకీ స్తుతి మూలవిధేయమే. కాని మూలములో సారభూతమ్మైన యొక వాక్యమున్నది. అది ',కారణాంచ పరమం జానే త్వాం'' అనునది. నన్నయ దీని నందుకొని శివతత్త్వ నిర్వేదన మొనర్చి చూపిన విశేషములు ఈశ్వరాగను మహా రహస్య నిక్షేపములు.

''దేవ నీదైన తత్త్వంబు భేదించి బుద్ధి ప్రధానంబు కర్మంబు విజ్ఞాన మధ్యాత్మయోగంబు సర్వక్రియాకారణంబంచు నానా ప్రకారంబులన్ బుద్ధిమంతుల్ విచారించుచున్ నిన్ను భావింతు, రీశాన! సర్వేశ్వరా! శర్వ సర్వజ్ఞ సర్వాత్మకా! నిర్వికల్ప ప్రభావా! భవానీపతీ! నీవు లోకత్రయీ వర్తనంబున్ మహీవాయు ఖాత్మాగ్ని సోమార్క తోయంబులం జేసి కావించి సంసార చక్రక్రియా యంత్ర వాహుండవై తాదిదేవా మహాదేవ నిత్యంబు నత్యంతయోగస్థితిన్ నిర్మలజ్ఞాన దీప ప్రభా జాల విధ్వస్త నిస్సార సంసార మాయాంధకారుల్ జిత క్రోధ రాగాది దోషుల్ యతాత్ముల్ యతీంద్రుల్ భవత్పాద పంకేరుహధ్యాన పీయూష ధారాను భూతిన్ సదాతృప్తులై నిత్యులై రవ్యయా భవ్యసేవ్యా......సురాభ్యర్చితా నాకు నభ్యర్థితంబుల్ ప్రసాదింపు; కారుణ్యమూర్తీ! త్రిలోకైకనాథా! నమస్తే నమస్తే నమః!''

అర 1-324

బుద్ధిమంతులగువారు శివతత్త్వము భేదించి తమ బుద్ధియందు కర్మమును జ్ఞానమును అధ్యాత్మయోగమును సర్వ క్రియలకు నుపాదాన కారణమై అనేక ప్రకారములుగానున్న ఆశివ

తత్త్వమును గూర్చి విచారము చేయుదురట! ఇంతకీ బుద్ధిమంతు లెవ్వరు? శివతత్త్వ విదులు! శైవాగమ రహస్య కోవిదులు!

శైవాగమ సంప్రదాయము ననుసరించి మోక్షప్రాప్తికి క్రమబద్ధమగు ప్రయత్న మొకటి చెప్పబడినది. ఈ క్రమము యొక్క సమాప్తి నాలుగు మార్గములుగా జరుగును. అవి ఇవి

1. కర్మమార్గము 3. యోగమార్గము
2. క్రియామార్గము 4. జ్ఞానమార్గము

ఇందలి కర్మమార్గము ముముక్షు ప్రథమదశ. శివు నందు బుద్ధి అవిచలితముగా కుదురుకొనుట కిది సాధనము. ద్రావిడ దేశమున చర్యాప్రధానమగు 'దాస మార్గము'గా ఇట్టిది నామాంతరము నొందియున్నది. దీనిని 'తిరునావుక్కరసు' ప్రవర్తింపజేసెను. క్రియాప్రధానమగు రెండవ మార్గములో స్నాన నైవేద్యమంత్రోచ్చారణాదిక కర్మకాండయు నుండును. సత్పుత్ర మార్గమనియు, భక్తిమార్గమనియు ఇట్టిది ద్రావిడదేశమున తిరుజ్ఞాన సంబందరుచే ప్రవర్తింపబడినది. మూడవదియగు యోగమార్గము అరిషడ్వర్గమును జయించుటకు జీవుడు రాజ యోగాదులగు సాధనము లవలంబించుదశ. ఈ దశలో సాధకుడు శివునకు సహచరుడుగా వర్తించునని నమ్మిక కనుకనే సహజ మార్గమనియు, రాజయోగమార్గమనియు దీనికి నామాంతరములు గలవు. ద్రావిడదేశమున సుందరమూర్తి ఇటువంటి మార్గమునకు ప్రాధాన్యమిచ్చియుండెను. కడపటిదగు జ్ఞానమార్గములో జీవుడు విజ్ఞాన లక్షణ భాసితుడై ఆధ్యాత్మికముగా శివునితోడి సాయుజ్య దశనొందు నందురు. ఈ మార్గమునకు సన్మార్గమనియు జ్ఞాన యోగమార్గ మనియు మారుపేరులున్నవి. ద్రావిడదేశమున మాణిక్య వాచకర్ ఇట్టి నమ్మికతో వర్తించె నందురు. దాస—సత్పుత్ర—సహ—సన్మార్గములుగా ద్రావిడ దేశమున ప్రసిద్ధినొంది తిరుజ్ఞాన సంబందర్, సుందరమూర్తి, మాణిక్య వాచకరులచే ప్రవర్తింపబడిన ఈ శివభక్తి మార్గములు కూడ రాజరాజ నరేంద్రునకు 'ఈశ్వరాగమముల'యెడ సుప్రకాశితమైన భక్తి కలిగించుటకు కారణములైయుండును. నిజమరసిన ఈ ఎల్ల మార్గములకు ఒకసూత్రతనాపాదించునది 'భక్తి' సూత్ర మొక్కటియే. రాజరాజ హృదయగతమైన ఈ భక్తిని పసిపట్టి నన్నయ యధావకాశము దానిని ఈశ్వరాగమ సంప్రదాయముతో సంవదించుకొనుచు కావ్యకథయందు ప్రపంచించెను, ద్రవిడ సంసారియగు రాజరాజున కిది 'కరం బిష్ట'మైన అంశము.

పై పరమేశ్వర స్తుతిలో నన్నయ పేర్కొన్న కర్మము—విజ్ఞానము— అధ్యాత్మయోగము— క్రియాకారణము — అనున ఈశ్వరాగమ ప్రహితములైన పరిభాషాపదములు. ఇవిపైని పేర్కొన్న క్రమములో లేకున్నను అందలి భావములో భేదము లేదు.

ఇచ్చట నొక్కవిషయము ప్రస్తావింప వలసియున్నది. "భక్తిజ్ఞాన కర్మాదియోగము లద్వైతమునందును ప్రసిద్ధములే కదా! శైవమున వీని విశేషమేమి?" -అని; శైవమున జీవుడు మోక్షావస్థయందును శివసాయుజ్యమునే కోరును అద్వైతమున జీవుడు కోరునది సాయుజ్యము కాదు. అభేదము 'సోఽహమ్' అనుటలో 'అతడే నేను' అని యనుట కాని అతడును నేనును కలసియుందుమని కాదు. శైవమున 'జీవేశ్వర సంసార' రూప మగు త్రికము నిత్యము అట్లుగాక శివునితో సభేదము భావించినచో శైవము యొక్క తల్లివేరు త్రుంచినట్లు, ఈ రహస్యమెఱిగియే నన్నయ జిత క్రోధరాగాదిదోషులును, యతాత్ములును నగువారిని యతీంద్రులని పేర్కొనుచు వారు అత్యంత యోగస్థితిచే నిర్మల జ్ఞానదీపమును వెలిగించి నిస్సారమైన సంసారసంబంధమయిన మాయ యనెడి అంధకారమును విధ్వస్త మొనరింతురని స్పష్టము చేసెను. ఇచ్చట విధ్వంసము చేయబడునది 'సంసారము' కాదు. తత్సంబంధమయిన మాయ యనెడి చీకటి మాత్రమే విధ్వంసమనగా వినాశము. అత్యంతము కనబడ కుండుట; శైవ సిద్ధాంతమున 'మాయ' సైతము అవినాశియగు పదార్థమే. దానికి వికృతియేకాని అభావము లేదు. ఇది చీకటితో పోల్చబడుటలో పరమౌచిత్యము గలదు చీకటి తత్కాలము నందు తత్ప్రదేశమున లేదనియేకాని సృష్టియందసలు లేకుండ పోదుగదా! సంసారసంబంధమగు మాయయు ఇట్టిదే. జీవేశ్వర సంసార రూపమయిన 'త్రిక'మందలి సంసారమునకును అభావము లేదు. ఇట్టి సంసార చక్ర క్రియా యంత్రవాహుడు శివుడు.

అర్జునునిచే నన్నయ స్తుతింపజేసిన దిట్టి శివతత్త్వమునే. ఇది 'ఈశ్వరాగమ' సంప్రదాయసిద్ధమై, దాస సత్పుత్రాది ద్రావిడ భక్తిమార్గము సైత మాదరించిన శివ తత్త్వము.

నన్నయ జేని యానతి మన్నించి, తనకు విశ్వసనీయము లైన ఈశ్వరాగమ సిద్ధాంతములను పరామర్శించి, తన కనిష్ఠ

ములు గాని ద్రావిడ భక్తిమార్గము లాదరించి కిరాతార్జునీయ ఘట్టములో యథావకాశము శివతత్త్వము ప్రతిపాదించెను. నిజ మరసిన శైవము — నన్నయ నాటికి పొందిన వ్యాప్తి, వ్యాసుని నాటికి పొందలేదు. కాని త్రిమూర్తులలో రుద్రుని కంటె విశిష్టమగు రుద్ర దైవత మొకడు ఋగ్వేద కాలము నాటికే యుండెను ఇట్టి రుద్ర తత్త్వము వ్యాసు డాదరించినదే. ఇదియే కాలాంతరమున పాశుపత తత్త్వముగను రూపొందియుండ వచ్చును. పై అర్జున స్తుతిలో వ్యాసుడు సూచనాప్రాయముగ చేసిన "రుద్రాయవై నమః" అను నుపసంహార వాక్యము నందలి రుద్రుడు పశుపతియే. తత్సంబంధమగు దివ్యాస్త్రమే 'పాశు పతము'. ఇది మంత్ర రూపము. తత్త్వాత్మకము 'బుద్ధి మంతు'డగు నన్నయ ఈ 'తత్త్వము'నే భేదించి చూపెను.

భాషా ఛందో దృష్టి తో చూచి ఆలకించిన, నన్నయ దండకము ఆంధ్రభారతీ పద మణిమంజీర నిక్వాణములు వినిపింప జేయును. ఈశ్వరాగమ తత్త్వ దృష్టితో చూచిన శైవాగమ మహారహస్య నిక్షేపములు కుప్పపోయును. కిరాతార్జునీయ ఘట్ట ములో చాలవర కీ తత్త్వము వాచ్యముగనే చెప్పబడినది కాని వాచ్యము కంటె వ్యంగ్యము రమణీయతరము గదా! నిగూఢ రమణీయమగు ధ్వనిమార్గమున నీ ఈశ్వరాగమతత్త్వమే నన్నయ నలదమయంత్యుపాఖ్యానము నందును సూచించెను. అందలి విశేష ములు వేఱొకసారి ముచ్చటించుకొనవచ్చును.

పార్వతీపతి పదాబ్జధ్యాన పూజామహోత్సవ'తత్పరుడై 'ఈశ్వరాగమము' లందు హృదయమును 'భక్తి'తో నిల్పిన రాజరాజా నకే కాక ఇందలి విశేషములు శివతత్త్వ జిజ్ఞాసువు రసజ్ఞులకు కూడ ఆనంద సంధాయకములే.

ఈ వ్యాసరచన కుపకరించు గ్రంథములు: వ్యాసములు:

1 శ్రీ ఆర్. అనంతకృష్ణశాస్త్రిగారిచే సంపాదింపబడిన "పాశుపత సూత్రములు"—తిరువనంతపురము—1940.

2. నన్నయ భారతము.

3. వ్యాస రచితమైన శ్రీమన్మహాభారతము; వావిళ్ళ వారిది, 1929

4. A History of Indian Philosophy, Vol. X, by Surendranath Das Gupta, 1962.

5. Mahakavi Pamba, by Sri V. Sitaramaiah, Popular Prakasan, Bombay, 1967.

6 'శైవసిద్ధాంతము : ఒక పరిచయము' డా జె. చెన్నా రెడ్డిగారు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ప్రాచ్యభాషాపత్రికలో ప్రచురించిన వ్యాసము.

7. 'ఆంధ్ర భారతము — అవతారిక' — శ్రీ ఆలమూరి రాజగోపాలరాజుగారు సాహితీవల్లభ శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజా గారి అభినందన సంపుటి మొదటి భాగములో వ్రాసిన వ్యాసము.

ప్రపంచ తెలుగు మహాసభల నిధి సహాయార్థం తెలుగు సినీ ఆర్టిస్టు అసోసియేషన్
వారు ప్రదర్శించిన నాటికల చలన చిత్రరూపమే సినిమా వైభవం.



పద్మనాభం సమర్పించు రేఖా మురళీ ప్రొడక్షన్స్

సినిమా వైభవం

నిర్మాత బి. మురళి

లక్ష్మీ ఫిలింస్

LAKSHMI

ప్రతీక నాటిక

ఇదే మార్పు

శ్రీ పన్నాల సుబ్రహ్మణ్యభట్టు

[చిన్న పలకరింపు :— కళాశాలలో సభలలో నాటికలంటే ఎంతో ప్రయత్నంచేసి వేయాలి. శ్రమపడటానికి తగినంత ప్రతిభకల్గినా, అందుకు దోహదం చేసే నాటికలు తక్కువ. అతి తక్కువ సమయంలో ఎక్కువ ఆలోచనలు రేకెత్తించే నాటికలు అసలులేవు. శబ్దాన్ని ఉపయోగించుకోగలవీ తక్కువే. కాలక్షేపం కోసం ఆనందం కోసం నాటికలు చూసేవారు వేసే వారూ వున్నారే తప్ప బుర్రపెట్టి, ఇచ్చిన గొంతుకు పట్టి, నెరపి, శక్తి చూపించే వారు క్షీణిస్తున్నారు. స్పృహ కలిగిన దర్శకులూ కరువయ్యారు. వారికోసమే ఈ ప్రతీక రూపకం].

రంగస్థలాన్ని మూడు భాగాలుగా విభజిస్తే ఒక చోట ఒకరు:— (అతని మీదే కాంతి).

ముందు చెప్పాలి కనుక:— మనిషి తోటి వాళ్ళతో కంటె తన మనస్సుతోటే ఎక్కువ కాపురం చేస్తాడు. తనకోరికలన్నీ తన మనస్సులాంటి పావురాలతో చెప్పుకుంటాడు. ఏం మార్పు కావాలో తెలియదు. కాని ఇప్పుడున్న స్థితి—వేగం నుండి మరో స్థితికి వేగానికి మారాలి. ముగింపు ఉండనక్కర్లేదు. తరువాత వారు ఏమీ అంటారో అని వూహించి, తను సంభాషణలు చెప్పడు. అది జరగేది నిజజీవితంలో—ఇక్కడా అంతే. కనబడే వస్తువుల వెనుక రూపం వేరు కావచ్చు. వినబడే మాటలు వెనుక అర్థం వేరు కావచ్చు.

రెండవ చోట నుండి చిక్కటి మగగొంతు (వెనకాల నేపథ్య సంగీతం ఎన్నుకొని అక్కడక్కడా వేసుకోవచ్చు).

మాటలవల్ల కనబడే చిత్రాల వెనుక
అక్షరాలవూపిరి వుంటుంది.

చేతలవల్ల కనబడే చిత్రాల వెనుక చైతన్యపురాసి వుంటుంది
అర్చాశ్రయ పారిజాతపుష్పాల సువాసనే ప్రతీకలు.

గమనశీల వస్తుస్థితి లయల విన్యాసమే ఈ ప్రతీక నాటికల
సత్తానడకకీ జంఝూనిలవేగానికీ మధ్య
ఈ కనబడే ప్రపంచం ఒరిసిపోతోంది.
జంటితేనే బొట్టుకీ కాలనాగు విషస్పర్శకీ
నడుమ కనబడని మనస్సు ఒరిగిపోతోంది.
ఆరాపిడి, ఒదుగు మనిషితో నిలబడుతున్నాయి.
నీడలో పలకరిస్తున్నాయి.
ఈమనిషి యిరుసు ఇరుకుల్లో నలుగుతోంది
ఆకులు విరుగుతున్నాయి
కాని భ్రమ చక్రం సాగుతూనే వుంది— రూపనిహితంగా సమాజం అంటూలేదు.

కాని వుంది — తండ్రి, తల్లి, కొడుకు కూతురు — రూపంగా. కాపురం అంటూలేదు.

కాని వుంది ఆశలకపోతాలకళ్ళల్లో తనతో — ఎప్పుడూ — ఎగరాలని ఆశతో ఎగిరెగిరి వూరేగాలన్న పేరాశతో ఆ పావురాలు. కాని మితి— శక్తి. పరిమితి నీలాకాశం అవరోధం : రెక్కలబరువు నీలబెట్టే చేతులు, నీరవసంజ్ఞలు కనులుపొడిచే ప్రశ్నలు ఇన్నీ అధిగమించి విరిగినరెక్కలని కుట్టగలరా "

అలసిన రెక్కలు ఎగరగలవా.
అర పరచిన రెక్కలు ఎగిసి ఎగరగలవా !
గగనగర్భంలోని ఆసాకార విన్యాసమే మార్పు.
చెదిరి విరిగే వర్తులాల ఆవర్తనమే సజీవసాక్షి
ఆ భీకర నినాద కుహరంలోని
కపోతాలు నిశ్చింతగా వున్నాయి
తిరిగి రావచ్చు. రాకపోవచు,
ఆ ప్రయాణం సుదూర సానువులకో
సమీప సముద్రతరంగ పటలి నికో

[రెండవభాగం వెలుగుతుంది. వరండా సీనులా ఇనుప కట కటాలు గోడ కలిసేచోట వలలాటి చట్రం ఓ అడుగుమేర రెండు పూసలబారు వుంటుంది. చిన్న ఆకాశం కనబడే త్రోవలా కట కటాలలోంచి కనబడితే సరి. తెల్లవారిన సమయం. కుర్చీలో అచ్యుతంగారు కూర్చునివుంటారు. గోడమూల వలలావున్నచోట చిన్నదండెం. పావురంగూడు. నాలుగుపావురాలు కదుల్తూ లేదా పావురాలనాలుగు నీడలు నిలబెట్టగలిగినా సరే. రెండవభాగానికి మూడోభాగానికి మధ్య ద్వారంకల తెర. సగంతీసి లేదా కనబడేలా. [రైలు వెళ్ళిన చప్పుడు వినబడుతుంది. పేపరు హెడ్డింగులు చదువుతున్నట్లు పరీక్షిస్తూంటారు. పావురాలగూడు దగ్గిర గోడమీద బోయింగు జెట్టువిమానం ఫోటోకానీ, అదివున్న కేలం డరు కానీ వ్రేలాడుతూ వుంటుంది. పేపరు మడిచి క్రిందకు వంగిపెట్టి తనలో అనుకుంటున్నట్లు]

అచ్యుతం :— ఈపూట పాలబండి కాస్త అలస్యమయిందిలా వుంది. స్టేషనుకు మరింత దగ్గిరగా ఇల్లు కట్టారేమిటో? (లేచి నిలబడి క్రింద అటూ ఇటూ చూస్తూ) వరండా విశాలంగానే వుంది. కాని ఇదేం గచ్చు. ఇంటివాళ్ళకి మతి లేదు. నాపరాయిలు పొరలు లేచి వూడాయి. అసహ్యంగా కనబడుతున్నాయి. చెప్పులులేకుండా తడికాళ్ళతో నడిస్తే అరికాలు చీరిపోతుంది. తగ్గట్టే సిమ్మెంటు చచ్చింది. ఒకటీ ఒకటీ అతికినప్పుడు పళ్లెం చూసుకోరులావుంది. వంకరటింకర. మేస్త్రీ గొప్పవాడే దొరికాడు ! సిమ్మెంటు పామినచోట సన్నగీత ఒకటా ? బాగానే మెత్తాడు. ఈ యిల్లుకట్టి ఇరవైఅయిదు సంవత్సరాలు అయ్యేవుంటుంది. ఎవరికిగుర్తు. పూరుపాతదే పేటే కొత్తది. అప్పుడే నేల యీనినట్లు తేమ. క్రింద యిసుకతిన్నగా పరచివుండరు. ఎవరిసొమ్మో. ఇంటాయనకట్టాడు.మనం అద్దెకుంటున్నాం వేపచెట్టు కొమ్మల్లోంచి ఆకాశంలా యిరుకుగా ఈవాటా కనబడుతుంది — తప్పు స్థలం పెద్దదే. శుభ్రంగా మంచి బంగళా కట్టవచ్చు. అయినా శక్తి వుండక్కర్లేదూ ! బోలెడు డబ్బుతోపని. పాపం ఏదోవ్యాపారంలో కాలం వెళ్ళ దీస్తున్నాడు — ఇంటిఆయన. అరే (రెక్కలచప్పుడు) ఈ శాంతి అప్పుడే షికారు కెళ్తోందే.

జానకి :— (కాఫీచేత్తో పట్టుకొనివస్తూ) ఎక్కడికి వెళ్తుంది లెండి. మీ వేపమండలూ కరివేపాకు ఎముకలుదాటి ఎగర గలదా ! ఓరెండుకొట్టి గూటికి చేరుకోదూ ! కాఫీ తీసు కోండి. ప్యాసింజరుకూడా వెళ్ళిపోయింది.

అచ్యుతం :— ఏ పోలేదంటావా ! రెక్కబలం గల పిట్టే !

జానకి :— బలం వుందనగానే సరా! నిలిచే పట్టుండొద్దూ క్షణానికి పదిసార్లు విసురుకుంటూ !

అచ్యుతం : పూర్వం అత్తవారింటినుండి పిలుపు పావురాలే తెచ్చేవి.

జానకి : ఇప్పుడు పోస్టువాడు కూడా తేవటంలేదు !

అచ్యుతం :— అసలు మావగారు రాస్తేగా తెచ్చేది.

జానకి :— మనసులో వున్నమాట కలంలోకి రావాలంటే బోలెడు నోట్లు కావాలి. మీకు మనసులోవున్నమాట నోట్లోకి రావ డానికే గంటలుపట్టె.

అచ్యుతం :— నీ చేతిలోవున్న కాఫీ నాచేతి కివ్వడానికి ఇన్నికబుర్లు పట్టే. ఈ లెక్కన అంచనావేయి.

జానకి :— ఉండండి ! కబుర్లలో కాఫీ చల్లారిపోయింది. కొంచెం వెచ్చచేసి తీసుకువస్తానుండండి. మీ శాంతి కపోతం తిరిగి వస్తోంది కాస్త మేత పెట్టండి. (వెళ్ళేలాస్వరం)

అచ్యుతం: (పేపరు తిరగేస్తూ పైకిచదువుతూ) శాంతి సంబం ధాలు నెలకొనే సూచన. పది యిళ్లు దగ్ధం. నిప్పంటుకొని స్త్రీ దుర్మరణం. యువకుని ఆత్మహత్య. యువతి అప హరణ. యుద్ధప్రజ్వలన. ఏమిటో మళ్లీ వచ్చిందా ! మరి యిన్ని శాంతి కపోతాలను యెగురవేస్తారు. శాంతి వచ్చి చావదేం ? (రెక్కల చప్పుడు)

జానకి: అయ్యయ్యో ! అదేం మాటలండీ—ఆ పావురం అలా కొట్టుకుంటూవుంటే.

అచ్యుతం: (పేపరుమడిచి కాస్తవిసురుగా) అబ్బబ్బ! ఈ యినుప కటకటాల మీదే యెప్పుడూ వాలుతూ వుంటుంది.

జానకి: చూరు నీళ్లన్నీ చెదిరి అక్కడ తుప్పుపట్టిందండి. అరరే రక్తం. దాని కాలినుండి రక్తం వస్తోందండి. ఎప్పుడూ యిలాగే గీరుకుపోతోంది.

అచ్యుతం: దాని కలవాటేలే!

జానకి: ఎన్నాళ్లనుండో మొత్తుకుంటున్నాను. కనీసం ఆ గూటి మూలనయినా ఇనుప చట్రం తీసేయండీ అంటే మీకు లెక్కలేదు. మీ శాంతి, నా సుఖం, కాంతి, ప్రేమ—ఏ పావురమయినా కాస్త షికారుకి వెళ్లి వచ్చినదంటేచాలు. మీ యినుప వల మీద కాలు పెట్టక తప్పదు. గోళ్ళు నలగక తప్పదు.

అచ్యుతం : ఆమూల ఏ చెక్కతోనో మూసివేస్తే ఆ పావురాలకీ తోచదు నాకు ఆకాశం కనబడదు.

జానకి : మీది పక్షిమనసు, నాది చెక్కమనసు సరా! ఇదిగో కాఫీ తీసుకోండి ఈసారి చల్లారిపోతే ఇక అగ్నిహోత్రం సమ్మె చేస్తుంది.

అచ్యుతం : పోన్లేమనది అసలే వేడిదేశం.

జానకి : మరి ఈ పానీయాలు వేడి చేసుకోవటం ఎందుకూ ? అలా సమశీతలంగానే తాగేయ కూడదూ!

అచ్యుతం : మనం అన్నిటికీ ఆలస్యం చేస్తాం కనుక కాస్త పానీయాలు వేడిగా వుండాలి.

జానకి : మీతోటి కబుర్లు చెప్తే వంట ఆలస్యం అవుతుంది. నేను పనులు కాస్త తొందరగా తెముల్చుకోవాలి.

అచ్యుతం : ఎంత తొందరపడినా మధ్యాహ్నం నిద్రకోసమేగా ?

జానకి : మీతోటి వాదన పెట్టుకొంటే నా సుఖం కాస్తా ఎగిరి చక్కాపోతుంది.

అచ్యుతం : అదిగో ఎలాగా ఎగురుతోంది. నువ్వు ఎల్లకాలం పట్టుకోగలవా ! (రెక్కల చప్పుడు)

జానకి : ఆ కొమ్మకి దానికాళ్ళకి అత్రాడు కట్టినంతకాలం ఈ వరండాలోనే దానిబులబాటం తీర్చుకోవాలి.

అచ్యుతం : వూరు బలాదూరు తిరిగేకంటే ఈగూడే దాని ఆరోగ్యానికి మంచిది జానకీ !

జానకి :— అలాగని మీ అమృత సాహిత్యంలో చెప్పారా ?

అచ్యుతం :— కాదు ఓడ్కా సాహిత్యంలో విచారించారు.

జానకి :— షాంపేను కవితలో సిఫార్సు చేయలేదూ !

అచ్యుతం : లేదు. స్వాతంత్ర్యం ఇచ్చే వాడికంటె పరాధీనతయిచ్చే విశ్రాంతి గొప్పది.

జానకి : ప్రొద్దుటే భక్తిరంజనితోబాటు మీ సూక్తులు వింటే నాసుఖం అసలు ఎగరటం మరచిపోతుంది. దానికి కట్టిన త్రాడు కాస్త వదులుచేసి వదిలేయండి.

అచ్యుతం : నీమాటే కానీయి. కాని అరగంట తిరగకుండా అంట్లగిన్నెలు తోమడానికి నీ సుఖం హాజరవుతుంది సుమా (వదిలేసిన రెక్కలచప్పుడు)

జానకి : పోన్లెండి. మీశాంతి ప్రక్కవీధిలో ఆఫీసుదాకా కుంటలేదు. పెద్ద చెబుతారు కబుర్లు.

అచ్యుతం : ఒకరిరెక్కల బలం మరొకరికి వస్తుందా చెప్పు.

జానకి :— బాగానే గుర్తు చేసారు. ఈ దాసీది— లక్ష్మి వచ్చిందా. ఇం కెందు గిన్నెలు తోమాలి. అబ్బ ! ఏం చాకరీయో !

అచ్యుతం : గిన్నెలు తోమేది పనిమనిషి. నీ రెక్కలు ముక్కలయినట్లు బాధపడ్తావేం.

జానకి :— వంటయింట్లోంచి గిన్నెలు పారేయండి తెలుస్తుంది మీ పహిల్వాన్ గొప్ప. చిన్నప్పుడు కసరత్తు చేసానూ, కోడి రామమూర్తిని ఠలాయిద్దామనుకొన్నాను' అని గొప్ప చెప్పగానే కాదు.

అచ్యుతం :— గామానే నిలబెడదామనుకొన్నాను. కుదిరింది కాదు జానకీ !

జానకి :— స్నానాలగది అద్దంలా వుంచండి కింగ్‌కాంగ్‌ను జయించినంత ఫలం (గిన్నెలు పడేస్తున్న చప్పుడు.)

[మూడోభాగంలో రెండో గుమ్మందగ్గిర] ఏమే లక్ష్మి ! ముంగిలా కూర్చున్నావు. ఇక ఈపూట రావేమో అనుకున్నాను. ఆ పెనంకూడా కాస్త పామేయి. అసలు మసిపోవటంలేదు. గరిట సందుల్లో పక్కులు లేకుండా చూడు. ఎక్కడ సంపాదించావే చామంతిదండలు. నీతోటి మాట్లాడ్తూ కూర్చుంటే నాకు పని సాగదు. అబ్బాయి కాలేజీకి వేళవుతోంది. తొందరగా తెమిల్చి ఆ కూరగిన్నయినా యిలాపడేయి ముందు. నీ చెల్లెలికి పెళ్ళివారొచ్చారన్నావు ఏమయింది...అరరే అన్నీ కాకులండీ నాసుఖం వెనక్కి వచ్చేస్తోందండీ. రెండునిముషాలయినా తిరిగి రాలేకపోయింది. ఒకసారి అదలించండీ. ఈవేపచెట్టు ఒకటీ — వెలుతురు లేవకుండా కాళీలేకుండా కొట్టించేద్దురూ.

అచ్యుతం : ఎండాకాలంలో అడ్డుగా వుంటుంది. నువ్వు పూర్తి వెలుతురు భరించలేవు జానకీ!

జానకి : మరే! పళ్ళకాలం వస్తేచాలు రెట్టలు, నీచువాసన కాకుల్ని కొట్టండీ అంటే వుపన్యాసం చెప్తారు.

అచ్యుతం : అదిగో! నీ సుఖం వెనక్కి వచ్చేసిందిలే గొడవ పెట్టకు (రెక్కలు ఆడిన చప్పుడు).

జానకి : నేను నా గూటికి చేరతాను కానీ కాస్త దానికి మేత కప్పులో పోయండి అసలే అబ్బాయి తొందరగా వంట కావాలన్నాడు.

(మూడో భాగంలో కిటికీ ముందు కూర్చుని నేలమీద గిన్నెలు సర్దిన చప్పుడు)

అమ్మయ్య! ఇప్పటికి గానీ యుద్ధం మొదలవలేదు. ఎదురింటి మేడమ్మగారు షికారుకి డాబా మీదికి వచ్చింది! అంటే ఎనిమిది దాటిందన్నమాటే! ఎండలో కాగుతూ, జుట్టు ఆరబోసుకుంటూ సాయంకాలం షికారుకు కారులో వెళ్తూ ఎంత సుఖిస్తూ వుందో— కానీ మంచిది కాదుట...అరే ఈ నిప్పులు క్రుంగుతున్నాయి. మాయదారి బొగ్గులు (బొగ్గులు రాల్చి—విసురు చప్పుడు) గ్యాసొ దొరకదు. వంట చెరకా ఖరీదు. అమెరికాలో ఆడది వండనే అక్కర్లేదుట. రష్యాలో అమ్మాయిలు డ్రిల్లు చేస్తారు. ఉద్యోగాలుట. వాళ్ళసిగ తరగా ఆకాశంలోకే వెళ్ళారు—మనం మాత్రం యిలా చావవలసిందే! అరె క్రొత్త బియ్యం అన్నం ననువాయి కాదుగదా! (సిబ్బిలాగిన చప్పుడు) వెధవ బ్రతుకు ఎప్పుడూ వంటే! ... అమ్మాయి కాస్త నీళ్ళు పట్టమ్మా కుళాయి కట్టేస్తారూ!

శ్యామల:— వస్తున్నానుండమ్మా! (రెక్కల చప్పుడు) (పావురంతో మాటాడుతూ) ఏమే! ప్రేమా! నాప్రియకపోతమా! ఎక్కడికి ఎగురుతానంటున్నావు. కాలేజీకా! సినిమాకా! పోనీనాచేతిలో నవల చదువుతావా! ఏం! నీకూ యిష్టంలేదా! ఒక్కపేజీ చదువుతే చాలు నువ్వే ప్రేమలో పడతావు. సినిమాలెంత బావుంటాయో తెలుసా! నీ కళ్ళే చెదురుతాయి. ఒక్క హీరోని చూస్తేచాలు యిక్కడి నుంచి ఎగిరి వేషానికి మద్రాసు పోతావు. మీ పతులకే వేషాలొచ్చే రోజులొచ్చాయట కాని నిన్ను ఎగరనీయనుగా...చక్కగా కాలేజీ కొండల దాకా ఎగిరి వచ్చి మళ్ళీ ఈ దండెం మీదనే కూర్చో. నీరెక్కల కుచ్చులో రంగులు—వెలుగు ఎంత బాగుందే. ఎన్ని చీరెలు చూసానో ఒక్కటీ యింత కళగా కనబడలేదు. ఒక్కటీ యింతమెత్తగాలేదు. నీలానేను ఎగరగలిగితే (రెక్కల చప్పుడు) అమ్మమ్మ పోకు...నీలా అటూ ఇటూ చూడగల ధైర్యం వుంటే ఎంత బావుండును. నడిచే తోక కుచ్చేళ్ళు. యు ఆర్ సో స్వీట్! అర్థంకాలేదా! నువ్వు నేలమీద గెంతుతూ వుంటే నాట్యమాడినట్లు—నాకూ ఆడాలనే వుంటుంది కాని (టపటప ఎగిరినచప్పుడు) అలా నడవకాదుట రోకలిబండలా సాగాలట. అమ్మ గోలపెడ్తుంది. రోడ్డుమీద అందరూ నవ్వుతారట. ఒక్కసారి నీతో ఆకాశంలోకి తీసుకుపోవు. ఆ హెలికాప్టర్ల జంట. చిక్కటి కుదుపు కావాలను కొన్నవాళ్ళ దగ్గిర ... మళ్ళా నేలకి వొరిగిపోం కదా! ఛీపోవే నిన్ను వదులుతాననుకొన్నావా!

శేఖరం: (రెండవ భాగంలోకి వస్తూ...) శ్యామా! నీ సోది నా పావురం దగ్గిర చెప్పకే పాడయిపోతుంది. అసలు పావురా పోటీకి నా కాంతిని ఎగరవేదామనుకొన్నాను. నీ చన్నీళ్ళ కబుర్లు చెప్పినన్ను చంపుతున్నావు. ఆ శాంతి పావురం గోడ దాటి ఎగరదు ఆ సుఖమా కుళాయిదాటికుంటదు. నీ ప్రేమా సిటీబస్సుదాటి కొట్టుకోదూ! మీ స్నేహాలతో నాకాంతి సగం డీలాపడింది.

శ్యామల: నీ పావురానికి రెక్కబలం లేదు. మమ్మల్ని అంటావేం.

జానకి: కుళాయి నీళ్ళు తెమ్మంటే ఆ రెక్కల్తోటేమిటే గుసగుసలు. ఏరా శేఖరం ఒడ్డించేదా నాన్నగారు తొందర పడుతున్నారు.

శ్యామల: వస్తున్నా! అమ్మా!

నీ కాంతి పావురం కొండదాటి పోదులేవోయి. (అంటూ మూడో భాగంలోనికి పోతుంది)

శేఖరం: (రెక్కల చప్పుడు...రెండవ భాగం ప్రకాశ వంతమయ్యే వుంటుంది.) నిజమా కాంతీ! నీకు శక్తివుంది. ఈ కొండ దాటిపోలేవా! రష్యా సాంఘిక దృక్పథాన్ని అమెరికా మానవతా వాదాన్ని నీ చెవుల్లో ఎన్నోసార్లు పోసాను. పూర్వుల ఆచారాల్ని, నవీనుల అభ్యుదయాన్ని వల్లెవేసాను. డెమొక్రసీ పాలనీ, ఆఫ్రికా కన్నీళ్ళ మజ్జిగనీ తోడువేసాను. కానీ ఈ పోటీకి ఏం చేయాలో తెలియదు. అసలెందుకు పోటీ నువ్వెందుకు యిలాగే వుండాలి. నిన్నెందుకు మేమీ గూడులో మా ఆలోచన్లి దిదిస్తూ నిన్ను ముద్దాడాలి.

అచ్యుతం: గాలితాకిడికి చిన్న రెక్కలు తట్టుకోలేవు రాశేఖరం! ఏం! వడ్డించారా!

శేఖరం: (పావురంతోటే...) కానీ కాంతీ ఈ గోడమీద అంటించిన ఈ రెక్కలదెయ్యం విమానం చూడు. నాలాంటి వారిని మోసుకుపోతూ చేరుస్తూ వూరిస్తూ—గాలితాకిడికి తట్టుకోడానికి నాలాంటి వాడెవడో జన్మ ధన్యం చేసుకొని చేసినసృష్టి. కాని నీలోని నెమ్మది నీకళ్ళు చికిలించినవల్లవి, నీరెక్క విప్పిన ఊయలగెంతు దానికి సాధ్యమా! ఏం? నమ్మవా! నువ్వే నాకిష్టం. కాని నీకో.

జానకి:— శేఖరం అన్నం చల్లారిపోతుంది రండర్రా...

శేఖరం:— ఆ వస్తున్నా...మూడోభాగంలోకి వెళ్ళిపోతాడు. విరామ సంగీతం లైటువెలిగేసరికి రెండోభాగంలో కుర్చీదగ్గిర టీపాయ్‌మీద వక్కలడబ్బా వుంటుంది. అచ్యుతంగారు ఆకులు వేసుకుంటున్నట్లు కూర్చుని వుంటాడు.

అచ్యుతం :— పక్కలు ఈపూట మొదు గానే వున్నాయే. అతిథుల కివ్వవలసింది గానీ !...

శ్యామల : (మూడవభాగంలోంచి వచ్చే గుమ్మందగి రనుండీ వస్తూ.) నాన్నా ! మనపావురాలు లేవు. నాన్నా ! గూడు తలుపు తీసివుంది. అన్నీ ఎగిరిపోయాయి. స్తంభం మీద విమానంబొమ్మ గూడాలేదు.

జానకి :— వాడిపనే అయివుంటుంది. పక్కింటి కుర్రాడు వది లేసివుంటాడు. వాడికి ఎన్నాళ్ళబట్టో సరదా. మన పావురా లని విమానంలో ఎక్కించాలనేవాడు. మనం భోజనంచేసే టప్పుడు రోజూవచ్చి పావురాళ్ళి చూస్తూవుండే వాడుగా. గాలిపటానికి కామోసు విమానంబొమ్మ పట్టుకుపోయాడు.

ఏరా ! శేఖరం నీ భోజనం అయిందా !

అంటూవుంటే లైట్లు ఆరిపోతాయి. మొదటిభాగంలో మైకుముందు వ్యాఖ్యాతమీద లైటుపడదు. వెనకాల విమానం పటంవేలాడుతూండగా లైటు పడుతూండగా. విమానం బయలుదేరే గొప్ప చప్పుడు వినబడుతూండగా.)

వ్యా :— ఆ భీకర నినాద కుహరంలోని
కపోతాలు నిశ్చింతగా వున్నాయి.
తిరిగి రావచ్చు. రాకపోవచ్చు.
—ఆ ప్రయాణం సుదూర సానువులకో
సమీపసముద్ర తరంగపటలానికో.

—తెర—

ఇది నా ఉగాది గీతిక!

శ్రీ శై లేం ద్ర


ఎన్నో వరాళి రాగా
అల్లిన జీవన వల్లిక
ఎదలో పూచిన మల్లిక
ఇది నా ఉగాది గీతిక !

వ్యథా భరమ్మున రగిలిన
క్షుథా దవానల కీలిక
శ్లథైక పథాన విధూత
వధూటి మధూక మాలిక !


శ్మశాన వాటిక లోపల
పీచిన విలాస వీచిక
నిరాశ పేటిక లోపల
దాగిన సుధామరీచిక !

ఇది నా ఉగాది గీతిక
ఎదలో పూచిన మల్లిక
ఎన్నో వరాళి రాగా
అల్లిన జీవన వల్లిక !

eight good reasons why karnataka is favourable for INDUSTRIAL LOCATION




Rich natural resouces,mineral, agricultural and forests,waiting to be exploited.




A number of large industrial undertakings in the Central, State & the Joint Sectors generating spread effect.




Comparatively more peaceful and cordial industrial relations.




A stable Government with a positive approach towards industrial development of the State




A well developed infrastructure including a string of financial & development agencies like KSIIDC, KSFC, KSIC & KIADB.



A package of incentives subsidy, on project reports, supply of land, water & power at concessional rates, price preference etc.



Financial assistance to educated unemployed, specially to unemployed engineers and technicians under special employment schemes.



15% Central subsidy for undertakings started in the backward districts of Dharwar, Mysore and Raichur.

For details, please contact:

DIRECTOR OF INDUSTRIES & COMMERCE,

Karnataka State, Vidhana Veedi, Bangalore 560 001

Issued by the Director of Information & Publicity, Government of Karnataka, Bangalore 560 001

Dattaram-DIP-1A

గేయ కథానిక

రాగం తెచ్చిన ఋణం

శ్రీ పోచిరాజు శేషగిరిరావు

కలదొకరాజ్యము లలిత కళానిల
యమ్మయి యొప్పుచు నందములొలుకన్
నృత్య నాట్యముల లీలా భవనము
శిల్పసుందరికి శ్రీ తిలకంబై

బృహదీశ్వరుడట పేరిమితోడన్,
తాండవ నాట్యముదారత సేయున
పసిడి వీణియల ప్రాతస్సంధ్యల,
గానలహరి నయగారము చిందున్,

కవి కుమారులకు కళాక్షేత్రమయి,
కావ్యధారలను క్రమత చిలికెన్
రసికత యెరుగని రాజ్యము కాదది,
పసిడి నాణెములె బ్రతుకాదచట.

జాణతనము విరిబోణులలోనన్,
పుంజుకొన్నయది పొలపము మెఱయన్
కలనాదమ్ముల గానము నేర్చని
విలనాగలు లే రెంత వెదకినన్.

పల్లవి యెత్తిన పాట పాడినన్,
ఉల్లమెక్కడో ఊయలలూగును
దివి గంధర్వులు భువి దిగినారో,
సంగీతమ్ముల చారిమదెలుపన్.

పరవశమగు నొకపాటవినినచో,
పదముపట్టినను స్వర్గ మూడిపడు.
గంటమెత్తి ఒక కావ్యము వ్రాసిన,
అమృతాసారమ్మగు రసికాళికి.
పూల తావులకు మేలి పాటలకు,
తేనె లొలుకు నునువీణపలుకులకు
రసిక యువకులకు రారాజులకును;
వాసమె అలరు పట్టణరాజము.

తెలుగు బావుటా రెపరెపలాడెను,
'శారదాధ్వజము' గంటలు మ్రోగెను
"రంగాజీ'ని మణిరత్నమాలికల,
అభిషేకించిన కొలువుచవికె, అది

త్యాగరాజు విద్యాధనమెచ్చుట,
రామసేవకై అలినర్పించెను
"తంజాపురి విద్యాధరపురమే,"
కళలకెల్ల సంక్రందనుపిడది.

2

కొలువు కూటమ్ములో కలనాదమురణింప
ఆనంద ధామమే అగును తంజాపురము.
ఆ పురినె కాపురము వసియించు 'తోడి సీ
తా రామమను గాయకావతంసము రక్తి.
తంజాపురీ విభుడు తనదు నా సా సలో
ఈతనిన్ నిల్పె సంగీత విద్వాంసుగా,
రాగముల రేరాణి 'తోడి' ఈతడుపాడ
వెన్నెలల్ ప్రవహించు, పున్నెములు ప్రోవుపడు.
పూలపాట ము విస పొలుపొందు పరిమళము
'తోడి' ప్రస్తరియింప వీనులకు విందవును
భావుకత కది యునికిపట్టు గా రహియించు
రసికతలు చిప్పిలు రాజధానియె 'తోడి'
కమనీయ సేవధికి గాయకోత్తమునకున్
ఇంటిపేరుగమారె 'తోడి' పుణ్యమదేమొ!

తోడిసీతారామ విబుధేంద్రమణికి నా
తంజాపురప్రభువు తతసువర్ణము లిచ్చి
ధనధాన్యములు కొల్లలుగ, పంపునాతనికి
ఎన్నివచ్చిననైన చేలా విలాసమే
విత్తమ్ముపై చూపు చిత్తవీధిని నిల్వ
దదియేమి భోగమ్మొ! అదియేమి త్యాగమ్మొ!
తేటనీటినిబోలు తెలిముత్తెముల రాశి,
కరగిపోవును వీనికరమందు, గ్రహమేమొ!
కాశ్మీరఖండంపు కేదారములుగోలపు
అవియెల్ల తెగనమ్మి క్రొవడింజాల్చెనో!
ఏపూర్వపుణ్యమో! 'శేవు'గూర్చిన యూహ
రేగదాతని ఈహ, కేనాటి దానాడె
రారాజులర్పించు రత్నరాసులు నొక్క
క్షణములో హరియించు కర్పూరముంబలెను
జీవనాడికదుల్చు భోగమ్ములందేల
నో, లేక దక్షతయె కొఱవడెనొ యింటిలో!
ఎట్టులున్నను తోడి రాగమాలాపింప
గంధర్వులే సిగ్గుపడి తలలువంచెదరు
నారదులు తుంబురులు నిల్వలేరాతనికి
కంఠమ్ముతిప్పి, తా గానము చిలికింప.

3

భాగధేయములు ప్రతికూలములై
 సంక్షుభితిల్లి సంసారి తపమ్ముగా
చేతఁబడు సొమ్ము కాసు [illegible],
 పొడుప్రొద్దైకట [illegible]
[illegible] పూరుల వ్రేలన్,
 గృహకార్యములు గిలుకొల్పవలె
[illegible] అడాలుంపడె
 గప్పు గుప్పుమనె గుండెల మంటలు
ఋణదాతలై మడిమాన్యమ్ములు,
 కుదువపెట్ట సంకోచింపడుమది
ఊపశాంతిగా నున్నవస్తువులు,
 ఆధివెట్టి ధన మొడిగెను మున్నే
అభిమానము పిసరంతయుంటచే,
 ఎగవేసెడి తలపుల్ రానీయుడు
అవసరమ్మునకు నాదుకొనంగా
 ఎవనిగదియుటా అని మథనపడున్

ఉన్నాడొక్కడు ఊరందరి
 రక్తమ్ము పీల్చు రక్కసిమానిసి 'పులి' […]
అతని జేరుదురాతుది ఘడియల,
 ఎంత విత్తముడివోయెనేనియున్ […]
చరమసీమ ఋణశాపతప్తులకు,
 నిరవకాశులే నిల్తురయ్యెడల […]
హిరణ్యాక్షుడై యేదికోరినను
 అప్పనసి పక్కదురాతురులచటన్ […]
దిక్కుతోచను మిక్కుటమగు
 సవరసము పడుటచే, సంగీతార్ణవ […]
సుధాకరుడు ఈ మేఘమాలలో
 చోటుచేసుకొనె ఓటుపడంగన్ […]
ఋణగ్రాహి సంగీత కోవిదుడు
 వానిజేరి తలవంచి యిట్టులనె […]
"ఋణమిప్పింపుడు ఎంతపిలయిన
 రక్తమాంసములు కుదువబెట్టెదను […]
అన, నా జేరియు సంగీకారము
 తెలుపుచునిట్లనె తెలివిమెఱయగా […]
కుదువయుంచు మేకొంటెవు దైనను
 కొదువ లేదుడు కోరిన మేరకు […]
సీతారాముడల తొప్ప ధైన్యమున
 సర్వస్వము మున్నే యొడ్డితివయ్యు […]
ఏది యితు తాకట్టుగ నీనియెన్
 పేదవాడవు పున్నెరిగొని యేమన […]
సెట్టి మనములో విద్యుల్లతవలె
 అలోచన కదలాడెను తోడనె […]
ఎంత యొడ్డి ఇతరితరులు వోయిన
 కల దొక్కటి మెకడ, [illegible] […]
దాని నియ్యెదన దాచియుంచినన్
 కావలసిన కాసులు గైకొనుడి […]
కాదనిసన్ నీ దారిబొమ్ము,
 సంకటు పడనేలా? కలిగియుండియున్ […]
స్వామి! ఏమిది. చాల విచిత్రము!
 ఏమిలేని నాతోనా హాస్యము […]
నాదని చెప్పెడి నాడెపు వస్తువు
 కన్పడదే కనుపొడిచి చూచిన […]
ఏది నాదనుచు నీవు నెంతువో
 అది యుంచెద నీయొద్ద జంకకర […]

సిద్ధపడియె నే చేయి సాచితిని,
అనుగ్రహింపవె ఆదరమారన్
శ్రీ విహారి నేత్రాంత కోణమున
మెఱుపు మెఱసినట్లు మెఱసె లిప్తలో;
'తోడిరాగ'మను కూలతనుండగ
దాని బెట్టి ఋణధనము గైకొనవా!
అప్పు తీర్చిన యనంతర మందది
నీ సొత్తగునయ నిర్నిబంధముగ;
మూగచూపుతో మొనసిన చిత్తము
మాటపలుక దెప్పాటును రాచిన.
అన్యోపాయమ్మగోచరమ్మై
అంగీకృతిగా తలపంకించెను
దంధనమో ఋణధనము ఊడిపడ
విడిముడితో దినవెచ్చము గడపెన్
నాటినుండి తానే సభనైనన్
పూటపడిన ఈ తోడి రాగ మా
లాపింపడు నెవ్వారు వేడినన్,
పశ్చిమ బుద్ధులుగద బ్రాహ్మణ్యము
రాగ హృదయ మెటు రాపడి యుండెనో!
రాగధునులు కనరాకపోవుటకు!
శాపగ్రస్తుని చాడ్పున గాయకు,
గాత్రము బడలెను : కంపించెనహో!
దినములు గమించె తిమిరావృతమయి;
ఏలికడెందమ్మరియాటపడున్
గాన సభలలో రాగమాలికల
'తోడి' లేక ఒనగూడదు మోదము !
తోడి రాగమును పాడక యెట్టో
గాన విద్య కడు కమనీయముగా
సాధనచేయును సీతారామము,
దీని రహస్యము తెలియదెవ్వరికి.
ఇట్టులుండగా నొక దివసమ్మున
రాజసభకు నాహ్వానితుడై, సం
గీత విద్య ప్రకటించుచుండగా,
'తోడి' పాడుడని సదస్సు కోరెను.
విబుధవర్యు నెమ్మన మురియాడున్,
ఎట్లు తెల్పుటకు హితవు లేకయే
గాత్రమునందొక కంపము గదురన్
కరతల మందవగాఢత పొదివెన్.
నిలువరించి అవనీవిభుడడిగెను
రాజసమ్ముతో—జాణతనముతో!
గాయకుడవనత గాత్రుండయి, వే
నిప్పువంటి నిజమును ప్రకటించెన్.
ప్రభువు పలుకడొక పలుకేనియు
సంగీత పాటకుని క్రించుదనముతో,
ఎదలో ప్రమోగిన వెన్నో విషాద వేణువులతనికి,
నా ప్రభువునకున్,
రసజ్ఞతాఖని, రారాజా మహా గాయకదేవుని క్రమరాగధుని
నాస్వాదింపగ అంత ఋణమ్మును, తీరిచివైచె కళాలోలుపతన్
కోమటి తెల్విని కొనియాడెను మది తంజాపురపతి, సావధానతవ్
'తోడి' రాగసుధతో తనుపొందెను రాజసభనుగల
రసికసముద్రము.

లలితకళల తంజాపురినేలిన రాజుల తలచిన పులకించును మేన్,
కళావిలాసులు గావలదా, మన ఏలికలని తపియింతును నాలో
సరసతయున్ గుణసంసర్గముచే సంస్కారము వాసించు
నెల్లపుడు
ప్రభుతా లక్షణ పారమ్యమదే, కవిగాయకులే వాటికి జ్యోతులు

చెలిమి తలపులు

శ్రీ కొమ్మన రాధాకృష్ణ

వినీల నిర్మలాకాశంలా
విశాల మైందనీ
హిమాలయోత్తుంగ శృంగంలా
ఉన్నత మైందనీ
ప్రశాంత మహా సముద్రంలా
గంభీర మైందనీ
గగన తలం మించి
అవనీ తలంపైకి
అడుగు పెట్టే
స్వచ్ఛంద జలపాతమనీ
నిన్న మొన్నటి మాటేమిటి
ఈ క్షణం వరకూ
ఇక ముందూ—
అదొక్కటేనని అంటున్నా
అదే నిజమని నమ్ముతున్నా
మళ్ళీ ఈ కవిత వ్రాస్తున్నా
కాకుంటే
మధ్య తరగతి వాడి బ్రతుకు
ఎప్పటి కపుడు
దుర్యోధనుని మయసభా ప్రవేశం.
కొత్త కొత్త అనుభవాలు
కొత్త కొత్త ఆలోచనలు
తు. నా. బొద్దు జీవితం
సరిపెట్టుకుని ముందుకు పోవడం
పరిచయాలనూ

ఆలు బిడ్డల —
అన్నదమ్ముల —
అమ్మా నాన్నల —
రక్త సంబంధ సంకుచితత్వాన్ని
ఆ పైన స్వార్థాన్ని
ఒక్కొక్క మెట్టే ఎక్కుతూ
వెలుగు నీడల నధిగమిస్తూ

ప్రేమ పరిధులను పెంచుకుంటూ
స్నేహమా
జీవన సర్వస్వమా
నీ దగ్గరకే పయనం

సౌహార్ద్రతతో పునీతుణ్ణి చేశావు
ఔదార్యోన్నత శృంగాలపై
ఆడించావు అలరించావు
అగాధాల గాథల నెరుగలేనంటూ
భూమ్యాకాశాల మధ్య
అంతా
అంతా నీవై
స్ప
నా నుదుట ముద్దు పెట్టుకునే
సమయంలో
ఓ మెరుపు
గగనమంతా అంధకారం

ఆ విద్యుల్లతను
ఆపదను కత్తిని
ఆ స్నేహవల్లరిని
చూచే శక్తి లేదు
చేపట్టే ఒడుపు లేదు
పెనవేసికునే మెలకువలేదు
శూన్యంలో ప్రేలాపన
స్నేహమా ! జీవన సర్వస్వమా

నే నెప్పటికీ
నీ శ్రేయోభిలాషిని
నా పయనం
దరి చేరని వైనం తెలీదు

కాంతిని ప్రసరించు
కరుణామృత ధారలు వర్షించు
కాపాడు రక్షించు

విప్లవ కవిత్వమూ, మతమూ

శ్రీ దోనేపూడి వెంకయ్య

విప్లవ రచయితల సిద్ధాంతం ప్రకారం కవిత్వానికి మొదటి శత్రువు మతం. మతం అనేది కవిత్వాన్ని సాంఘిక పరిసరాలనుండి అతీత అలౌకిక విషయాలలోకి తీసుకుపోయి లోకవాసనలు లేకుండా చేస్తుంది అని వీరంటారు. కవిత్వాన్ని వాస్తవిక జీవితం నుంచి వేరుచేసే క్రూరశక్తి మతంఅని, ఈ మతం అజ్ఞానం నుంచి పుట్టినదనీ, మత ప్రభావం మీద విప్లవకవులు అవిరామంగా తిరుగుబాటు చేయవలసి వుంటుందనీ, మతాలమత్తుతో అమానుష దోపిడీని కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతున్న దశలో పోరాటం జరపాలనీ 'కవిత్వం—చైతన్యం' అన్న తమ విప్లవ సాహిత్య వ్యాసాలలో శ్రీ త్రిపురనేని మధుసూదనరావుగారు వ్రాశారు. అందు కనుగుణంగానే ప్రతి విప్లవకవీ తన కవిత్వంలో విధిగా మతాన్ని దూషిస్తూనే వున్నారు అయితే మతంమీద ఇంతటి ఈర్ష్య అసూయ పెంచుకొని గొంతు చించుకొనడానికిగల కారణాలను అన్వేషించటం అసందర్భం కాదేమో.

విప్లవకవిత్వం మార్క్సిస్టు సిద్ధాంతం మీద ఆధారపడి ఉంది. అంటే మార్క్సు ఏమిచెబితే వీళ్ళు అది చెబుతారు. అదే తమ కవిత్వంలో వ్రాస్తారు. మతం మత్తుమందు అని మార్క్సు అన్నాడు. కనుక వీరు కూడా మతం మత్తుమందు అని అంటున్నారు. మార్క్సు ఏమిచెబితే అదంతా సత్యమేఅని వీరు నమ్ముతారు. ఈ దృష్టితోవారు మార్క్సు మాటల్ని బలపరుస్తారు. ఎంతో కష్టపడి వాదిస్తారు వాళ్ళు దానిని మార్క్సిజం అంటారు. అది ఒక 'ఇజం', ఒక పరిపూర్ణమయిన సిద్ధాంతం మనుష్యజాతి యొక్క బుద్ధి ఎంతవరకు పోగలదో అంతవరకు పోయి చెప్పాడు, మార్క్సు. మనుష్యబుద్ధికి ఇక అంతకుమించి అంతుబట్టగలిగే సత్యంలేదు తుది మాటలను మార్క్సు చెప్పాడు. మార్క్సు వాక్కు బ్రహ్మవాక్కు. మార్క్సు మాటలతో మార్పు చేయవలసింది ఏదీలేదు. అది పరమనిరపేక్ష సత్యం. ఈ విధంగా వాదిస్తూ మార్క్సు చెప్పిన మాటలు తప్పని ఋజువు అవుతున్న ప్రతిచోటా తప్పుకాదు ఒప్పేనని సిద్ధపరచటానికి మనస్సుకు తోచినరీతికి అర్థాలు చెబుతున్నారు.

ఇంతకూ కార్ల్ మార్క్సు మతాన్ని గురించి అన్నమాటలు ఇలా ఉన్నాయి., మతం తెచ్చిన అసంతృప్తి అసలు లోపలఉన్న నిజమయిన అసంతృప్తికి వ్యక్తీకరణ. నిజమయిన ఈ అసంతృప్తి వలనవచ్చిన తిరుగుబాటు పీడితులయిన ప్రజలు విడిచే నిట్టూర్పు మతం. హృదయంలేని లోకానికి అది హృదయంవంటిది. నిరుత్సాహకరమయిన పరిస్థితులనడుమ ఉత్సాహాన్ని నింపుతుంది మతం. అది ప్రజలకు నల్లమందు"

మార్క్సు చెప్పిన ఈ మాటలు అనాటి దేశకాల పరిస్థితుల దృష్ట్యా మార్క్సు మనస్సులో ఏర్పడిన ఒక దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయి అంతే. ఆనాడు పోపును కేంద్రబిందువుగా అంగీకరించిన క్రైస్తవ దేశాలన్నీ పోప అధికారం క్రిందికి వచ్చేవి. రానురాను పోపు అధికారంపైన తిరుగుబాటు జరిగింది. భక్తుడికీ భగవంతునికీ నడుమ మధ్యవర్తిగా ఈ పోపు ఎందుకు అని ప్రశ్నించారు కొంతమంది. తత్ఫలితంగా ప్రొటెస్టెంటు మొదలయిన మతాలు ప్రచారంలోకి వచ్చాయి. తమదేశ వ్యవహారాలలో విదేశీ మతశక్తుల జోక్యం ఎందుకుఅని ప్రశ్నించారు కొంతమంది. తత్ఫలితంగా జాతీయవాదులు మొదలయిన వారికి చోటు దొరికింది. అసలు మతంఅనేది బూటకం అది మత్తుమందు; మానవశక్తికంటె మించిన ఈశ్వరశక్తిని గురించి మాట్లాడటం వట్టి ఊహాగానం; ఈ సృష్టికి మూలకారణం భౌతికపదార్థం మాత్రమే; ఇలా సూత్రీకరింపసాగారు మరి కొంతమంది తత్ఫలితంగా మార్క్సు మొదలయినవారి భావాలు ప్రచారంలోకి వచ్చాయి. భౌతిక పదార్థమే సృష్టికి మూలమని చెప్పిన మార్క్సువాదులు మనస్సు కూడా భౌతిక పదార్థమేనని అన్నారు. అంటే మతం, సంస్కృతి, నీతి – వీని అన్నింటికీ స్వతంత్రమయిన అస్తిత్వం లేదు. సామాజిక, ఆర్థిక పరిస్థితుల ప్రతిబింబాలే ఇవి అన్నీ అని చెప్పసాగారు.

అయితే ఈ వాదాన్ని కూడా తరువాత తరువాత విద్వాంసులు తిరస్కరింప సాగారు. ఆనాటి పరిస్థితులలో మతము, చర్చి — వీని వికృతావస్థను చూచి మార్క్సు వెల్లడించిన అభిప్రాయాలలో కొంత ఔచిత్యం ఉండి వుండవచ్చు. కాని దానినే సార్వదేశికమయిన, సార్వకాలికమయిన సత్యంగా స్వీకరించటం అనుచితం అని అన్నారు. విభిన్న దేశాలలో విభిన్న కాలాలలో విభిన్న పరిస్థితులలో మతం ఎటువంటి పాత్రను నిర్వహించింది, దాని భూమిక ఎట్టిది, — దీని ఆధారంగా పునరాలోచన చేయవలసి వున్నదని పట్టుబట్ట సాగారు "అసంతృప్తికి వ్యక్తీకరణ" అని మార్క్సు చెప్పిన మాటను గమనించినట్లయితే మతాన్ని మత్తుమందు అని అనటం తప్పు. మానవ జీవనానికి మూలాధారంగా మతాన్ని అంగీకరింపకపోయినా దాని స్వతంత్ర ప్రతిపత్తిని మాత్రం అంగీకరించితీరాలి దాని స్వరూపం సామాజిక ఆర్థిక పరిస్థితులను బట్టి నిశ్చయింపబడుతుంది ఇలా తాత్త్వికులనేకులు చెప్పసాగారు.

ఈ భావాలు పుంజుకునేకొద్దీ, అందులోనూ 1842లో వ్యక్తి స్వాతంత్ర్యం, పత్రికా స్వాతంత్ర్యం — అనే విషయాల మీదా, 1844లో ఆర్థిక దార్శనిక విషయాలమీదా మార్క్సు వ్రాసిన వ్రాతల నాధారంగా చేసికొని దార్శనికులు ఇంకొక అడుగు ముందుకు పోయారు. నిర్జీవమయిన భౌతిక పదార్థాలు అమూర్తాలయిన భావాలను ప్రభావితం చేస్తాయి అలాగే అమూర్తాలయిన భావాలు నిర్జీవమయిన పదార్థాలను కూడా ప్రభావితం చేస్తాయి. ఇలా ఒకవైపున సామాజిక, ఆర్థిక పరిస్థితులు మతం, సంస్కృతి, నీతి మొదలయిన వాటిని వికసింప జేయటంలో ఎలా ప్రధాన భూమికను నిర్వహిస్తాయో, అలాగే మతం, సంస్కృతి, నీతి మొదలయినవి సామాజిక, ఆర్థిక పరిస్థితులను రూపొందించటంలో ప్రధాన పాత్రను వహిస్తాయి, అంటే అవి పరస్పరం ఒకదానినొకటి ప్రభావితం చేసుకుంటుంటాయి [2]

ముఖ్యంగా ఇంగ్లాండు, ఫ్రాన్సు, ఇటలీ, జర్మనీ దేశాల కమ్యూనిస్టుపార్టీలు అధికార ప్రకటనలు కూడా చేయిసాగాయి. ఇది ఆధారంగానే ఇటలీ కమ్యూనిస్టుపార్టీయొక్క ప్రముఖ నాయకుడు టోగలిఒట్టీ పోపుతో ఒక ఒడంబడిక కూడా చేసుకున్నాడు. 1966 ఫిబ్రవరి 10వ తేదీన బ్రిటన్‌లో ఒక మహాసభ జరిగింది. అందులో బ్రిటిషు కమ్యూనిస్టుపార్టీ సెక్రటరీలూ, బ్రిటిషు చర్చికి చెందిన ఫాదరీలూ పాల్గొన్నారు. అక్కడ 'మతం, కమ్యూనిజంలలో ఉన్న సమాన తత్త్వాలు' అనే విషయం చర్చింపబడింది, మతం మత్తుమందు అయితే సమాన తత్త్వాలను వెతకవలసిన అగత్యం ఏమిటి? పునర్విచారణ ప్రారంభమయింది, అంతకు మించి మరేమీలేదు.

మతాన్ని గురించి మార్క్సు చెప్పిన విషయాలు భారత దేశానికి వర్తించవు అని మొదటిసారిగా మొన్న నీ మధ్యనే కె. దామోదరన్ అనే భారతీయ కమ్యూనిస్టు 'ఇండియన్‌థాట్' అన్న తన గ్రంథంలో వ్రాశాడు. భక్తి సాంప్రదాయంవల్ల భారత దేశంలో సామాజిక సంస్కరణలు జరిగాయనీ, పంజాబులో మహారాష్ట్రలో రాజకీయ విప్లవాలు కూడా జరిగాయనీ ఈయన స్పష్టంగా వ్రాశాడు. భారతీయ కమ్యూనిస్టులు ఇన్నాళ్లూ చెప్పిన దానికీ, మార్క్సిజాన్ని గురించి ఈ గ్రంథంలో చేసిన వ్యాఖ్యానానికీ ఎక్కడా పొత్తులేదు. భక్తి కవిత్వం బానిస కవిత్వం అని చెప్పిన మాటకూ (పేజీ 39 — కవిత్వం—చైతన్యం) ఈ పై మాటకూ హస్తిమశకాంతరం వుంది. స్వర్గానికీ పాతాళానికీ ఉన్న దూరం వుంది.

నిజానికి మార్క్సు తన అభిప్రాయాలన్నీ ఒక వాదంగా ఒక "ఇజం"గా పరిణామం చెందాలని మనస్సులో అనుకున్నాడా? తన భావాలు శాస్త్రీయమయిన పద్ధతిలో ఆలోచించే ఒక దృక్పథానికి త్రోవ చూపిస్తాయి అని మాత్రమే ఆయన అనుకున్నాడు. స్వయంగా మార్క్సే చెప్పాడు: **"Thank God, I am not a Marxist."** మార్క్సిస్టు కాకుండా వున్నందుకు "భగవంతుడికి?" ధన్యవాదాలు చెప్పాడు మార్క్సు. కాని ఆయన అనుయాయులు ఆయనమీద ఈ ఇజాన్ని (వాదాన్ని) రుద్దారు. ఇప్పుడా వాదం అడగడుగునా అసఫల మవుతున్నట్లు ఋజువవుతున్నది. ఆ 'ఇజం'లో అన్నీ దోషాలే కనుపిస్తున్నాయి.

ఒక సునిశ్చితమయిన ఆర్థిక రచన లేకపోవటం ప్రధానమయిన దోషం. సృష్టిని గురించి చేసిన సిద్ధాంతాలు నవీన శాస్త్ర పరిశోధనల కారణంగా మూలమట్టంగా నేలకూలిపోవటం ఇంకో దోషం. రష్యాలో చైనాలో యుగోస్లావియాలో కమ్యూనిజం క్రమంగా వెనుకకు పోతున్నది. ఇది ఇంకో దోషం.

మార్క్సు అనుయాయులు మార్క్సు భావాలను ఒక వాదంగా (ఇజం) మాత్రమే కాక ఒక మతంగా కూడా తయారు చేసిపెట్టారు. మతం అంటే ఏయేలక్షణాలుండాలో అవన్నీ మార్క్సు వాదానికి అంటగడుతున్నారు. కురాన్‌వలె బైబిలువలె తమకొక పవిత్రగ్రంథం వుండాలనీ, మహమ్మద్‌వలె క్రీస్తువలె ఒక ప్రవక్త వుండాలనీ వారికోరిక. పవిత్ర గ్రంథంగా 'దాస్ కేపిటల్' **(Dass Capital)** నూ, ప్రవక్తగా మార్క్సునూ

స్వీకరించారు. సప్తస్వర్గాలకు బదులుగా కమ్యూనిజంలో ఉచ్చతర స్థితులను కల్పించారు. (**Higher Phases of Communism**). గతి తార్కిక భౌతికవాదాన్ని 'అల్లా'గా కూడా వాళ్ళు చెప్పారు. ఈ విధంగా ఒక ప్రవక్త, ఒక మతగ్రంథం, ఒక స్వర్గం, ఒక అల్లా—ఇలా మతానికి చెందిన సర్వ లక్షణాలనూ మార్క్సు వాదానికి వర్తింపజేయాలని ప్రయత్నిస్తున్నారు.[3] దీనిలో ఒక పిడివాదం, ఒక మూఢనమ్మకం, ఒక అంధానుకరణ బహిర్గతమవుతున్నాయి.

బహుశా అందుకే జూల్స్ మొనరాట్ అనే ఫ్రెంచి తాత్త్వికుడు కమ్యూనిజాన్ని 'ఇరవయ్యో శతాబ్దపు ఇస్లాము' (**Twentieth Century Islam**) అని అభివర్ణించాడు. రేమండ్ ఆరన్ అనే ఇంకోశాస్త్రవేత్త కమ్యూనిజాన్ని 'ఒక మతరహిత మతం' (**Secular religion**) అని నిర్వచించాడు. ఆస్వాల్డ్ స్పెంగ్లర్ క్రైస్తవమతం బోల్షివిజానికి నాయనమ్మ (అమ్మమ్మ) (**Christianity is the grandmother of Bolshevism**) అని వర్ణించాడు. నికొలాయ్ బెర్డియావ్ రష్యన్ బోల్షివిజాన్ని గురించి యిలా చెప్పాడు 'ఇది ఒక రకమయిన వర్గ తత్వాన్ని ఆరాధించే మతం'[4] పాల్ టెలిచ్ అనే విద్వాంసుడు "సమాజవాదం మతశక్తుల విజృంభణ మాత్రమే" (**merely an upsurge of religious forces**) నని అన్నాడు.

మతం మత్తుమందు అనీ, అది కవిత్వానికి మొదటి శత్రువు అనీ, మతంతో ప్రసక్తిలేని సిద్ధాంతాలు చెబుతున్నాయనీ భ్రాంతిపడే ఈ మార్క్సిస్టుమార్కు కవులు తాము కూడా మార్క్సిజమనే ఒక "మత" పిచ్చితో వ్రాతలు వ్రాస్తున్నామనేది తెలిసికోలేక పోతున్నారు. మతాన్ని దూషించే ముందుగా తమకు ఎలాటి మతాంధత గాని, మూఢ విశ్వాసం గాని లేదని నిరూపించుకొనవలసిన బాధ్యత వారికి ఉన్నదని జాతీయ భావాలు గల ప్రతి సాహిత్య విద్యార్థీ ఈనాడు ఈ విప్లవ రచయితలను నిలవేసి అడగవలసిన అగత్యం ఎంతయినా వున్నది. తమ యీ మత తత్వాన్ని విడనాడవలసిందిగా అర్థించవలసిన అవసరం ఎంతయినా ఉన్నది.

అనుబంధం

1. "Religious distress is at the same the expression of real distress and the protest against real distress. Religion is the sigh of the oppressed creature, the heart of a heartless world, just as it is the spirit of a spiritless situation, It is the opinion of the people."

   (Contribution of the Critique of Hegels' Philosophy of Right — by Karl Marx)

   "Religion is a spiritual Vodka ....,"

   (Lenin)

2. "Socio-economic conditions mould culture — ethics — religion. Culture, ethics and religion in their turn mould socio-economic conditions; both act and react upon each other."

3. "The corruption of the world is attributed to our original sin — the introduction of private property. Redemption from that sin has to come through the atonement of the sacrificial lamb — the proletariat. The message of salvation is contained in holy writ — the writings of Marx and Engels. The interpretation of faith is entrusted to an infallible authority — the Central Committee of the Communist party."

   (From Problems of Communism — 1971 Volume)

4. "It is a kind of sectarian idolatrous religion which has its own scriptures, ca echism, Messiah, and inverted theocracy."

   (Nikylai Berdiov)

WORLD TELUGU CONFERENCE विश्व तेलुगु सम्मेलन

1975

ప్రపంచ తెలుగు మహాసభలు

మన కర్తవ్యం

ఎన్నడూ చూడలేదు
మున్నెన్నడూ చూడలేదు!
ఇక ముందెప్పుడు చూస్తామో!!
దేశ దేశాలలో, వివిధ రాష్ట్రాలలో
ఎన్నేళ్లుగా నివసిస్తున్నారో తెలుగు ప్రజలు!
ఒకే వేదికపై కలుసుకొనే శుభవేళ!
సమీపిస్తున్నది ఉగాది పండుగ!
ఇరువై అయిదు శతాబ్దాల
తెలుగు సంస్కృతి వెలుగు బింబం
ప్రపంచ తెలుగు మహాసభల మహోత్సవం!
మరపురాని మధురఘట్టమై నిలిచేటట్లు
మహోజ్వలంగా నిర్వహించుదాం!
సహాయ సహకారాలు అందించుదాం!
కలసి, మెలసి పాల్గొని ఆనందించుదాం!
సమైక్య సుహృద్భావాలను పెంచుకొందాం!
తెలుగు దేశ సత్వరాభివృద్ధికి తోడ్పడుదాం!
సర్వజనులకు శాంతి సౌభాగ్యాలను చేకూర్చుదాం!
ఇదే మన ఆశయం! ఇదే మన కర్తవ్యం!!
ఇదే మన ప్రతిజ్ఞ!!!

— శ్రీ మండలి వెంకట కృష్ణారావు,
కార్యనిర్వాహకాధ్యక్షులు.

వానకాలం

శ్రీ బి. శ్రీరామ్ రెడ్డి

మొగులుకేమో బుగులు పుట్టెను
ముసురువెట్టి యేడ్వసాగెను
[1]యాల్లగానీ యాల్లలో
రొక్కిళ్ల సప్పు డెక్కువాయెను.

[2]వంపుకూ వయసొచ్చెనేమో
యెల్లువలతో గజ్జెకట్టెను
వాగుకూ పొగరెక్కెనేమో
తాగినట్లూ ఆటలాడెను.

[3]సొకుదీసే [4]తట్లువలిసి
[5]నుడుసు గక్కినట్లు సూస్తే
ఒడ్డు ఒరమూ పక్కపక్కల
నీటి నురగలు నిల్చిపాయెను:

పూరిగుడిసెలో [6]పొటుకుబెట్టెను
పుడమి తల్లికి జలుబు పట్టెను
తడవ తడవకు ఈదురుగాలి
తడిమి తడిమీ పలకరించెను.

పట్నమంతా అద్దమైతే
పల్లెలన్నీ [7]ముద్దలాయెను
ముద్దలేనీ పోరగాల్లకు
పొద్దుగూకులు ఆకలాయెను.

నడవగల్గిన [8]సడకులన్నీ
అడుగు అడుగున కులుకసాగితె
దిక్కులేనీ పిల్లదోవకు
ముక్కుమొగమే లేకపాయెను.

యాడజూసిన మడుగులాయెను
అడుగువెట్టగ కష్టమాయెను
బడుగు బతుకూ పాడుగానూ
పల్లెజీవిత మెంతదాయెను.

మొన్న మొన్నటి పెద్ద [9]అదునుకు
వన్నగింజలు సాలువారెను

సాలువారిన మొలకలన్నీ
[10]దంతెకొచ్చిన ఈడువాయెను.

కుంట కట్టకు గండి పడగా
దంటు దంటుకు గుండె పగిలెను
పంట తల్లీ పైటకొంగుతొ
కంటి తడినీ అద్దుకొనెను.

ఏరు పండిన ఆవవాల్లుగ
ఎందు జూసిన నీళ్ళు నిండెను
కరువు దీరిన సంతసమునా
అరవసాగిన కప్పలుండెను.

జానకమ్మా తానమాడి
[12]జారాడి మడుగూ నింపిపెడితే
దోమపిల్లా [13]ఉతుకలాడెను
ఈగతల్లీ బొద్దుకోసెను.

ఇంటి వెనకా పెంట కుప్పలొ
పేడ పురుగుల పెండ్లికాగా
విందు భోజన మంటు వచ్చిన
పందిగాళ్ళూ కెలికివేసిరి.

ఎందు గడ్డీ మేయలేక
ఎండిపోయెను పసుల డొక్కలు
కొత్త పసికను మేసి మేసి
ఉత్త [14]పుర్రును కొట్టసాగెను.

ఏటి పొడుగున దుక్కి దున్నుచు
ఎత్తలేదూ మెడను యెన్నడు
సత్తువంతా ఉడిగి గిత్తా
[15]ఎత్తుపడిన పానమాయెను.

[16]తోలు బొక్కలు మిగిలిపోయెను
తోలు బొమ్మావిదముగాయెను
సమురులేనీ దివ్వెలోని
మెత్తబడినా వత్తులాయెను.

[17]గొయికపిల్లా గొంతు పెంచీ
గుయ్యిమంటూ పాట పాడితె

మాటి మాటికి పసుల తోకలు
లేసి లేసి ఆటలాడెను.

పరుసుకోనూ సాప లేకా
కప్పుకోనూ దుప్పట్లేకా
పాకలందలి పసులవోలె
పాలేరు యొకడు కున్కు దీసెను,

[18]వర్రె నీళ్ళా తాగివచ్చిన
బర్రెలాను పాలు పిండితె
బుడ్డి ముంతా నిండకుండనె
సడ్డి విరగా దన్నిపోయెను.

మిరప కారం యేసినట్టే
సజ్జ రొట్టె సేతికిస్తే
గడ్డ సెరుగూ పెట్టలేదని
బిడ్డడేమో యిసిరికొట్టెను.

కొత్త నీరూ రుసికి మరిగి
[19]కొడిసె సేపా ఎదురు యెక్కితె,
వర్రెలందున పడ్డ నీటిలో
[20]బురద మట్టలు ఉరుకలాడెను.

[21]కొర్రమేండ్లు, [22]మార్పుడుగాళ్ళు
[23]సందమామాలు, [24]ఉసికదొంతులు
వాన సిన్కులతోటి గలిసీ
వర్రెలందున పడ్డవేమో.

బెస్తవాండ్లకు బోయవాండ్లకు
మస్తు మస్తుగ పనులు దొరికెను
వలలు వేసి, [25]గూడలేసీ
[26]పరక పిల్లలు పట్టసాగిరి.

బువ్వలోకి తొక్కు లేదని
బూవమ్మ యెన్నోసార్లు సెప్తే
[27]కవుసు దినిపిస్తాను సూడని
గాలమెత్తెను సాయబయ్య.

వాన నీరూ యెక్కువయ్యా
[28]కయ్యగొట్టెను పొలములన్నీ
లోతుకొయ్యిన బావులన్నీ
[29]కోలుయెల్లి పార సాగెను.

ఊరి యెన్కకు పోదమంటే
పెద్ద యేరూ ఎర్రిదాయెను
ఊరి ముందలి కోదమంటే
సిన్న వాగూ [30]సిదరేగెను.

పదునువువ్వా తాపునల్లా
పారతోటి సెక్కి సెక్కీ
వానపాముల పట్టుకోనీ
సాయబయ్యా సాగిపోయెను.

పుడమితల్లి యీపుమీద
పుండుపుట్టెను మందులేదు
[31]ఉబ్బలంటా దానిపేరు
ఉబ్బలేదూ దిబ్బలేదు ।

ఉట్టిబురదేగాని పిస్తది
వొట్టివోయినట్లు తోస్తది
ఏనుగైనా దాంట్లపడితే
ఎళ్లడాను శాన [32]కస్తి

గాడిలల్లవోయె టోళ్లను
గాలిమోటర్లెక్కెటోళ్లను
గట్లకెళ్ళి వచ్చిపొమ్మను
ఇట్టెదిగుతది వాళ్ల[33]మస్తి

బస్తినుంచి ఫల్లెకాడకు
బాటలంతా వంపులొంపులు
లాగులోళ్ళను వచ్చిపొమ్మను
వాళ్ళ అబ్బలు యాదికొస్తరు.

[34]దఫ్తరంల కూకోని
దస్తరాలు రాసి రాసి
కిస్తు గట్టమంటా వస్తరు
గింతపనివి సేసిపెట్టరు

కరుకు సుట్టలు తాగుకుంటా
గంజి[35] గట్కా మింగుకుంటా
ఎద్దువోలే పొద్దుగూకులు
మొద్దుకష్టం మేముజేస్తం.

నిరుడు వానల్లేకపాయె
ఈయేడు వానాలెక్కువాయె

ఉన్న కిరికిరి మోట్లావున్నది
లేని తెగులూ లేసీ కూసునె.

అప్పులోళ్లూ [36]పీచదీసిరి
హోదెదార్లు జులుం జూపిరి
యియ్యమంటె [37]సక్తు జేసిరి
యిల్లు వాకిలి జప్తు జేసిరి.

ఊరి కొక్కడె వైదుగాడు
పురుసోత్తం అవుసలాయన
సెట్ల పసరూ దీసి పోస్తడు
పాట్లమూలా మందులిస్తడు.

మొన్న మొన్నా ముసలిదానికి
సన్నిపాతం వచ్చినపుడూ
సూది మందూ లియ్యమంటే
[38]సూదిగొడుపుతొ వాతలేసెను.

వాతలాకు తట్టుకోక
తాతలాను కలిసె ముసలిది
పెద్దల పండుగనాడు దానికి
పిండం పెట్టేటోడి కొచ్చెను;

[39]గేరినిండా [40]వోకిలింతలు
ఊరికంతా [41]కాలు బయటికి
ఊరి దేవర సిన్నబాయెను
ఇంతకతకూ దీసికొచ్చెను.

ముత్యాలు సచ్చె పగడాలు సచ్చె
సగం వూరూ ముండమోసె
గుండెలానూ సేతపట్టుక
గూడెమంతా వణక సాగెను.

కావలోళ్ళను బస్తికొయ్యి
డాకుటేరును పిలువమంటే
డాకుటేరూ పట్నంబాయె
కంపోండరు కల్లపాయె

ఇద్దరొచ్చిరి పాడిసెటోళ్లు
ఇంక సచ్చిరి ఊరి వాళ్లు
సూదులు పాడసేటోళ్లుగూడా
సెప్పకుండనే [42]తెక్కెల్లిరి.

యాపమండలు దీసికోని
ఎరుకలామే యెరుకసెప్పెను—
మైసమ్మను మరిసినారని
మాయమర్మం జూపినాదనె.

[43]గత్తరన్నా సంగతంతట
గాలిలాగా పాకిపోయెను
పక్కవూరిలొ అక్కడక్కడ
కక్కుడ, బైటికి యెక్కువాయెను.

గట్టుగట్టి, పొలిమేరగట్టి
ఊరిలో బొడ్రాయినిగట్టి
దున్నపోతును బలినివెట్టి
అన్నంరాసితొ[44]పొలిని వెట్టిరి.

సద్దుమణిగెను ఊరుకొద్దిగ
సక్కబడెనూ రోగమంతట
మేము జేస్తిమి సూడమంటూ
లేచివచ్చిరి లీడరయ్యలు.

పంచెగట్టిన[45]సారిపంచూ
గోసివోసిన గోనెసంచూ
ఎవని కాడే నాయకున్నని
ఎగురసాగిరి ఊరినిండా.

రేపు వోటూ యేస్తెగనకా
మాపటాల్లకె లైట్లు వస్తయి
వోట్లుగట్టేటోళ్లకంతా
వోటు కష్టం తక్కువైతది.

పటేలు మాట విన్నవోడికి
[46]పట్టలెన్నో సిక్కిపోతయి
కరణమయ్యా మాటలింటే
[47]గైరాన్లు యెన్నో దక్కిపోతయి.

గాంధిదేవుని తలుసుకొనిరీ
దేవునోట్లూ బెట్టుకొనిరీ
రామరాజ్యం వస్తదనిరీ
భూమి మస్తుగ యిస్తదిరీ

సుక్కల్లోంచి సొర్గలోకం
పల్లెలాకు దిగుతదనిరి
పేదబతుకూలోన
కమ్మతేనె జల్లూ కురుస్తదనిరి.

గాంధితాతా సెప్పినట్లే
గ్రామరాజ్యం వస్తున్నది ! ?
ఎన్నడో అది యెన్నడో
అన్న ఆశా రేగుతున్నది.

---

1. సమయం కాని సమయం 2. వాగూ–వంపూ అంటారు వంపుకు వర్షాకాలంలోనే నీళ్ళుంటాయి 3. స్వారి 4. తట్టుపొట్టిగుఱ్ఱం 5. నురగ 6. కన్నాల్లోంచి నీరు బొట్లుబొట్లుగా కారడాన్ని పొటుకు అంటారు 7. తడిసిపోయాయి 8. రోడ్లు 9. సమయానికి వడ వరం 10. గుంటక అనబడే కలుపుతీసే పనిముట్టు 11. మొక్క 12. స్నానానికై ప్రత్యేకించిన చోటు 13. ప్రసవించెను 14. నీళ్ళసేడ 15. రోగము వచ్చినట్లు 16. ఎముకలు 17. దోమ 18. కాలువ 19, 20, 21, 22, 23, 24. మత్స్యవిశేషాలు 25. చిన్నరకం వల 26. చేపపిల్లలు 27. మాంసపదార్థం 28. నీటి ఒరిపిడికి ఏర్పడిన గుంట 29. వెళ్ళిపొరుట 30. చిదర 31. ఊబి 32. కష్టము 33. గర్వము 34. ఆఫీసు 35. గట్టి జొన్న అన్నం 36. వెంటబడిరి 37. మొరాయించిరి 38. దబ్బనంలాంటిది 39. వీధి 40. డోకులు 41. విరేచనాలు 42. పారిపోయిరి 43. కలరా 44. దిష్టితీసేఅన్నం 45. సర్పంచు 46. భూమి పట్టాలు 47. బంజరు భూములు

కర్ణాటక కవి సర్వజ్ఞమూర్తి

శ్రీ తీర్థం శ్రీధరమూర్తి

ఆంధ్ర కర్ణాటకులకు గల పరస్పర సన్నిహిత సంబంధము మరి యేరెండు ఇతర భాషలవారియందును కానరాదు. వీరి సాహితీ సంస్కృతులు ఒక్క పాదులో పెరిగి, మూడుపూవులారుకాయలు కాచిన మనోజ్ఞ లతికలు. వీరును వారును అరమరికలు లేక అన్నదమ్ములవలె మెలగిరి. పండుగలు, పబ్బములు, ఆచారములు వ్యవహారములు ఒకే రీతిలో ఆచరించిరి. చాలకాలము ఒకే రాజా శ్రయములో సుఖశాంతులను అనుభవించిరి. అట్టి కాలస్థితిని "కర్ణాట కటక పద్మవన హేళి శ్రీనాథభట్టసుకవి" అను పద్య భాగములో ఆంధ్రకవి సార్వభౌముడు శ్రీనాథుడు పేర్కొని యున్నాడు.

ఇప్పటికిని ఈ రెండు భాషలకును లిపిసామ్యము స్థిరమై నిలిచియున్నది. కన్నడ సాహిత్యము రత్నత్రయముతో ప్రారంభ మైనది. ఆంధ్రులకు కవిత్రయము. ఇరువురికిని ఆదికావ్యము మహాభారతమే. ఉభయ భాషా ప్రసిద్ధ కవులు పాల్కురికి సోమన వంటి వారును గలరు.

ఆంధ్ర కర్ణాట సాహితిలో పోలిక రచనలు చాల కలవు. దానితోబాటు బింబప్రతిబింబములు అనదగిన కవులును గలరు. వేమనను తెలియని ఆంధ్రుడు లేడు. అట్లే సర్వజ్ఞునిపేరు వినని కర్ణాటకుడును ఉండడు.

ఈ ఇద్దరి వ్యక్తిత్వములును ఒక్క తీరులోనివి. మనో భావములును ఒక్కమాదిరివి. ఇరువురును ఒక్క కాలమురో నివ సించినట్లును, పరస్పరము కలసి మాటలాడుకొన్నట్లును కొందరు తలచుచున్నారు. కాని, ఇరువురి జీవిత చరిత్రలు కూడ కట్టు కథలతోను, అభూతకల్పనలతోను నిండియున్నవి.

ఇరువురును ఉద్రిక్త స్వభావులు. స్వచ్ఛంద ప్రవృత్తి గలవారు. సునిశిత కవితాధారగల అదృష్టవంతులు. వీరు సర్వ సంగపరిత్యాగము గావించి, ఇష్టము వచ్చినచోటులందు సంచరించి జంకుగొంకులు లేక, సంఘములోని అవినీతిని, దాంభిక చర్యలను, దురాచారములను సూటిగా, సున్నితముగా, కటువుగా, బోధించి, హెచ్చరించి, ఖండించి వేలకొలది పద్యములను ఆశువుగా వెదజల్లిన వారు. ఒకరికి ఇంకొకరు తీసిపోని ప్రజాహితకవులు.

సర్వజ్ఞుడు త్రిపది అను కన్నడ పద్యరచనలో అందెవేసిన చేయి. ఇది చాల చిన్న పద్యము. మూడు పాదములే ఉండును. ఆ మూడు పాదములును త్రివిక్రమ పాదములేమో! బ్రహ్మాండ మంతయు అందులో ఇమిడి పోవును. పద్యాంతమున "సర్వజ్ఞ" అను మకుటము ఉండును. సర్వజ్ఞునకు సర్వవిషయములు కర తలామలకములు. ఇతని సూక్ష్మదృష్టికి గోచరముకాని వస్తువు లేదు. చూచిన పలువిషయములను వివేచించి, విమర్శించి, నిగ్గు తేల్చి, జనులకు ప్రబోధించి తన నామమును సార్థకము గావించు కొన్నాడు.

సర్వజ్ఞనామధేయము ఇతనికి తల్లిదండ్రులు పెట్టినది కాదు. అసలు పేరేమో తెలియరాదు. బిరుదమును కాదు. "ఎవరో యితని ధూర్తపు మాటలు విని నీడేమి సర్వజ్ఞుడా? యని ఆక్షేపించిరి కాబోలు. ఏల గూడదు? అని ఆపేరే అతడుంచుకొని, పద్యములు రచించి ఆ [illegible]యుగనుస పారవేయ జొచ్చెనేమో?" అని రాళ్లపల్లి వారి అనుమానము

(వేమన; పుట 118)

తొలుత ఈ సర్వజ్ఞుని, పూజ్యులు శ్రీ మాన్ రాళ్ల పల్లి అనంతకృష్ణగారు, తమ వేమన (ఆంధ్ర విశ్వకళాపరిషత్తుచే ప్రకటితము: 1945) లో "వేమన వంటివారు" అను శీర్షిక క్రింద పరిచయము కావించియున్నారు. ఉల్లాసమునకై నేను తెనుగునకు అనువదించుకొన్న కొన్ని సర్వజ్ఞుని త్రిపదులను లఘు వివరణ పూర్వకముగా ఇందు పొందుపరచుచున్నాను. దీనివలన సర్వజ్ఞుని మనోభావములు, కవితారీతులు కొంత అవగతము కాగలవు.

వేమన ఆటవెలదిలో మూడు పాదములయందే చెప్ప దలచిన భావము నంతటిని నింపివేయును. విశ్వదాభిరామ వినుర

వేమ అను చతుర్థపాదము మకుటమునకై కేటాయింపబడినది. తెలుగులో "త్రిపది" ప్రచారములో లేదు. మూలమున పద్య భావము ముచ్చటగా మూడు పాదములలో ముగియుచుండగా, తెనుగున భావమును నాలుగవ పాదమునకు సాగదీయవలసి యుండును. అందుచేత పద్యమునకు జిగి బిగి కొంత సడలి పోవును. గత్యంతరము లేదు.

వేమన భావనలకు ఆటవెలది అంకితమైనట్లు సర్వజ్ఞుని భావములకును ఆటవెలదియే అనువైనది—అనుకారణముత, ఈ అనువాదము ఆటవెలదిలో గావింపబడినది.

సర్వజ్ఞత్వము

కవికిగల సర్వజ్ఞనామము నేతిబీరకాయ కాదు. మరి అహంకారముతో పెట్టుకొన్నదియును కాదు. సకల వి... ...ంగ తుడై, ఆత్మ ప్రత్యయముతో కవియే స్వీకరించిన పేరు.

గర్వమునను దాను సర్వజ్ఞుడాయెనే ?
యొక్కొకరులయందు నొక్కటొకటి
నేర్చి నేర్చి గొప్ప నేర్పరియై మించి
కొండయంత విద్య కొనియెగాదె !

ఆరాధనము

కవికి అహంకారము లేదు. సమస్త జగద్వ్యాపారము గూడ భగవంతుని ఆజ్ఞచే జరుగుచున్నవి. తన హృదయములోని భావనలకు, నోటిలోని పలుకులకు అతడే ప్రేరకుడు. అతడు పలికించిన పలుకులతో, అతడు పుట్టించిన భావనలతో అతనిని స్తుతించుటకంటె గొప్ప భాగ్యము లేదు.

నా హృదంతరమున నవ్య భావమ్ముల
వరలఁజేయువాడు పరమ శివుఁడు
అతనిపలుకుతోడ నాతని స్తుతియించు
కంటె వేఱు ఫలము గలదె భువిని ?

పరమశివుడే పరదైవము

పరాత్పరుడు ఒకడే. అతడే పరమశివుడు. కరుణా సముద్రుడు. భక్తజనమందారుడు తక్కిన ఇంద్రాదుల జోలి ఏల ?

ఇంద్రుఁ డమరగజము నెక్కి వచ్చిననేమి ?
విక్కి మియఁజాలఁ డొక్క వరము
బక్కయెద్దు నెక్కి పరమశివుండేమొ
కామితార్థ మొసఁగి కరుణఁగాచు.

భగవంతుడు సర్వాంతర్యామి

భగవంతునిగూర్చి వాదములు వలదు. అతడు సర్వ సకల చైతన్యప్రదాత. నిరాకారుడు నిరంజనుడు

ఇతఁడు దేవుడంచు, నితఁడు కాఁడతఁడంచు
వాదులాడుకొన్న ఫలము గలదె ?
యెల్లలోకములను చల్లఁగాఁ గాపాడు
దివ్య నెఱుగుమయ్య దేవుడనుచు

పుట్టియందుఁగాని, గట్టునందును గాని,
ముల్లునందు, దానిమొననుగాని.
తలఁచుచోటనుండు దైవమ్ము, మఱి తన
యందు లేకయున్నె యరసి చూడ ?

జ్ఞాని గురువు

ఎవడు తనలోని భగవంతుని దర్శించునో, అతడు జ్ఞాని. అతనిని ఆశ్రయించినచో క్షణములో దురితరాశి—తొలగి పోవును. మూర్ఖులకు గావించు సదుపదేశములు హానికరములు.

లోననుండు హరుని బూనికతో గురుఁ
డెఱిఁగి చెప్పకున్న నరయుటెట్లు ?
చెట్టునందు నగ్నిఁ, జెట్టు తా నెఱుగునా ?
ఘర్షణమునఁగాని కానఁబడదు.

అజ్ఞానికి ముక్తిలేదు

తనలోని దైవమును కాదని, కన్నతావుల సంచరించుట మూర్ఖపద్ధతి, ఆయాసకరములగు వ్యర్థప్రయత్నములు మాని, అంతర్యామిని అరయవలయును

ఆత్మయందు నుండు హరుని ధ్యానింపక
రాతివిగ్రహములఁ బ్రార్థనంబు
సేయుటయును, మ్రొక్కు సెల్లించుటయు గూడ
న్యాయమెట్టులగునొ? యరయుఁడయ్య !

భక్తియే మోక్షసాధనము

భక్తిలేక ముక్తిలేదు. చిత్తశుద్ధిలేక భక్తి రాదు, బాహ్యాడంబరములు నిష్ప్రయోజనములు చిత్తశుద్ధి, స్వచ్ఛభక్తి గలవానికి తన హృదయమే దివ్యధామము.

భక్తి లేక గుడిని బలుమారు చుట్టిన
ఫలము దానిచే రవంత రాదు,
గానుగెద్దు దినము గానుగఁ జుట్టదా?
దానఁ బుణ్యమేమి దానికబ్బు ?

దాంభికాచారము వ్యర్థము

దంభాచారములు ప్రయోజన శూన్యములు. నీచులకు మధుర తత్త్వరసాస్వాదనము లేదు. వారిది గొర్రెదాటు.

ముక్కు మూసికొనుచు మునిగిన మోక్షంబు
నిక్కమేని, నీట నిత్యముండు
కప్పకేల ముక్తి కఱవయ్యెఁ జెప్పుమా ?
మునుక మోక్షమునకు మూలమగునె ?

బ్రహ్మజ్ఞాని :

బ్రహ్మజ్ఞాని నిత్యతృప్తుడు. మౌని. అతనికి జంకు—గొంకులు లేవు. మానాభిమానములు లేవు. సంసార పంకము అంటని జ్ఞానకమలమాతడు.

బ్రహ్మయొక్క గుణము బాగుగా—దెలిసిన
వాఁడొకింత మాటలాడరాదు ;
మాటకందరాని మహిమ్మను వర్ణింప
హాస్యమునకుఁ బాత్రమగుట కాదె ?

జ్ఞానియైనవాఁడు సంసారమందుండి
యచ్చమైన తెలివి నమరియుండు;
మబ్బు తెరల వెన్క మార్తాండుఁడున్నను
పెద్దగాగ మింట వెలుఁగుగాదె ?

ఇంద్రియ నిగ్రహము

ఇంద్రియముల శక్తి దుర్వారమైనది చదువుచేత ఇంద్రియ విజయము చేకూరదు జీవితరంగములో కామక్రోధముల విలయతాండవము భయానకము. ఇంద్రియ కరీంద్రములకు నిగ్రహమే అంకుశము. నిష్కామ కర్మాచరణము భగవత్ప్రసాద సాధనము.

జీవహింస నెపుడుఁ జేయనివాడును,
ఆకలిని జయించినట్టివాడుఁ,
గామరహితుఁ డగుచుఁ గర్మమ్ము సేసెడు—
వాఁడు శివుని దయకుఁ బాత్రుఁడగును.

విధి—కర్మము

విధి బలీయము. కర్మము అవిలంఘ్యము. దేవతలు కూడ విధికి, కర్మమునకు బద్ధులు. కలిమి లేములు కావడి—కుండలు. ఇదిగో పండు. ఇదిగో హుళక్కి ఉన్న దానితో సుఖపడుట మేలు.

కూడిరాని గొంతికోర్కుల ఫలమేమి?
చింతవంత లంది చెడుటయేల?
భవుఁడు పెట్టినట్లు పడియుండుటే మేలు
విర్రవీగు టెల్ల వెర్రిగాదె!

ఉత్తమధర్మము

ఆత్మవత్సర్వ భూతాని—అన్నదే ఉత్తమ మానవధర్మము ఉత్తమగుణములే పూజాస్థానములు. ఉత్తమ పుత్రుడు, పవిత్ర విప్రుడు దేశమునకు దివ్యజ్యోతులు.

వరకులమ్మునందుఁ బ్రభవించినంతనే
కులము చేత నన్నె కూడిరాదు
తన్నుఁ బోలె నొరుల నెన్నెడు మానవు
నుత్తముండునాఁగ మెత్తురెల్ల.

జీవిత మకరందము

జీవితమున ఆనందసుధలు చిందించునది రాసిక్యము, అనుకూల దాంపత్యము. ఆ భాగ్యమును పడసినవారికి పరలోక స్వర్గముతో పనిలేదు.

వెచ్చనైన యిల్లు, వెచ్చానకు ధనమ్ము,
చిత్తమలరఁ జేయు చెలువమిన్న
వరలునట్టి గేస్తు భాగ్యంబుముందట
స్వర్గమేల ? కాల్చ వలదె దాని ?

జాతికంటె గుణము ఘనము

భగవంతుని దృష్టిలో జాతి ప్రశ్నయే లేదు. భక్తియే భగవంతుడు కోరుకానుక. ఎవడు భగవదనుగ్రహమునకు పాత్రుడో వాడే కులీనుడు.

జాతి హీనునింటి జ్యోతి తా హీనమా ?
జాతిఁ గూర్చి వింత చర్చలేల ?
పరమ పురుషు దయకుఁ బాత్రుఁడెవ్వఁడొ, వాఁడె
శ్రేష్ఠ కులజుఁడంచుఁ జెప్ప రాదె ?

వైదిక ప్రతీకలు - పౌరాణిక వ్యాఖ్యానం

మూలం : ఆచార్య బలదేవ్ ఉపాధ్యాయ్

అనువాదం : శ్రీ ఎమ్. లక్ష్మీనారాయణమూర్తి

వేద భాష నిశ్చయంగా ప్రతీకాత్మకమైనది. వేదాలలో రూపక సహాయంతో మూలసిద్ధాంతం ప్రతిపాదిత మవుతుంది. కాని ఆ రూపకాలను యథార్థతః తెలిసికోవడం ఒక విషమసమస్య. వాటి ఆవిష్కరణ సామగ్రి పురాణాలలో నిగూఢంగాఉంది. పురాణాల సహకారంతోనే ఆగభీరతత్వాన్ని ఉద్ఘాటించ గలుగుతాము. ఈ విషయంలో వేదపురాణాలమధ్య ఏవిధమైన విరోధమూ లేదు. వేదమంత్రాలలోని రూపకాలంకారాలలో అంతర్నివిష్టమైయున్న తత్వాన్నే పురాణాలు సరళమూ సుబోధమూ అయిన శైలిలో సామాన్య జనావళి ఉపదేశంకోసం రోచక శబ్దాలలో ప్రకటించినాయి. తాత్పర్యం రెండు గ్రంథాలూ అభిన్నాలు. ఈ కారణంగా వేదాలయెడ శ్రద్ధకలవ్యక్తి పురాణాల నశ్రద్ధ చెయ్యవచ్చు ననేది ఒక విషమమూ ఔచిత్యవిహీనమూ అయిన కథనమవుతుంది. వేదాలు సూక్ష్మరూపంలో చెప్పినవి, లేక సంకేతించినవాటినే పురాణాలు విస్తృతంగా చెప్పినాయి. ఈ విషయాన్ని విస్మరించడమంటే హిందూధర్మ మౌలిక తథ్యపరిచయంతో పరాఙ్ముఖుడవడమే. పురాణాలలోని వర్ణనలలో ఎక్కడ అసంబద్ధత, అసంగతి, వ్యవహార వైరుధ్యం తాలూకు దోషం కనిపించినా వాటి వాస్తవిక అవగతికి ఆలోచకులు వేదాలను సంప్రదించవలసి ఉంటుంది. వైదిక ప్రతీకలను యథార్థ రూపంలో అవగాహన చేసికోకనే పురాణాలపై తీవ్రమయిన ఆరోపణలు చేయబడినాయి. పురాణాలు వైదిక ప్రతీకలకే కొన్నిచోట్ల సుబోధశైలిలోనూ కొన్నిచోట్ల ఐతిహాసికపద్ధతిలోనూ తమతమ వ్యాఖ్యానాన్ని ప్రతిపాదించినాయి. ఈ ప్రతీకల అజ్ఞానమే లేక అల్పజ్ఞానమే పురాణాలపై దోషారోపణకు హేతువు. మంచి దృష్టాంతాలవల్ల ఈ ఆరోపపరిహారాల తథ్యం మనకుబోధపడుతుంది.

అహల్యాయై జారః

ఇంద్రుడు అహల్యకు లేక (మైత్రేయీ అహల్యకు జారుడు—(ఉపపతి)—ఈ కథనం అనేక వైదిక గ్రంథాలలో లభిస్తుంది. 1 పూర్వ దిశాధిపతియైన ఇంద్రుడు సహస్రాక్షుడవడంవల్ల అతిపశ్యుడు అంటే క్రాంతదర్శి అయినాడు—ఈ కథనం కూడా అథర్వవేదంలోని (11–2–17) ఒక మంత్రంలో ఉపలబ్ధమవుతుంది.2 అంటే ఇంద్రుడు అహల్యకు జారుడు, సహస్రనేత్ర సంపన్న వ్యక్తి—వైదిక గ్రంథాలవల్ల అభివ్యక్తమయ్యే తథ్యమిది. ఇప్పుడిక పురాణాలపై దృష్టిని ప్రసరించండి. దేవీభాగవతంలో (1–5–46) బ్రహ్మవైవర్తం కృష్ణజన్మ ఖండంలో (61–44–46) వాల్మీకి రామాయణ బాల కాండంలో (అ. 49) గౌతమ ఋషి అహల్యల కథ వర్ణింపబడింది. ఇది లోక విశ్రుతమైనదే. దేవరాజయిన ఇంద్రుడు గౌతమ ధర్మపత్నియైన అహల్యను ధర్షించాడు. ' అధర్షణానికి గౌతముడు కోపించి అహల్య పాషాణమవుతుందనీ, ఇంద్రుడు సహస్ర భగుడవుతాడనీ శపించాడు. ప్రార్థించినమీదట ఋషి ప్రసన్నుడై శ్రీరామచంద్రుని పాదస్పర్శతో అహల్యకు శాప విముక్తి కలిగేటట్లూ దేవేంద్రుడు సహస్రాక్షుడయ్యేటట్లూ ఆశీర్వాదించాడు. విచారింపదగిన ప్రశ్న ఏమంటే ఈ ఇంద్ర—అహల్యా వృత్తాంతానికి వాస్తవిక తాత్పర్యమేమిటి ? అని.

ఈ సమస్యకు కుమారిలుడు తన తంత్రవార్తికంలో యుక్తియుక్తంగా సమాధాన మిచ్చాడు. ఆయన ఈ కథానకాన్ని రూపక రహస్యంగా తలంచాడు. ఈ వేద గాథ సూర్యరాత్రుల దైనందిన వ్యవహారాన్ని ద్యోతన చేస్తుంది. చంద్రుడే గౌతముడు — (ఉత్తమాగావోరశ్మయోఽ యస్యసః గౌతమః). చంద్రుని భార్యయైన రాత్రే అహల్య; అహర్లీయతే యస్యాంసా; దినము దేనిలో లీనమవుతుందో అది అంటే దినాన్ని తనలో లీనంచేసికొనేది—అహల్యా శబ్దానికి ఇది నిరుక్తిగమ్యమైన అర్థం. సూర్యుడే పరమైశ్వర్య సంపన్నుడైన కారణంగా ఇంద్రుడు. ఇంద్ర సూర్యుల ఏకతను బోధించే వాక్యము వైదిక సాహిత్యంలో పలుచోట్ల ఉంది.

య ఏష సూర్యస్తపతి, ఏష ఉపేవ ఇన్ద్రః (శతపథం 4–5–9–4)

సూర్యుడు ఉదయించడంతోటే రాత్రి జీర్ణమయి నమసిపోతుంది. రాత్రిని జీర్ణం చేయడం కారణంగా సూర్యుడు జారుడని చెప్పబడతాడు.[4] (రాత్రిని జీర్ణం చేసేవాడు పరిసమాప్తినందించేవాడు) కనుకనే కుమారిలుని (7వ శతాబ్ది) అభిప్రాయంలో "చంద్రుని భార్య రాత్రి సూర్యుడుదయించగానే జీర్ణమై సమాప్తమైపోతుంది" లోకవ్యవహారంలో ప్రతిదినమూ సాక్షాత్కరించే ఈ ఘటనే పూర్వోక్త వేద గాథలో వర్ణింపబడింది. కుమారిలునికి వేయి సంవత్సరాలకు పూర్వుడైన యాస్కుడు కూడా ఈ అభిప్రాయాన్నే నిర్దేశించాడు. స్వామి దయానంద సరస్వతి కూడా ఈ వ్యాఖ్యానాన్ని ప్రామాణ్యంగా తలంచి సరిగా ఇలాంటి వ్యాఖ్యానమే చేశాడు.[5] ఏతావతా పురాణ వరిత అహల్యా చరిత్రలో ఏ విధమైన అశ్లీలత లేక దురాచరణ స్ఫుర్యాలేదు.

పురాణ రామాయణాలలో వైదిక గాథకు స్పష్టతయా ఉపబృంహణమే జరిగింది. అహల్యకథ ఐతిహాసిక జగత్తుకు కూడా సంబంధించింది. దీనిని యధార్థ ఇతిహాసంగా తలంచడం కూడా పౌరాణిక పద్ధతికి అనుచితం కాబోదు ఈ ధరణానికి కారణంకూడా[6] రామాయణంలో చెప్పబడింది. గౌతముడు ఉగ్రతపసి. అతని తపస్సు సమగ్రజన స్థానాన్ని విధ్వంసం చేయగలదు. గౌతముడంటే ఈ కారణంగా దేవతలు భయపడడం సహజం. వారు గౌతముని ఉగ్రతపస్సును భగ్నం చేయాలనుకొన్నారు. అయితే ఏ విధంగా అనేది ప్రశ్న. క్రోధోద్దీపనం జరుగకుండా ఆతని తపస్సు వ్యర్థంకాదు. ఈ కారణంగా ఇంద్రుడు దేవగణంయొక్క ఇచ్ఛా సమ్మతులతో ఈ కుకర్మయందు ప్రవర్తింపవలసివచ్చింది. ఈసంఘటనతో క్రుద్ధుడైనగౌతముడుశాపమిచ్చాడు.దాంతో ఆతని తపస్సు విఫలమయ్యింది. ఒకస్త్రీని ధరించడం (వస్తుతః అహల్య బ్రహ్మమానస సృష్టి, అలాగే ఇంద్రుడుకూడా సూక్ష్మదేహధారియైన దివ్యప్రాణి. అందువల్ల అమైథునీ సృష్టి విషయకమయిన అది ధరణమనిపించుకోదు) దేశంలోని లక్షలాది ప్రజలకు కళ్యాణకారియైతే దానిని ఏవిధంగానూ హేయమని తలంచరాదు.

పురాణోప బృంహణంపై దృష్టినుంచండి. ఇంద్రుణ్ని జారుడని చెప్పికూడా వేదము ఆతని దోషమార్జనకు ఏ వ్యవస్థా చేయలేదు. పురాణం మానవమర్యాదను రక్షించడానికిగాను దోషియైన వ్యక్తి పదవిని కూడా గుర్తించక ఉచిత దండన విధించడానికి వ్యవస్థ కల్పించింది. ఇంద్రుడు వృషణహీనుడు కావలసి వచ్చింది (లేక కల్పాంతరంలో సహస్ర భగసంపన్నుడు అవ్వలసి వచ్చింది) కాని ఇంద్రుడు లోకోపకారంకోసం చేసిన కృత్యానికి దేవతలు సంతోషించారు. మేషవృషణాన్ని (అండకోశాన్ని) తగిలించి ఆయనను సవృషణున్ని చేశారు. రూపక దృష్టితోచూస్తే ఈ ఘటన దైనందిన ఘటనకు ప్రతీకాత్మకమయినది. ఇతిహాసిక దృష్టితో విచారిస్తే ఇది రాష్ట్ర శ్రేయస్సుకోసం జరిగిన మహత్తర కృత్యం, ఏ దృష్టితో చూచినా ఈ పురాణస్థ ఘటనలో విప్రతిపత్తి కనిపించదు.

2. తారాపతిశ్చన్ద్రమాః

బృహస్పతి చంద్రులకు సంబంధించిన ఒక ఆఖ్యాయిక వేదాలలో కనిపిస్తుంది. ఈ కథా సూత్రాలను ఒకచోట చేర్చుకొంటే కథతాలూకు నికరరూపమిలా వ్యక్తమవుతుంది. చంద్రుడు తన గురుపత్నియైన తారను హఠాత్తుగా లాక్కుపోయాడు. వెయ్యిసార్లు అర్థించినాకూడా అతడు తారను తిరిగి ఇవ్వలేదు. అపుడు బ్రహ్మాండమైన దేవాసుర సంగ్రామం చెలరేగింది. బ్రహ్మమధ్యవర్తిత్వం వహించి తారను బృహస్పతికి పంపించాడు. ఈ మధ్యలో ఆమెకు బుధుడనే కుమారుడు కలిగాడు. బుధుడు చంద్రుని కుమారుడే అని ఆతనికే ఇచ్చారు.

కథ చాలా అశ్లీలమైనదే దీనిలో కొంచెంకూడా సందేహంలేదు. పురాణాలలో భాగవత (9–14–4–14) దేవీభాగవతాలలో ఈ కథ ఈ రూపంలోనే కనిపిస్తుంది. ఈ పౌరాణిక రూపం వైదికరూపానికి ఉప బృంహణ మాత్రమే.

అధర్వ వేదంలోనూ తాండవ బ్రాహ్మణంలోనూ ఈ కథా బీజము స్పష్టరూపంలో లభిస్తుంది.[7]

(క) సోముడు మొదట రాజు. అతడు బ్రాహ్మణ (బృహస్పతి) పత్నిని సిగ్గువిడిచి తిరిగి ఇచ్చాడు.

(ఖ) ఆమె పెద్ద కేశాలు కలది (వికేశి) తారక అని పిలిచేవారు.

(గ) సోముడు తీసుకుపోయిన తన భార్యను బృహస్పతి పొందేడు.

(ఘ) బుధుడు సోమాయనుడు అని పిలవబడతాడు. ఏమంటే అతడు సోముని పుత్రుడు.

విష్ణుపురాణం (చతుర్థాంశ, షష్ఠ అధ్యాయం 10–33) ఆలానే శ్రీమద్భాగవతంలో పై నిర్దిష్ట సూచన (9–14–4–14) ద్వారాను తెలిసే కథారూపం సంక్షేపంగా పై నియ్యబడింది. వేదంలో ఇయ్యబడ్డ నిర్దేశాలద్వారా కథానకంలోని ప్రతీకాతాత్పర్యం వివృతంకాదు. కాని భాగవత వ్యాఖ్యవల్ల దీని రహస్యం చక్కగా తెలుస్తుంది—

సురాసుర వినాశోభూత్ సమరస్తారకామయః 9–14–7.

ఈ సంఘటన జరిగిన తరవాత చెలరేగిన దేవాసుర యుద్ధం ఐతిహాసికమైనది కాదు, అది తారకల యుద్ధం "సమరః తారకామయః" ఇది ఈ విచిత్ర కథలోని రహస్యాన్ని ఉద్ఘాటించే సాధనం. భాగవత కథనానుసారం చంద్రుడు తార నీయడానికి అంగీకరించలేదు. అపుడు శుక్రాచార్యుడు దేవ గురువయిన బృహస్పతిపై కోపంతో చంద్రుణ్ణి అసురపక్షంలోకి లాగాడు. శివుడు, దేవేంద్రుడు దేవగణంతోబాటు బృహస్పతి పక్షంలో చేరారు. యుద్ధం చెలరేగింది. తార బృహస్పతికి, బుధుడు చంద్రుడికి లభించిన తర్వాత యుద్ధం పరిసమాప్తమయ్యింది.

ఈ కథను ఐతిహాసికంగా గ్రహించవలసిన సందర్భం భాగవతంలో వచ్చింది. చంద్రవంశరాజుల ఉత్పత్తిని చెబుతూ భాగవతం బ్రహ్మనుంచి అత్రి, అత్రినుంచి చంద్రుడు, చంద్రుడినుంచి పురూరవుడు పుట్టారని తెలిపింది. ఇదంతా ఐతిహాసక పక్షం. ఇది ఒక వైజ్ఞానిక సిద్ధాంతానికి సంకేతం. ఖగోళ విషయక సిద్ధాంతానికి ప్రతీకాత్మక వివరణం. దాని స్పష్టకథనం ఈవిధంగా ఉంటుంది :— బృహస్పతి, చంద్రుడు, తార, బుధుడు— ఈ నాలుగూ ఖగోళీయ నక్షత్రాలు. బృహస్పతి—గ్రహకక్ష్యలో భ్రమించే తార అని పేరుగల ఉపగ్రహం, చంద్రుడి ఆకర్షణతో తన మూల కక్ష్యనుంచి జారి చంద్రకక్ష్యలోకి వచ్చింది. ఈ ఆకర్షణ వికర్షణలవల్ల ఆకాశ మండలంలో పెద్దగడబిడ చెలరేగింది. సూర్యరూప ప్రజాపతి యొక్క (భాగవతంలో విశ్వకృత్) పున రాకర్షణమీదట తారతన మూల కక్ష్యలో బృహస్పతి సమీపానికి వచ్చింది. ఈ ఆకర్షణ వికర్షణలు కారణంగా చంద్రునిలోని ఒకభాగం, ఆకాశంలోని ఆగ్నేయబాష్పాల మిశ్రణంతో, చంద్రరూపాన్ని పొంది చంద్రుడినుంచి వేరై బుధగ్రహంగా జన్మించింది. బుధునిలో చంద్రుడి యొక్క అనేక అంశాలుండుటవల్ల అతడు చంద్రుని పుత్రుడుగా తలంపబడతాడు.

ఈ విధమయిన వ్యాఖ్య ఒక మర్మజ్ఞపురాణవేత్త తన గ్రంథంలో వ్రాశాడు.[8] కాని జ్యోతిష సిద్ధాంతాన్ననుసరించి ఈ అభిప్రాయం అసంగతంగా తోస్తుంది. చంద్రుడితో బృహస్పతి సౌరమండలంలో ఆ ఉభయుల ఆకర్షణ తాలూకు కల్పన అనుచితమనిపించేటంత ఎక్కువ దూరంలో ఉన్నారు. రెండో విషయమేమంటే బుధుడు గ్రహము, చంద్రుడు ఉపగ్రహం. బుధునికంటె చంద్రుడు చిన్నవాడు. ఈస్థితిలో చంద్రశరీరం నుంచి బుధుడు వెలువడటమనే పూర్వోక్త అశం కూడా సంగతం కాదు. అందుకోసం ఈ పౌరాణిక ఆఖ్యానానికి జ్యోతిశ్శాస్త్ర సిద్ధాంతరీత్యా సుసంగత వ్యాఖ్య ఈ క్రింద ఈయబడుతోంది.[9]

పౌరాణిక కథ :— చంద్రుడు గురుని శిష్యుడు. తార గురుపత్ని. చంద్రుడు తారను బలవంతంగా ధర్షించాడు. అందుచేత బృహస్పతికి కోపం వచ్చింది. చంద్రబృహస్పతులకు యుద్ధం జరిగింది. దేవతలు యుద్ధాన్ని మాన్పించారు. తర్వాత తారకి బుధుడు పుట్టాడు. దేవతలాతన్ని చంద్రసుతుడుగా తలంచి చంద్రుడికే ఇచ్చారు.

జ్యోతిష అర్థం :— పురాణాల్లో గురువును దేవతల గురువుగాను, చంద్రుణ్ణి ఒక దేవతగాను తలంచడం జరిగింది. కనుక చంద్రుడిని గురువుకి శిష్యునిగా భావించడ మొక పౌరాణిక కల్పన. ప్రాచీన కాలంలో వైదిక ఆర్యులు గ్రహవేధ ద్వారా

నున్న తారలనుబట్టి చేసేవారు. గ్రహాలకు స్వాభావికగతి ఉండటం కారణంగా అవి దూరస్థ తారలనుంచి కొంచె వెనుకకు తగ్గి. కొంచెం ముందుకు సాగిపోతుండేవి. ఈ కారణంగా వాటిని గ్రహాలుగా గ్రహించేవారు. బృహస్పతిని కూడా ఈ ప్రకారంగానే గ్రహించి ఉంటారు. బహుశా క్రాంతివృత్తానికి సమీపంలో ఉన్న ఒక ప్రకాశించే తారతోబాటు బృహస్పతిని చూడటంతోనే సంవత్సరమంతా ఒకరాశివైపు లేక 30° తూర్పువైపుకు నడుస్తాడని తెలిసి ఉంటుంది. కనుక అతడు పూర్వోక్త ప్రకాశవతియైన తారచెంత కనిపించడం, దానివెంట వెంట చాల దినాలవరకు కనిపించడం సంభవమవుతుంది. ప్రకాశవంతమైన రెండు తారాగ్రహాలు ఒక అంశ.కంటె ఎక్కువ దూరంలో ఉంటే వాటి యోగము సమాగమమని పిలువబడుతుంది. [10] బహుశః బృహస్పతి పైనచెప్పబడిన తారకు ఒక్క అంశకంటె కొంచెం ఎక్కువదూరంలోశరాంతరం[11] మీద ఉండి ఉంటాడు. ఈ సమాగమం కారణంగా తార బృహస్పతికి పత్ని అనే కల్పన జరిగి ఉంటుంది. అదే ఆ తారకు సంజ్ఞగా కూడా వచ్చి వుంటుంది. కాలాంతరంలో బృహస్పతి తన గతినుంచి కొంచెం దూరం తూర్పుకు పోయినప్పుడు పశ్చిమం నుంచి తూర్పుకు వస్తున్న సమయంలో చంద్రునితో తారకు యుతి జరగడంవల్ల ఆమె కప్పబడి ఉంటుంది. దానిని చంద్రుడు ఆమెను ధర్షించినట్లుగా తలంచడం జరిగి ఉంటుంది. తరవాత చంద్రుడు శీఘ్రగతికావడంవల్ల బృహస్పతివైపు అగ్రేసరుడై ఉంటాడు.[12] బృహస్పతి — యుతికి సమీపంలో కృష్ణద్వాదశి లేక త్రయోదశి అయినట్లయితే యుద్ధం తర్వాత చంద్రుడు క్షీణకాంతిగా కనిపించడం సహజం. గురుచంద్రుల శరాంతరం[13] ఒక అంశంకంటె తక్కువ అయితే ఆ స్థితికి అపసవ్య యుద్ధమని సంజ్ఞ. గనుకనే గురు చంద్రులకు యుద్ధకల్పన. తరువాత చంద్రుడికి అమాన్త మాసన్న మవడంవలన బుధుడు దగ్గరవడం కూడ సంభవిస్తుంది. సామాన్య పరిస్థితుల్లో బుధగ్రహంవైపుకు దృష్టి పోదు. ఏమంటే ఈతడు సూర్యుడికి అత్యాసన్నంగా ఉంటాడు.[14] ఈ విశేష పరిస్థితిలో వేధకర్తలైన ఆర్యులచూపు ఈ తారపైకి కూడా పోయింది. బుధునిగతి అత్యధికమవడంచేత అతని గ్రహత్వం శీఘ్రంగా తెలిసి ఉంటుంది. ఈ విధంగా ఆర్యులు ఒక క్రొత్త గ్రహాన్ని కనిపెట్టారు. చంద్రతారల యుతి వారి దృష్టినాకర్షించి పై అన్వేషణకి కారణమైంది. కనుక దీనిని

చంద్రునిద్వారా తార ధర్షింపబడటంవల్ల ఉత్పన్నమైన చంద్ర సుతత్వంగా కల్పించారు. ఇదే ఈ కథకు వ్యాఖ్యగా ప్రతీతమవుతుంది

3) విశ్వరూపం జఘానేంద్రః

శతపథబ్రాహ్మణంలోనూ, తాండవబ్రాహ్మణంలోనూ ఇంద్రవిశ్వరూపులకు సంబంధించిన ఒక విచిత్ర కథానక ముంది. విశ్వరూపుడు త్వష్టకుమారుడు. ఇతనికి మూడు శిరస్సులు, ఆరుకళ్ళు, మూడు ముఖాలు ఉండేవి. ఈ విచిత్రకారణంగా ఈతడు విశ్వరూపుడని పిలువబడేవాడు. ఈతడొక ముఖంతో సురాపానం, వేరొకముఖంతో సోమపానం చేసేవాడు. మూడవ దానితో అన్నం తినేవాడు. ఇంద్రుడు ఆతనితో విద్వేషంపెట్టు కొని ఆతని మూడు తలను ఖండించాడు. సోమపానం చేసిన తల కపింజలమయ్యింది. సురాపానం చేసిన తల కలవింక అయ్యింది. అన్నము తిన్న ముఖం తిత్తిరిపక్షి అయ్యింది. శత పథాన్ననుసరించి ఇదీ కథ. శ్రీ మద్భాగవతం లోని (6/6/44-45; 6/9/1-7) ఈ కథ వైదికకథకు అక్షరశః సంవదిస్తుంది.ఒకటి రెండు మాటలు మాత్రం పూర్తిగా కొత్తవి,

క) త్వష్ట బ్రాహ్మణదేవత, కాని ఇతడు దైత్యుల అనుజ అయిన రచనను వివాహ మాడాడు. ఈమె కుమారుడే విశ్వరూపుడు. ఈ కారణంగా ఈతన్ని త్వాష్టుడని పిలుస్తారు.

ఖ) ఏదో కారణంగా కోపించి బృహస్పతి తన యజ మానిని, దేవతలను విడిచిపెట్టాడు. ఆ సమయంలో వృత్రా సుర — సంహారానికి యజ్ఞం చేయవలసి వచ్చింది. అప్పుడు బృహస్పతి లేకపోవడంచేత దేవతలు ఈ త్రిశిరుడు, త్వాష్టుడు విప్రవర్యుడు, విశ్వరూపుణ్ణి, తమ శత్రువులైన రాక్షసులకు మేనల్లుడని తెలిసికూడా యజ్ఞానికి పురోహితుడుగా నియ మించారు.

గ) శతపథ బ్రాహ్మణంలో త్వాష్టుణ్ణి ఇంద్రుడు చంపిన కారణమేమో నిర్దిష్టం కాలేదు. అక్కడ కేవలం మామూలు మాటలున్నాయి — 'తమింద్రో దిద్వేష' (వానిని ఇంద్రుడు ద్వేషించాడు) ఫలితంగా విశ్వరూపుణ్ణి చంప డానికి ఏ కారణమూ లేకపోవడంవల్ల వైదికగాథలో ఇంద్రుని ద్వారా విశ్వరూప వధ మిక్కిలి అనుచితము, అయుక్తికము, యాదృచ్ఛికము అయిన కృత్యమయింది. కాని పురాణం ఈ జఘన్యకార్యానికి యుక్తి యుక్తమైన హేతువును చెప్పి, నిజంగా వేదార్థానికి ఉపబృంహకమయింది. ఆహేతువిది[15]— "మెమ్మదిగా ఎవరూ చూడకుండగా రాక్షసులకు యజ్ఞభాగాన్ని అందించడం" విశ్వరూపుని హృదయంలో మాతృప్రేమ పెల్లు బుక నారంభించింది ఆ కారణంగా తన పౌరోహిత్యానికి విరు ద్ధమైనా కూడా దేవతలకు ప్రతిపక్షులైన (ఎవరి పరాజయం కోసం యాగం చేయబడుతోందో) అసురులకు యజ్ఞభాగా న్నియ్యడంలో వెనుదీయలేదు. ఇంద్రుడు అది చూచి ఆతని శిరస్సులను ఖండించాడు. దాంతో ఆతనికి బ్రహ్మహత్య చుట్టుకొంది.

ఘ) బ్రహ్మహత్యా పాపాన్ని ఇంద్రుడు ప్రాంజలియై స్వీకరించాడు. దీనికి పూర్తి ప్రాయశ్చిత్తం చేసికొన్నాడు. ఈ విధంగా దేవరాజ్య హితంకోసం దేవేంద్రుడు అపరాధియైన పురోహితుణ్ణి వధించాడు. దానికి తగిన ప్రాయశ్చిత్తం చేసి కొని ఆ బ్రహ్మ హత్యాదోషంనుంచి విముక్తుడయ్యాడు. అతడు తన రాజ్యమదానికి వశీభూతుడు కాలేదు.

ఈ విధంగా పౌరాణికకథ మూలకథలోలేని లోపాన్ని పరిహరించి దానిలో అవసరవిశేషాన్ని అపరాధవిశేషాన్ని కల్పించి బ్రహ్మ హత్యకు యుక్తియుక్తమైన హేతువును నిర్దేశించడం వాస్తవంగా మూలానికి పుష్టిని కలిగించే ఉపబృంహణమే అయ్యింది.

4) బ్రహ్మాస్వదుహితుః పతిః

బ్రహ్మ తన పుత్రికకు (వాక్ లేక సరస్వతి) పతి. ఆమె నాతడు ధర్షించాడు. ఇది ఒక వైదిక ప్రతీక. వేదంలో ఏవిధంగా ఇది చెప్పబడిందో పురాణాలలో కూడా అదే రూపంలో ఏ మార్పులు చేర్పులు లేక వర్ణింపబడింది. పురాణాలపై ఈ వర్ణన విష యంలో తీవ్ర దోషారోపణ చేయబడింది. ఏమంటే ఇది ఒక సామాజిక విరోధమైన అధార్మిక తథ్యాలను వర్ణించి, ధర్మవిరుద్ధ మైన ఆచరణను ప్రోత్సహిస్తుందని, ఈ కథకు వెనుక నున్న ప్రతీకను యథార్థ రూపంలో తెలిసికోవలసిన ఆవశ్యకత ఉంది.

పురాణము కొన్ని అంశాలను పూరించి వైదిక గాథను ఉచితంగా పరిబృంహణం చేసింది. వైదికగాథా స్వరూపం సంగ్ర హంగా ఈ విధంగా ఉంది.[16] ప్రజాపతి తన దుహితను ధర్షిం చాడు (ఋగ్వేదం)[1] ప్రజాపతి తన దుహితను అనుగమించాడు (ఐతరేయం)[2] దీనిని శతపథ బ్రాహ్మణం సమర్థించింది.[3] అధర్వవేదం ఒక అడుగు ముందుకు వేసింది—తండ్రి పుత్రిక యందు గర్భాన్ని ఉంచాడు.[4] దీనికి తాండవ బ్రాహ్మణం పుష్టి

నిచ్చింది—ప్రజాపతి ఆరంభంలో ఒంటరిగా ఉన్నాడు. వాక్కు రెండవదయ్యింది. వాళ్ళిద్దరూ మిథునమయినారు, అప్పుడు వాక్కు గర్భవతి అయ్యింది[5] ఈ ఉద్ధరణలవల్ల కథానకంతాలూకు సంక్షిప్త రూపం స్పష్టపడుతుంది.

శ్రీమద్భాగవతంలో బ్రహ్మ సరస్వతుల ఈ ప్రసంగం సరిగా ఈ లానే వర్ణింపబడింది. "కామ వివశుడైన స్వయం—భువు కామనాహీనయైన వాక్ అని పేరు కల తన పుత్రికను కామించాడు"—అని మనం వింటాం. ఈలా అధర్మ కార్యమందు స్థిరబుద్ధియైన తండ్రిని చూచి మరీచ్యాది కుమారులు ఆతనితో అన్నారు. "ఇంతవరకూ ఎవరూ ఇలాంటి జఘన్య—కార్యం చేయలేదు. ముందు కూడా ఇలాంటి పనిని చేయరు. కనుక మీరు కూడా ఇటువంటి అకృత్యమందు ఆసక్తి కలిగి ఉండటం మిక్కిలి అనుచితము అధార్మికమున్నూ." పుత్రులు ఇలా అనడం చూచి ప్రజాపతి సిగ్గుపడి తన శరీరాన్ని త్యజించాడు.

రెండు కథలూ సరిగా ఒకే విధంగా ఉన్నాయి. అయితే భాగవతం మరో విషయాన్ని జోడించింది. ఏదంటే అధర్మం పట్ల తన అభిరుచిని చూచి, తన కొడుకులే తనను అవమానించిన మీదటా ప్రజాపతి తన ఆ శరీరాన్ని త్యజించాడు. ఇది తగిన ప్రాయశ్చిత్తం. ఇది మూలగాథలో నిరేశింపబడలేదు.

ఈ కథలో గంభీరమైన ఆధ్యాత్మిక, వైజ్ఞానిక తథ్యాలున్నాయి. అవి తెలియకనే కథలో అశ్లీల, అనాచార విషయకమైన అభివ్యక్తి కలుగుతుంది. వాటిని ఈ విధంగా చెప్పవచ్చు.

5) <u>వైజ్ఞానిక తథ్యం</u>

ప్రజాపాలనం చేత సూర్యుడే ప్రజాపతి. ప్రతి దినమూ ఉదయాద్రిపై ఉషస్సు ఆగమనం ముందు, సూర్యాగమనం తరువాత జరగడం మనం చూచే దృశ్యమే. సూర్యుడు వచ్చినపుడు ఉషసు జన్మిస్తుంది. ఈ కారణంగా ఆమె సూర్యదుహితగా చెప్పబడింది ఉషలో సూర్యుడు తన అరుణ కిరణాల నుంచి దివస రూపియైన పుత్రుణి ఉత్పన్నం చేశాడు. అరుణ కిరణ రూప బీజ నిక్షేపం చేతనే ఇదరిలోనూ స్త్రీ పురుష ఉపచారం చేయబడింది. ఈ విధమైన ఉషా—సూర్యుల దైనందిన వ్యవహారమే ఇక్కడ బ్రహ్మదుహితల రూపంలో చర్చింపబడింది. ఉషస్సును

సూర్యుడనుగమించడం పుత్రికను తండ్రి అనుగమించడంగా తలం చారు. అరుణ కిరణ వికిరణం ద్వారా దినం యొక్క ఉత్పత్తి వీర్యాధానానికి వ్యాఖ్య అయింది. ఈ వైజ్ఞానిక తథ్యమే ఈ కథ ద్వారా అభివ్యక్తీకరింపబడింది. పరోక్ష ప్రియాహి దేవా ప్రత్యక్షద్విషః'' అనే పద్ధతి ననుసరించి [17] ప్రత్యక్షంగా కనిపించే ఘటనకు ఇది పరోక్ష సంకేతమవుతుంది.

శ్రీమద్భాగవతం ఈ కథనక వర్ణనలో ఈ సంకేతాన్ని సంక్షేపంగా వ్యక్తీకరించింది. ''వాచం దుహితరం తన్వీం'' అనే దానిలో తన్వీ శబ్దప్రయోగం వ్యంజన ద్వారా ఆ దుహిత స్థూల శరీరం కలది కాక సూక్ష్మ శరీరిణి అనిద్యోతన చేస్తుంది. అలానే అతన్ని నిషేధించిన మానస పుత్రులలో 'మరీచి' ఋషి ప్రస్తావన కూడ ప్రకారాంతరంలో కిరణానికి కూడ బోధక మవుతుంది. ఇట్లా భాగవతం ఉషాసూర్యపరకమైన అభిప్రాయాన్ని సంకేతితం చేస్తుంది. ఆధ్యాత్మిక రహస్యం.

వేదాలలో మనస్సుకి సంజ్ఞ ప్రజాపతి, అలానే వాక్కుకి సంజ్ఞ సరస్వతి. ''యత్ ప్రజాపతి స్తన్మనః'' (జైమిని ఉప. 1–33–2) అట్లానే ''వాగ్వై సరస్వతీ'' (కౌషీతకి 5–1) మనస్సు వాక్కుకు పూర్వవర్తి అవుతుంది. మనుష్యుడు మొదట సంకల్పించిన దానినే వాక్కు ద్వారా ప్రకటిస్తాడు. మనస్సు మొదటిది, వాక్ స్థితి దాని తరువాతది. ఈ పారస్పరిక సంబంధం కారణంగా మనస్సు పితగాను (ప్రజాపతి) వాక్కు దుహితగాను చెప్పబడినారు. మనోరూపియైన తండ్రి వాగ్రూపియైన తన దుహితయందు ప్రేరణారూప వీర్యాధానం చేస్తారు. అపుడు శబ్దరూపియైన పుత్రుడు జన్మించాడు. ఈ అర్థ సూచన బ్రహ్మవైవర్తంలోని కొన్ని శ్లోకాలలో లభిస్తుంది.

6) ఆధిదైవికతథ్యం

ఆధిదైవికంగా కూడా దీనిని వ్యాఖ్యానించవచ్చు. వైదిక మంత్రాలతో సమంగా పౌరాణిక కథలకు కూడా ఈ మూడు స్థాయిలను దృష్టిలో పెట్టుకొని వ్యాఖ్యానించడానికి వీలవుతుంది. వైదిక మంత్రాలకు ఈ త్రివిధ వ్యాఖ్యామార్గాన్ని యాస్కుడు తన నిరుక్తంలో పూర్వమే అనుసరించియున్నాడు. పౌరాణిక కథానక వ్యాఖ్యా సందర్భంలో కూడా ఈ ప్రక్రియను ప్రయోగించవచ్చు. ఆధిదైవికరూపంలో కూడా ఈ కథానక మొక సారగర్భితమైన సత్యాన్ని అభివ్యక్తం చేస్తుంది, ఆతథ్యం వైదిక గ్రంథాలలోను, స్మృతి గ్రంథాలలోను అక్కడక్కడ నిర్దేశింపబడింది. సృష్టిసమయంలో బ్రహ్మ తన శరీరాన్ని రెండు భాగాలుగా విభజించాడు. అతని వామభాగం స్త్రీ అయింది. దక్షిణభాగం పురుషుడయినాడు [18] ఆ రెండింటి సంయోగంవల్ల ఈ సమస్త సృష్టి — మనుష్య పశుగో అశ్వాదు లుత్పన్నమైనాయి. శతపథబ్రాహ్మణంలోని ఒక అంశంలో దాని వివరణం చాలా విస్తారంగా ఇయ్యబడింది. మానవ పశుసృష్టి ప్రక్రియ చాలా సుందరంగా చూపబడింది. ఫలితంగా బ్రహ్మకు సంబంధించిన ఈ కథ ఈ ఆదిమసృష్టి రహస్యాన్ని ప్రతిపాదిస్తుంది. [19]

వ్యావహారిక దృష్టితో పర్యాలోచన చేసినా దీనిలో అధర్మం కనిపించదు అధర్మాన్ని చేసిన వ్యక్తి శిక్షింపబడక పోతేనూ, ప్రాయశ్చిత్తం చేసికోకుండా జీవిస్తేనూ ఈ అధార్మికకృత్యంయొక్క నింద ఉచితమవుతుంది. లోకస్రష్ట అయినప్పటికీ బ్రహ్మ శిక్ష ననుభవింపవలసి వచ్చింది. అదికూడా చాలా పెద్దదండనే. తన ప్రియమైన ప్రాణాలను ధర్మవేదిపై సమర్పించడం.

> స ఇత్థం గృణతః పుత్రాన్
> పురోదృష్ట్వా ప్రజాపతీన్
> ప్రజాపతి పతిస్తన్వం తత్యాజ
> వ్రీడితస్తదా — భాగ 2–12–33

ఇట్లా ఎన్ని దృక్కోణాలనుంచి ఆలోచించినా, బహుధా చర్చితము, అనే కథానిందితము అయిన ఈ కథలోని మూల రహస్యము మిక్కిలి గంభీరము గౌరవవిశిష్టమున్ను, ఈ రహస్య పీఠిపై ఆధారపడిన ఈ కథ సారగర్భితము, మహిమాన్వితమూ అయినది. ఈ విధంగా పురాణాలు వైదికప్రతీకలకు సుబోధము సహేతుకము అయిన వ్యాఖ్యానాన్ని ప్రతిపాదిస్తూ వాటిని జనసాధారణానికి గ్రాహ్యము ఆదరణీయములుగా రూపొందించినారు. ఇక్కడ కూడా వేదార్థ సముపబృంహణం నానా దృష్టులలో చరితార్థమవుతోంది

> ఇతిహాస పురాణాభ్యాం
> వేదం సముపబృంహయేత్ ।

అధోజ్ఞాపికలు

1. శతపథం 3–3–4–18,తైత్తిరీ 1–12–4, షడ్వింశ1–1, లాట్యాయన శ్రౌతసూత్ర 1–3–1.
2. సహస్రాక్షమతిపశ్యం పురస్తాత్— అథర్వ 11–2–17.

3. సుషుమ్నః సూర్యరశ్మిశ్చన్ద్ర మాగంధర్వ ఇత్యపి నిగమోభవతి. సోపి గౌరు చ్యతే.... సర్వే ఽపి రశ్మయోగావం, ఉచ్యన్తే నిరుక్తం 2—2—2.

4. అదిత్యో ఽ త్ర జార ఉచ్యతే "రాత్రేర్జరయితా, నిరుక్తం 3—3—4

5. ఋగ్వేదాది భాష్యభూమికా పు 300

6. కుర్వతాతపసో విఘ్నం గౌతమస్య మహాత్మనః
క్రోధముత్పాద్య హిమయా సురకార్య మిదంకృతం
అఫలో ఽ స్మికృతస్తేన క్రోధాత్సాచ నిరాకృతః
శాపమోక్షేణ మహదాతపో స్యాపహృతంమయా
తన్మాం సురవరాం ః, సర్వేఋషి సంఘాః సచారణాః
సురకార్యకరం యూయం సఫలం కర్తుమర్హథ
వాల్మీకం బాలకాండః 49.

7. క) సోమోరాజా ప్రథమో బ్రహ్మజాయాం పునః ప్రాయచ్ఛదహృణీయ
ఖ) యామాహుః తారకైషా వికేశీతి అథర్వ 5—17—4—వాసః అధ్వర్య 5—7—12
గ) తేనజాయామన్వవిన్దత్ బృహస్పతిః సోమేననీతామ్ అథర్వ5.17.5
ఘ) సోమాయానో (సోపుప్రతో)బుధః తాండవ్యబా 24—17—6

8. పండిత మాధవాచార్యశాస్త్రీః పురాణ దిగ్దర్శన్ కృష్ణ 295—297.

9. ఈ వ్యాఖ్యానం విషయంలో వారణాసీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో జ్యోతిష శాస్త్రాచార్యులైన డా. మురారీలాల్‌శర్మగారికి కృతజ్ఞుడను.

10. సమాగమోంశాదధికే భవతశ్చేత్ బలాన్వితౌ సూ.సి.గ్ర.ప్ర అధి 19.

11. శర—క్రాంతివృత్తం (పృథివికి సూర్యుడి కక్ష్య నుండి దక్షిణ లేక ఉత్తర అంతరం

12. చంద్రగతి సుమారు ప్రతిదినం 13° ఉంటుంది.

13. అంశదూనేఽవ సవ్యాఖ్యం యుద్ధమేకోత్ర చేదణుః సూ. సి. గ్రహ అధి—19.

14. బుధుడు సూర్యునికి అత్యంత సమీపంలో ఉంటాడు. బుధుడికిసూర్యు నుండి అధిక తమ దూరం 28°.

15. సవిపహి దశా భాగం, పరోక్ష మసురాన్ ప్రతి యుజమానోఽ వహద్ భాగం మాత్స్ప స్పేనవశానుగః భాగవతం 6—9—3

16. (1) ప్రజాపతిః స్వాం దుహితరమధిష్కన్(ఋగ్వేదం10—61—7
(2) ప్రజాపతి ర్వై స్వాం దుహితర మభ్యధ్యాయత్ (ఐతరేయం 3—33)
(3) ప్రజాపతిః స్వాం దుహితర మభిదధ్యౌ (శత 1—7—4—1)
(4) పితా దుహితుర్గర్భ మాధాత్ (అథర్వ, 9—10—12)
(5) ప్రజాపతి ర్వా ఇదమాసీత్, తస్య వాక్ ద్వితీయాసీత్
తాం మిథునం సమభవత్ సాగర్భ మాధత్త (తాండ్య 20—14—2)

17. ఈ వ్యాఖ్యాబీజం బ్రాహ్మణ గ్రంథాలలో ఉంది. ప్రజాపతి రుషసమద్యైత్ స్వాం దుహితరం (తాండ్య బ్రాహ్మణం 8—2—10) దానిని తంత్ర వార్తికంలో కుమారిలుడు పల్లవింపచేశారు. ప్రజా పతి స్తావత్ప్రజా పాలనాధి కారాత్ ఆదిత్య ఏవో చ్యతే సచ అరుణోదయ వేలాయా ముష సముద్యన్నభ్యైత్ సాచ తదా గమనాదేవోపజాయతే ఇతి తద్—దుహితృత్వేన వ్యప దిశ్యతే. తస్యాం చారుణ కిరణాఖ్య బీజని క్షేపాత్ స్త్రీ పురుష యోగ వదు పచారః తంత్ర వార్తికం 1—3—7

18. మనుస్మృతిలో కూడా ఈ రహస్యం ఉద్ఘాటితమై ఉంది.
ద్విధాకృత్వాఽత్మనో దేహ మర్ధేన పురుషోఽభవత్
అర్ధేననారీ తస్యాం తు విరాజ మసృజత్ ప్రభు : మను 1—32)

19. ఈ రహస్యాల అజ్ఞానంవల్లనే పురాణాలపై అనేక దారుణ దోషారోపణ జరుగుతోంది. వాటి సమాధానానికి పండిత మాధవాచార్య శాస్త్రి వ్రాసిన పురాణ దిగ్దర్శన్ (410—720 పుట) చూడ కోరిక

కాళిదాసు - గాథాసప్తశతి

శ్రీ తిరుమల రామచంద్ర

ప్రతి కవీ తన పూర్వ కవి రచనలను చదువకపోడు. సామాన్య కవి పూర్వ కవుల రచనలను యధాతథంగానే వాడుకుంటాడు; క్షేమేంద్ర రాజశేఖరు లన్నట్టు పద పాద అర్ధ సంపూర్ణ శ్లోక చోరుడని అనిపించుకొంటాడు. కాని, నిపుణుడైన కవి తాను గ్రహించిన దానిపై మెరుగులు పెడుతాడు; ఇతరులనుంచి తీసుకొన్నది గాదు; స్వంతది అనే భ్రాంతి కలిగిస్తాడు. కాళిదాసు కూడ తన పూర్వులయిన వ్యాస వాల్మీకి భాసాశ్వఘోషులనుంచే కాక జానపద కవులనుంచికూడా ఎంతో తీసుకొన్నవాడే. కాళిదాసు కుమారసంభవంలో పార్వతీదేవిని వర్ణిస్తూ

> "మధ్యేన సా వేది విలగ్న మధ్యా
> వళిత్రయం చారు బభార బాలా" (1–39)

అని నడుమును యజ్ఞవేదితో పోల్చాడు. "ఎంత సొగసుగా ఉంది పోలిక!" అన్నారు సహృదయులు. "వైదిక సంప్రదాయాన్ని కాపాడాడు కవి" అని మెచ్చుకొన్నారు వైదికులు యజ్ఞవేది స్వరూపం తెలిసినవారు గనుక. "స్కందునివంటి వాని అవతరణకు శివుడు హోమం చేయాలి కదా. పార్వతీదేవి నడుము యజ్ఞ వేది కాక మరేమవుతుంది?" అని అతి సంప్రదాయవాదులు విశేషాలు లాగారు. ఇది వ్యాసుడు భారతంలో ప్రకరణాంతరంలో చెప్పిన పోలిక అని తెలిసినతర్వాత, వ్యాసునిపై గౌరవం హెచ్చింది. ఇలాగే ఎన్నో! తన కాలానికి ముందు కమనీయ కవితా కోశంగా, తన సమకాలంలోను ప్రవరసేనుని వంటి బహుకార్య వ్యావృతుడైన వాకాట రాజు సేతుబంధం వంటి ప్రాకృత కావ్యాన్ని రచించడానికి కారణంగా ఉన్న గాథా సప్తశతిని కాళిదాసు చూడకపోవడం సంభవించి వుండదు. కనుకనేదానిలోని భావాలు, భావాల ఛాయాంతరాలు, పదబంధాలు కాళిదాసు రచనలలో కానవస్తాయి. నేను కాళిదాసు గాథాసప్తశతి నుంచి గ్రహించి వుండవచ్చుననే సంభావనతో యాదృచ్ఛికంగా తెలుసుకొన్న కొన్ని అంశాలను మాత్రమే ఇక్కడ నివేదిస్తాను. కాళిదాసు, ఆతని రచనల ఆంతర సాక్ష్యాన్నిబట్టి స్కందగుప్త కుమారగుప్త ప్రవరసేనుల సమకాలికుడనే నమ్మకం మీదే నా యీ వాదం ఆధారపడి వుంది.

1) ఆశాబంధ:

కాళిదాసు ఆశాబంధ: అనే అపూర్వమయిన పదబంధం వాడి సహృదయ లోకాన్ని పులకితులను చేశాడు.

> "తాండావశ్యం దివసగణనా తత్పరా మేకపత్నీం
> అవ్యాపన్నా మవిహిత గతిః ద్రక్షసి భ్రాతృజాయామ్
> ఆశాబంధః కుసుమసదృశం ప్రాయశోహ్యంగనానాం
> సద్యఃపాతిప్రణయి హృదయం విప్రయోగేరుణద్ధి."
> (మే.పూ. 10)

(వో మేఘుడా, నీ వదిన నా విరహపు దినాలు ఇంకా ఎన్ని మిగిలి ఉన్నాయా అని లెక్కపెడుతూ, నాకోసం ఇంకా జీవించి వుంటుంది. నీవు నిరాఘాటంగా వెళ్ళి ఆమెను చూస్తావు. మహిళల మనస్సు ప్రేమపూర్ణ, కుసుమ సుకుమారమైంది. అలాటిది వియోగంలో రాలిపడిపోకుండా ఆశాబంధం— ఆశ అనే పట్టు — అడ్డగిస్తుందనుకుంటాను) అని యక్షుడు మేఘునితో అంటాడు, ఈ ఆశాబంధాన్ని కాళిదాసు విక్రమోర్వశీయంలోను ప్రయోగించాడు.

"రాజా :— (చంద్రమసమవలోక్య విదూషకం ప్రతి) వయస్యం పరం ముహూర్తా దాగమనం దేవ్యాః, తద్వివిక్తం కథయిష్యామి స్వామవస్థామ్.

విదూషకః—"ననుదృశ్యత ఏవసా కింతు తాదృశ మను రాగం ప్రేక్ష్య, శక్యంఖలు ఆశాబంధేన ఆత్మానంధారయితుమ్."

[రాజు :—(చంద్రుణ్ని చూచి విదూషకునితో) వయస్య దేవి రావడానికి గడియ ఉంది. కనుక ఏకాంతంగా నేను నా మానసికావస్థను తెలుపుతాను.

విదూషకుడు :— ఆ అవస్థ కనిపిస్తూనే ఉందే. కాని ఊర్వశి నీపైన చూపిన అలాటి అనురాగాన్నిబట్టి ఆశాబంధంతో

నిన్ను నీవు నిలబెట్టుకోవచ్చు.]

ఆశాబంధం శాకుంతలంలోను ఉంది. అనసూయ చతుర్థాంకంలో శకుంతల దుష్యంతునివద్దకు వెళ్ళుతున్నప్పుడు "ఆశాబంధో సహోవేది" (5–16) అంటుంది.

ఈ ఆశాబంధం గాథాసప్తశతిలోనిది.

"విరహాణలో సహిజ్జఇ
ఆశాబందేణ వల్లహజణస్స,
ఏకగ్గామ పవాసో
మాఏ మరణం విసేసేహి" 1–43

[విరహానలః సహిష్యతే
ఆశాబంధేన వల్లభ జనస్య,
ఏకగ్రామ ప్రవాసః
మాతః మరణం విశేషయతి.]

అమ్మా, ప్రియుడు మరొక చోటికి ప్రవాసం వెళ్ళితే, ఆ నిప్పులవంటి ప్రియ వ్యక్తి విరహాన్ని ఆశాబంధంతో — మళ్ళీ తిరిగి వస్తాడుగదా అనే ఆశతో సహించవచ్చు. కాని, ఒకే ఊళ్ళో విడిపోయి వుండడ మనేది చావును మించినట్టిది సుమా!— అంటుంది ఒక ప్రేమైక జీవిని.

ఈ ఆశాబంధాన్ని భాసుడూ, ప్రవరసేనుడూ వాడినారు. సీతాన్వేషణకు వెళ్ళిన హనుమంతుడు ఎంతకాలమయినా తిరిగి రాలేదు. హనుమంతుడే రాముని ఆశాబంధం. మొదలే చిక్కిపోయినది రాముని శరీరం. హనుమంతుని రాక ఆలస్యమయ్యేవరకు అతని ముఖం — కన్నీటితో నిండిన ముఖం, రోదించినట్టు కనిపించింది.

"క్షీయతే క్షీణాపి తనుః
అస్మిత బాష్పం పునఃప్రరుదితమివ ముఖం,
రామస్య అదృశ్య మానే

ఆశాబంధే ఇవ చార నిర్గతే హనూమతి" 1–35

అని ప్రవరసేనుడు సేతుబంధంలో వర్ణించాడు.

2) భుజగవలయం :—

మన దేశంలో శైవ మతం అతి ప్రాచీన మయింది. కనుక శైవ కథలు గాని, శివ లీలలు గాని ఒకరు మరొకరినుంచి తీసుకొన్నారనడం అంత ఉచితం కాకపోయినా, ఒక నిర్దిష్ట క్రియా విశేషమో, పదబంధమో ముందువాడు చెప్పినది, తర్వాతివాని రచనలలో కనిపించినప్పుడు మన దృష్టి కొంచెం ఆగుతుంది. కాళిదాసు మేఘ సందేశంలో

"హిత్వాతస్మిన్ భుజగవలయం శంభునాదత్తహస్తా
క్రీడా శైలేయది చవిచరేత్ పాదచారేణ గౌరీ,
భంగీ భక్త్యా విరచిత వపుః స్తంభితాం తర్జలౌఘః
సోపానత్వం కురుమణి తటారోహదాయాగ్రయాయీ"

(మే. పు.–64)

యక్షుడు మేఘునికి చెబుతున్నాడు: వో మేఘుడా, కైలాస పర్వతం మీద శివ పార్వతులు క్రీడా పర్వతంమీద విహరించదలచినప్పుడు, పార్వతి భయపడుతుందని తన చేతి భుజగ వలయాన్ని తీసి కిందపెట్టి గౌరి చేయిని పట్టుకొని క్రీడా పర్వతాన్ని అధిరోహించడానికి యత్నించదలిస్తే, అప్పుడు నీవు, ముందుగానే వెళ్ళి, నీలోని నీటినంతా లోపలే పెట్టుకొని, గౌరీదేవి మణితటాలు ఎక్కడానికి సులువుగా నిన్ను మెట్ల వరుసలాగ వంపులు వంపులుగా మార్చుకో"

కాళిదాసు భుజగవలయం గాథాసప్తశతిలోని వాసుకి కంకణం తప్ప మరేమీ కాదు. పాణిగ్రహణం సమయంలోనే శివుని చేతి వాసుకి కంకణం చూచి పార్వతి భయపడుతూంది. అది గ్రహించి శివుడు వాసుకి వలయాన్ని దూరంగా విసిరిపారేశాడు. దానితో పార్వతి చెలికత్తెలు తెలుసుకొన్నారట. ఆమె సౌభాగ్యం, పతి ప్రేమ ఎలాటిదని. పెళ్ళినాడే ఇలా ఇలా అయితే, తర్వాత చెప్పనక్కరలేదు.

"పాణిగ్గహణే వ్విఅ
పవ్వఈఏ ణాఅం సహీహిసోహగ్గం
పసువఇణా వాసుఆ—
కంకణమ్మి వో సార్వి దూరం" 1–68
[పాణిగ్రహణ ఏవ పార్వత్యాః
జ్ఞాతం సఖీ భిస్సౌభాగ్యం,
పశుపతి నా వాసుకి
కంకణే అపసారితే దూరవ్]

ఈ వాసుకి కంకణం పాణిగ్రహణం వంటి శృంగార సన్నివేశంలో ప్రయుక్త మయింది గనుక కాళిదాసు దీనిని పాణిగ్రహణానంతర విలాస యాత్రలో మరింత మధురంగా పదాలు మార్చి భుజగ

వలయంగా గ్రహించి ప్రయోగించాడనవచ్చు.

3) అభినవ మధు :–

శాకుంతలంలోని ఒక ఘట్టం : శకుంతలాసక్తుడైన దుష్యంతుణ్ని హంసపదిక ఎత్తిపొడుస్తుంది–" వో మధుకర, నీవు ఎప్పటికప్పుడు కొత్త కొత్త మధువును వెదుక్కుంటూ వుంటావు. మామిడి పూ గుత్తిని అంతగా అనుభవించి ఇప్పుడు, కమలంలో వసించి సంతృప్తితో మమ్ములను మరిచిపోయావు!" అని.

"అహిణవ మహులోలు ఓ తుమం
తహ పరిచుంబి అచూ అమంజలిం,
కమళ వసదిమెత్త ణివ్వుదో
మహుఅర విహ్మరి ఓసి ణంకహం? " (శా.5–1)

ఇది ప్రాకృత గీతం. ఎంతో మధురంగా ఉంది. కాని, గాథాసప్తశతి అనుసరణ కావడం తప్పలేదు.

గాథాసప్తశతిలో ఒక ఖండిత నాయిక తన ప్రియుణ్ని ఇలాగే ఉపాలంభిస్తుంది :–

" వో మధుకరా, పూర్వం మాలతితో వుంటూ, అబ్బ కృతార్థుడినని భావించుకొంటూ, తక్కిన పూవులంటే ఇష్ట పడేవాడివి కావు. ఇప్పుడు మాలతి ఫలభార గుర్వి అయింది, కనుక వదిలిపెట్టి వెళ్ళావు."

"తఇఆ కఅగ్ఘ మహుఅర
ణ రమసి అణ్ణాసు పుప్ఫజాఈసు,
బద్ధ ఫల భార గురుఈం"
మాలఇఁ ఏహిఁ పరిచ్చ అసి"

కథా కృతార్థ మధుకర
నరమసే అన్యాసు పుష్పజాతిషు.
బద్ధ ఫలభార గుర్వీం
మాలతీ మదానీం పరిత్యజసి.

ఈ గాథలోని భావం కాళిదాసు హంసపదిక ఆవేదన ఎంత మాత్రమూ భిన్నమయినవి కావని సహృదయులకు తెలుసు.

(4) ప్రమాణమంత: కరణం.

దుష్యంతుడు కణ్వాశ్రమంలో శకుంతలను చూచాడు. తనకు ఆమె పరిగ్రహించ దగిందో కాదోనని అనుమానం కలుగుతుంది. తన అంతఃకరణమే ప్రమాణం అనుకొని సందేహం తొలగించుకుంటాడు.

"అసంశయం క్షత్ర పరిగ్రహ క్షమా
యదార్య మస్యా మభిలాషి మేమనః,
సతాంహి సందేహపదేషు వస్తుషు
ప్రమాణ మంత కరణ ప్రవృత్తయః" శా. 1–21

గొప్పవారికి సందేహం కలిగినప్పుడు అంత కరణమే ప్రమాణమనే భావం గాథా సప్తశతిలోని భావమే. తనను తప్పించుకొని తిరుగుతున్న ప్రియుణ్ని ఒక ప్రేమిక ఇలా అంటుంది. "జనం ఎలా అనుకొంటే ఏం ? జనం ఆడిక అలా వుండని నీవు నన్ను ఎంత మాత్రం ప్రేమిస్తున్నావో నీకు నీ హృదయమే ప్రమాణం నీకు నా మీద స్నేహం ఎంతగా తగ్గిపోయిందంటే, నిన్ను ఉపాలంభించడం, తూలనాడడం కూడా తగదు అన్నంతగా,'

"అచ్ఛ ఉతా జణవా ఓ
హి అఅం వి అ అత్తణో తుహ పమాణం,
తహ తం సి మంద తేహో
జహ ణ ఉవాలంభజోగో సి. 3–1

[అస్తు తావ జ్జనవాద:
హృదయ మేవాత్మనః తవ ప్రమాణం,
తథా త్వమసి మందస్నేహః
యథా నోపాలంభ యోగోసి.]

నీ హృదయమే నీకు ప్రమాణం—అనే సామాన్యమైన పలుకుబడిని, నీ మనస్సు నీకు తెలీదా అన్న సామాన్యుల మాటను గాథాసప్తశతి సహజసుందరంగా చెబితే, కాళిదాసు రాజ సార్వాన్ని ఏదేదో పెద్ద మాటలతో "గొప్పవారికి సందేహం ఏర్పడినప్పుడు అంతఃకరణమే ప్రమాణం" అనే తర్కంతో మేళవించి చెప్పాడు.

5) ప్రేమలేఖ

శకుంతల దుష్యంతునికి ప్రేమలేఖ వ్రాస్తుంది. ఈ ప్రేమలేఖ లేఖనం రామాయణ, భారతాలనుంచి తీసుకొన్నట్లు కనిపించదు. ఆదర్శ ప్రేమికుడయిన రాముడు హనుమంతునికి ఒక చీటి వ్రాసి పంపవచ్చుగదా, లంకకు! పంపలేదు. ప్రేమమూర్తు లయిన నలదమయంతులో, సావిత్రీ సత్యవంతులో, రురుప్రమ ద్వరలో ప్రేమలేఖలు వ్రాసుకొన్నట్టు భారతంలో లేదు. రుక్మిణి అంతే. లలిత విస్తరంలో తనకు ఇలాటి లక్షణాలుగల కన్య కావాలని

గౌతమ సిద్దార్థుడు పురోహితుని చేతికొక లేఖ వ్రాసి పంపినట్టు, దానికి యశోధర సమాధానం చెప్పినట్టు ఉంది. కనుక శకుంతల లేఖ వ్రాయడమనే సన్నివేశానికి (శా.5–14) గాథాసప్తశతిలోని గాథలే కారణమయి ఉంటాయి.

ఒక విరహిణి ప్రియుణికి జాబు వ్రాయబూనుకుంటుంది. వ్రేళ్ళు చెమర్చి లేఖిని జారిపోతుంది. వ్రాతకూడ సరిగా కుదరదు. "స్వస్తి అనే వ్రాయలేక పోతున్నానే ప్రియసఖి, ఏమి వ్రాయను?" అని సఖిని ప్రశ్నిస్తుంది.

"వేవిరసిణ్ణ కరంగులి
పరిగ్గహక్ఖలిఅ లేహణీమగ్గే,
సోత్థిచ్చిఅ ణసమప్పఇ
పిఅసహి లేహమ్మికిం విహిమో" 1–44

[స్వేదస్విన్న కరాంగులి
పరిగ్రహస్ఖలిత లేఖినీమార్గే,
స్వస్త్యేవ నసమాప్యతే
ప్రియసఖి లేఖే కిం విఖామః

వేవిర అనే పదానికి వేపనశీల అని ఛాయ వ్రాశారు పూర్వులు. కాని, వేవిర అంటే స్వేదమని నేను– వేప్పం, వెవరు, బెవరు, బేర్చెండు అని తెలుగు లోబుట్టువులలో వున్నందున బెవరు వేవిరగా మారి ఉంటుందని నిర్ణయించుకొన్నాను.

కాళిదాసు ఈ లేఖన భావాన్ని మాత్రమేకాక పదాలనుకూడ ప్రకరణాంతరంలో ప్రయోగించడం చూడగా, గాథాసప్తశతిని తప్పక చదివి వుంటాడనే అనిపిస్తుంది. షష్ఠాంకంలో దుష్యంతుడు విరహతాపాపనోదనార్థం శకుంతలచిత్రం గీచినప్పుడు, చిత్రం అంచులలో చెమర్చిన తన వ్రేలి గుర్తులున్నవి– "స్విన్నాంగుళి వినివేశోరేఖా ప్రాంతేషు" (6–15)– అని స్విన్నాంగుళిని ప్రయోగించాడు.

6) తిప్పుతున్న ముఖం

దుష్యంతుడు మూడవ అంకంలో శకుంతల వెళ్లిపోయిన తర్వాత, శకుంతలను ముద్దు పెట్టుకోకపోతినే అని చింతిస్తాడు." పెదవులను ముద్దు పెట్టుకోవాలనుకున్నాను. వేళ్ళు అడ్డు పెట్టింది. వద్దు వద్దు అంటూ గింజుకుంటూ మరింత అందంగా కనిపిస్తున్న ముఖం ఎలాగో పైకి ఎత్తాను. పెదవి దొరక్కుండా ముఖం తిప్పసాగింది. దట్టమైన కనురెప్పలు– ముద్దు పెట్టుకో లేకపోయాను" అంటాడు.

ముహు రంగుళి సంవృతాధరోష్ఠం,
ప్రతిషేధాక్షర విక్లబాభి రోమకు,
ముఖమంసవివర్తి పక్ష్మలాక్ష్యాః
కథమప్యున్నమితం నచుంబితంతు 3–23

ప్రియుడు ప్రియురాలిని ముద్దు పెట్టుకొనే ప్రయత్నం చేయడం, ముఖం అటూ తిప్పడం, అలకలు అటూ ఇటూ కదలాడుతూ, తుమ్మెదలు మూగిన కమలంలాగ ఉంది ముఖం అంటూ ప్రియుడు స్మరించడం– ఈ భావం గాథా సప్తశతిలో ఉంది.

"భరిమోసే గహి అహర
ధు అ సీసపహోలి రాల ఆ ఉలి అం,
వ [illegible] ణం పరిమల తరలి అ
భమరాలి పఇణ్ణ కమలంవ" 1–78

[స్మరామః తస్యాః గృహితాధర
ధుత శీర్ష ప్రఘూర్ణన శీలాల కాకులితమ్,
వదనం పరిమిళ తరలిత
భ్రమరాళి ప్రకీర్ణ కమల మివ.]

గాథా సప్తశతిలోనేమో నాయకుడు ముద్దు గట్టిగా పెట్టుకొన్నాడు. విడిపించుకొనడానికి తల అటూ ఇటూ ఊపింది నాయిక. ముంగురులు అందంగా ఊగిసలాడాయి. కాళిదాసు ఈ గాథలోని పూర్వార్థం పెంచి మధురాతి మధురం చేశాడు.

7) కండూయనం –

శివ తపోభంగానికి మన్మథుడు అన్ని ఏర్పాట్లూ చేస్తాడు. చరాచర ప్రపంచమంతా శృంగార రాగ రంజితమవుతుంది. గండు తుమ్మెద వెంటి తుమ్మెదను అనుసరిస్తూ, ఒకే పుష్ప పాత్రలో మధువును బువ్వంబంతిగా తాగుతుంది. మగ జింక తన కొమ్ముతో ఆడ జింకను గోముగా కోరాడింది; ఆ ఆడ జింక దాని తాకిడికి ఆనందంగా కన్నులు మూసుకొంది.

"మధు ద్విరేఫః కుసుమైక పాత్రే
సహ ప్రియాం స్వా మనువర్తమానః,
శృంగేణ చ స్పర్శ నిమీలితాక్షీం
మృగీ మకండూయత కృష్ణసారః." కు. 3–36

ఈ భావం ప్రకారణాంతరంలో గాథా సప్తశతిలో చెప్పిన

దాని అనుసరణ అనిపిస్తుంది. ఒక భూస్వామి గోష్ఠంలో ఎన్నో ఆవులు ఎద్దులు ఉన్నాయి. వాటిలో ఒక కొవ్వెక్కిన, దుడుకు కోడెద్దు ఉంది. దాని కొమ్మున ఒక ఆవు తన కండ్లను రాచుకొన్నదట. చూచావా దాని సౌభాగ్యం;, ఎంత నిర్భయంగా తన గొప్పదనం చాటుకుంటున్నదో! — అని ఒక నాయిక మరొకతెకు సాభిప్రాయంగా చెబుతుంది. ఇక్కడ ఆవు తన కంటిని ఎదు కొమ్మున రాచుకుంటే, కాళిదాసు శృంగార రసవ్యంజన కోసం జింకల జంటను గ్రహించాడు. ఈ గోముగా గోకడాన్ని కాళిదాసు గ్రహించాడనడం స్పష్టం.

ఈ భావాన్ని కాళిదాసు శాకుంతలంలోను గ్రహించాడు. దుష్యంతుడు ఆరవ అంకంలో విదూషకునితో తన గీయదలచిన బొమ్మను వివరిస్తున్నప్పుడు పెంటి జింక తన ఎడమ కన్నును పోతు జింక కొమ్మున గోకుకుంటున్నట్టు కూడ గీస్తానంటాడు.

> "కార్యా సైకత లీన హంస మిథునా స్రోతోవహామాలినీ
> పాదాస్తాః పరితోనిషణ్ణ హరిణా గౌరీగురోః పావనాః,
> శాఖాలంబిత వల్కల స్యచతరో ర్నిర్మాతుమిచ్ఛామ్యధః
> శృంగే కృష్ణమృగస్య వామనయనం కండూయమానాంమృగీం.
>
> శా. 6–17

8) బాష్పం —

కన్నులలో కన్నీరు ఏ కారణంతో నిండినా, దృష్టి ప్రసరించదు. యక్షుడు ఇలా సందేశం పంపుతాడు.! "ఓ ప్రియురాలా; నీవు ఒక మారు కోపం చేసుకొన్నావు. ప్రణయకుపితురాలైన నీ బొమ్మను నేను అడవి మట్టి రంగులతో బండమీద గీచి, నీ కాళ్లమీద (బొమ్మకాళ్లమీద) పడుదామని, క్షమించమని కోరుదామని అనుకొని, కాళ్లమీద పడేలోగా కళ్లనీరు కుక్కుకొనివస్తాయి. దృష్టి అడ్డగిస్తుంది. ఏమీ కనిపించదు. కనుక, ఆ విధంగానూ— నీ బొమ్మను తాకలేకపోతాను. చూచావా కృతాంతుని లీల! అలాగూ మన సమాగమం సహించదు."

> "త్వామాలిఖ్య ప్రణయ కుపితాం ధాతురాగై శ్శిలాయాః
> ఆత్మానం తే చరణపతితం యావదిచ్ఛామికర్తుం,
> అస్రైస్తావన్ముహురుపచితైః దృష్టిరాలుప్యతేమే
> క్రూరస్తస్మిన్నపి న సహతే సంగమం నౌకృతాంతః"
>
> ఉ. 47

సుందరమైన బాష్పావరుద్ధ దృష్టికి మూలం గాథా సప్తశతిలో ఉంది. ఒక విరహిణి అవస్థను యూతి ప్రియునికి వివరించే ఘట్టం. "ఓ నాయకుడా, నీ విరహం నాయికకు నిద్ర పట్టనివ్వడంలేదు. నిద్ర లేకపోవడం వల్ల స్వప్నం రాదు. కనుక నిన్ను స్వప్నంలోను చూచే ఆశ లేదు. నీవు హఠాత్తుగా ఎదుట పడితే చూచి వినోదిద్దామా అంటే, కన్నులు కన్నీటితో నిండిపోయి చూపు అడ్డగించడం వల్ల అది కూడ సంభవించడం లేదు."

> "తుహ విరహుజ్జాగర ఓ
> సివిణేవి ణ దే ఇ దంసణ సుహాఇం,
> వాహేణ జహాలో అణ
> విణో అణం సే హ అం తం పి." 5–87

> [తుహ విరహో జ్జాగరకః
> స్వప్నేపిన దదాతి దర్శనసుఖాని,
> బాష్పేణ యదాలోకన
> వినోదనం తస్యా హతం తదపి.]

ఈ గాథలోని ఉత్తరార్థ భావాన్ని కాళిదాసు గ్రహించి వుంటాడనడం స్పష్టం.

9) అశిక్షిత పటుత్వం

కాళిదాసు స్త్రీ పాత్రలను తన కాలపు రాజరికందృష్టితో చూచాడు, అలాగే తీర్చాడు అనేది విషయాంతరం. స్త్రీలు సహజ కపటులని, జాణలని స్త్రీ జాతిపైన ఒక్క విసురు విసిరాడు, దుష్యంతుని ద్వారా. దుష్యంతుడు అంగుళీయకం కోల్పోవడంవల్ల నష్టస్మృతుడై శకుంతల ఎన్ని ఆనవాళ్లు చెప్పినా నమ్మక నిరాకరిస్తూ, "ఇలాటి జాణతనం స్త్రీలకు వెన్నతోనే పెట్టిన విద్య. మానుషుల విషయంలోనేకాదు. పశులలోను పెంటిజాతికీ ఈ జాణతనంవుంది. కోకిలమ్మ తన గుడ్లను కాకి గూటిలో పెట్టి పొదిగించదూ? " అని ఎత్తిపొడుస్తాడు.

> "స్త్రీణా మశిక్షిత పటుత్వ మమానుషీషు
> సందృశ్యతే కిముతయాః ప్రతిబోధవత్యః
> ప్రాగంతరిక్ష గమనాత్ స్వమపత్యజాతం
> అన్యైః ద్విజైః పరభృతాః ఖిలుపోషయంతి"
>
> (శా. 5–22)

గాథాసప్తశతి ప్రసంగాంతరంలో మహిళల చాతుర్యాన్ని వర్ణిస్తూ, "సురతకేళిలో మహిళలకు ఎవరు ఉపాధ్యాయుడు ? స్నేహానుబంధంతో అందరూ తెలినివి అన్నీ నేర్చుకుంటాడు"

అని ఒక విలాసినితో అనిపిస్తుంది.

"బహువిహ విలాసరసిఏ
సురఏ మహిలాణ కో ఉవజ్ఝాఓ,
సిక్ఖఇ అసిక్ఖిఆఇవి
సవ్వాణేహాణు బంధేణ" 5–77

[బహువిధ విలాసరసికే
సురతే మహిలానాం ఉపాధ్యాయః
శిక్ష్యతే అశిక్షితాన్యపి
సర్వః స్నేహానుబంధేన.]

మహిళలు రహస్య విషయాలు గురువు లేకుండానే నేర్చుకుంటారని శృంగార సందర్భంగా చెప్పినదానిని కాళిదాసు సర్వ సామాన్య సూత్రంగా నిర్వచించాడు.

10) అళికనేత్రం

కాళిదాసు కుమార సంభవం 8 వ సర్గలో పార్వతీ పరమేశ్వరుల కేళీవిలాసాలు వర్ణించాడు. ఆ వర్ణననుబట్టే ఖజురాహో (ఖర్జూరవాటి) శిల్పాలు మలచబడ్డాయేమోననుకుంటాను. శివుడు రహస్యకేళిలో పార్వతి వంటిమీది వస్త్రాన్ని లాగి పారేశాడు. ఆమె సిగ్గుతో ఏమి చేయడానికి తోచక, రెండు చేతులతోను ఆయన రెండు కన్నులూ మూసివేసింది. కాని శివునికి మూడోకన్ను వుంది. దానితో ఆయన చూచాడు. తన నగ్నత్వం కప్పిపుచ్చుకొనడానికి తను చేసిన ప్రయత్నం వ్యర్థం కావడంవల్ల అవశురాలై ఉండిపోయింది పార్వతి.

"శమాలినః కరతలద్వయేనసా
సన్నిరుద్ధ్య నయనే హృతాంశుకా,
తస్య పశ్యతి లలాటలోచనే
మోఘ యత్న విధురా రహస్య భూత్ (8–7)

గాథాసప్తశతికవి ఈ సందర్భం మరీ చక్కగా వర్ణించాడు. రతికేళిలో శివుడు పార్వతి చీర ఒలిచివేశాడు. ఆమె సిగ్గుతో అతని రెండు కండ్లూ రెండు చేతులతో మూసింది. మూడో కంటిని ముద్దుతో మూసింది.

"రఇకేళి హిఅ ణిఅంసణ
కరకిసలఅ రుద్ధణఅణ జుగలస్స,
రుద్దస్స తఇఅ ణఅణం
పవ్వఇ పరిచుంబిఅం జఅఇ." 5–55

[రతికేళీ హృత నివసన
కరకిసల అరుద్ధ నయన యుగళస్య,
రుద్రస్య తృతీయనయనం
పార్వతీ పరిచుంబితం జయతి]

కాళిదాసు పార్వతిని దిస్సమొలగానే ఉంచదలచాడు గనుక, ఈ గాథలోని అళిక నయన చుంబనాన్ని వదిలి, తక్కినది గ్రహించాడు; యథాతథంగా.

11) బలాకాపంక్తి –

వర్షాకాలంలో కొంగలు బారులు కట్టి ఎగురుతుంటాయి. దానిని గాథా సప్తశతి జానపద కవి కాలుడనే కార్తాంతికుడు, మొయిలు కప్పిన గగనంలో గ్రహగతి తెలియక లెక్కలు కట్టడానికి పలకమీద గీచిన హోర–గీతలాగ ఉందన్నాడు.

"కత్థ గ అం ర ఇ బింబం
కత్థ పణట్ఠా ఓ చందతారా ఓ,
గ అణే బలా అ పంతిం
కాలో హోరం వ కట్టే ఇ." 5–35

[కుత్ర గతం రవి బింబం
కుత్ర ప్రణష్టాః చంద్ర తారకాః,
గగనే బలాకా పంకిం
కాలో హోరా మి వా కర్షతి.]

ఈ కొంగల బారును కాళిదాసు స్వీకరించాడు. "ఓ మేఘుడా, నీ ప్రయాణానికి మంచి శకునా లవుతున్నాయి. అనుకూల వాయువులు నెమ్మదిగా వీస్తున్నాయి. నీ సజాతి అయిన అందమైన చాతకం తియ్యగా కూస్తూంది. కొంగలు బారులు కట్టి ఎదయ్యే కాలమనే సంతోషం తోఎగురుతూ, కనుల విందుగా నిన్ను చూస్తాయి.

"మందం మందం నుదతి పవనః చానుకూలోయథాత్వాం
వామశ్చాయం నదతి మధురం చాతకస్తే సగంధః,
గర్భాధాన క్షణ పరిచయాన్నూన మాబద్ధమాలాః
సేవిష్యంతే నయన సుభగం ఖే భవంతం బలాకాః."

(మే. పూ. 9.)

కాళిదాసు గ్రామ సీమల సహజ వాక్కయిన జానపద కవితాపుంజం

గాథా సప్తశతి నుంచి బలాకా పంక్తిని తీసుకొని మరింత మధు రంగా చిత్రించాడు.

12) సోపానం :—

కాళిదాసు కుమార సంభవంలో పార్వతీదేవి నడుమును వర్ణిస్తూ, పొట్టమీద ముచ్చటయిన మూడు ముడుతలను నవ యౌవనం దేహం మీదికి అధిరోహించడానికి మన్మథుడు పెట్టిన నిచ్చెన వలె ఉందని ఉత్ప్రేక్షించాడు.

''మధ్యేన సావేది విలగ్న మధ్యా
వళిత్రయం చారు బభారబాలా,
ఆరోహణార్థం నవయౌవనేన
కామస్య సోపాన మివ ప్రయుక్తం. (1–39)

ఈ నెచ్చెన—సోపాన పంక్తి గాథాసప్తశతి నుంచి గ్రహిం చిందే. బంగారు తీగవంటి యువతి, ఏ కారణంగానో చెమర్చింది. ఆ చెమట పొట్టమీద ముడుతలలో మరీ ముత్యాల కడ్డీలలాగ కని పిస్తున్నాయి. దానిని కవి ఉత్ప్రేక్షిస్తాడు—లోపలి లావణ్యం, దేహం తీగలాగ సన్ననిది గనుక ఉండలేక పైకి పొట్టమీది ముడుతలు — త్రివళి—అనే మెట్ల నుంచి వెలుపలికి దిగివస్తున్నది — అని.

''సే అచ్ఛవేణ పేచ్ఛ ఇ హ
తణు ఏ అంగమ్మ సే అమా అంతవ్,
లావణ్ణం ఓసరఇవ్వ
తివలిసోపాణ వత్తీఏ'' (3–77)

[స్వేరచ్ఛలేన పశ్యత
తనుకేంగే తస్యా అమాత్,
లావణ్య మపసరతీవ
త్రివలీ సోపాన పంక్తిభః]

గాథాసప్తశతి త్రివళీ సోపానపంక్తి లావణ్యం లోపలినుంచి వెలుపలికి దిగిరావడానికి వేసింది, కాళిదాసు దీనిని నవయౌవనం పైకి ఎక్కడానికి ఉపయోగించాడు.

13) దీపశిఖ

రఘువంశంలో ఇందుమతీ స్వయంవర ఘట్టం. సూపర్ బజారులో వస్తువులను చక్కగా అమర్చినట్టు, దేశంలోని రాజు లందరూ స్వయంవర మండపంలో ప్రదర్శన వస్తువులుగా ఆసీ నులై వున్నారు. ఇందుమతిని సునంద అనే పరిచారిక ప్రతి రాజు వద్దకు పిలుచుకొని వెళ్లుతుంది. ఇందుమతి సంచారిణి అయిన దీపశిఖవలె— నడదీపంవలె— ఏ రాజు వద్దకు వెళ్ళిందో ఆ రాజు అప్పుడు ఉత్సాహంతో వెలిగాడు; ఆమె అతనిని దాటిపోగానే నిరు త్సాహంతో నల్లబడిపోయాడు. రాత్రిపూట రాజమార్గంలో చేతబట్టుకొని ఎవరైనా వడుస్తున్నపుడు, ఆ దీపకాంతి పడిన మేడో అంగడో క్షణం సేపు వెలుగుతుంది. ముందుకు పోగానే నల్లగా కనిపిస్తుంది. చీకట్లో—అని నరేంద్రమార్గాట్టంతో పోల్చాడు రాజులను; ఇందుమతిని నడదీపంతోను. ఈ అపూర్వ మైన పోలికతోను, ఇతరత్ర దీపాన్ని వర్ణించడంతోను, కాళి దాసుకూ దీపశిఖా కాళిదాస;' అనే ఖ్యాతి వచ్చింది.

సంచారిణి దీపశిఖేవ రాత్రే
యం యం వ్యతీయాయ పతింవరాసా,
నరేంద్ర మార్గాట్ట ఇవ ప్రవేదే
వివర్ణభావం సపభూమిపాల: (కు—5—67)

కాని, ఈ ఖ్యాతికి మూలాలు గాథాసప్తశతిలో వున్నాయి. గాథాసప్తశతిలో దీప వర్ణనలు విధవిధాలుగా వున్నాయి. దుర్మా ర్గుణ్ణి మనం స్నేహంతో, వస్తువుల ఈవితో ఎంత ఆదరించినా నరే దీపంలాగ ఉన్న ఇంటినే నల్లబరుస్తాడు; (2–35) ఒక ఇల్లాలు సందె దీపం పెడుతున్నది. భర్త వ్యాపారం కోసం విదేశంవెళ్ళాడు. భర్త జ్ఞాపకం వచ్చాడు. కళ్లు కన్నీటితోనిండి ధారకట్టాయి. ఆ కన్నీటితో దీపం ఆరిపోతుందేమోనని ముఖం అటు తిప్పి దీపం పెడుతున్నదట. (3–22) ఒక ప్రియుడు ప్రియురాలిని సమాధాన పెట్టడం కోసం ఆమె కాళ్లమీదపడ్డా డు. అక్కడ దీప మినుకుమినుకు మంటూంది. ఆ ప్రియురాలి చెలి కూడ ఉంది. ''చూచావా నా సౌభాగ్యం ఇంకా బాగా చూడు'' అన్నట్టు ప్రియురాలు దీపం వత్తిని పైకి ఎగసనదోసింది. (3–64) మాంచి యౌవనంలో ఉన్నవారు రాత్రంతా వివిధ భంగిమలలో, వివిధ కరణాలతో క్రీడించారు. దీపం దాన్నంతా ఆశ్చర్యంగా చూస్తూ, నూనె అయిపోవడం కూడ గుర్తించ లేదట. (6–47) ఇక ముఖ్యమైన చీకటిలో నడయాడే దీప శిఖ. ఒకఅనుభవశాలిని అనుభవం లేక దుడుకుతనం చేస్తూ రాత్రిళ్ళు ధైర్యంగా తిరిగే యువతిని మందలిస్తుంది.'' అమ్మాయీ, నీకేమో చేర్య రతమంటే శ్రద్ధ ఎక్కువ. దానికోసమని చీకట్లో తిరగకు. నీవు పచ్చగా అందమైన దానివి దీపశిఖవలె—వెలుగుతున్న తెల్లికవలె— గాఢాంధకారంలోను బాగా అందరికండ్లబడతవు!'' అని.

చోరి అర అ సద్దాలు ఇ
మాపుత్తి బ్భమసు అంధ ఆరమ్మ,

అహీ 'అఅరం లక్ఖిజ్జసి
తమ భరిఏ దీవసీహవ్వ" (5–15)

[చౌర్యరత శ్రద్ధాశీలే
మా పుత్రి భ్రమాంధకారే
అధికతరం లక్ష్యసే
తమోభృతే దీపశిఖేవ.]

చీకటిలో దీపశిఖవలె కనిపిస్తావు వెళ్ళవద్దు అన్న పై గాథలోని భావం సంచారిణి దీప శిఖకు. మూలమయి వుంటుందని సాహిత్యజ్ఞుడెవడైన గ్రహించచ్చు.

ఈ ఈ దీప శిఖను కాళిదాసుకు సమకాలికుడైన సేతు బంధకారుడు కూడ వాడినాడు.

14) సత్పురుషులు:

శాకుంతలం పంచమాంకంలో దుష్యంతుని ప్రశంసిరచే ఘట్టం. చెట్లు పండ్లబరువుతో వంగుతాయి. బాగా నీరు నిండిన కారుమేఘాలు క్రిందికి వ్రేలాడుతాయి. అలాగే ఐశ్వరం వచ్చినప్పుడు గొప్పవారు గర్వపడరు. ఇది పరోపకారుల స్వభావం— అని ప్రశంస. ఈ భావంలో కొంత గాథాసప్తశతి నుంచి గ్రహించబడింది.

"భవంతి నమ్రాస్తరవః ఫలోద్గమై :
నవాంబుభిః దూరవిలంబినోజనోః
అనుద్ధతోః సత్పురుషా! సమృద్ధిభిః
స్వభావ ఏవైష పరోపకారి ణాం శార

గాథాసప్తశతిలో సత్పురుషుల ప్రశంసా సందర్భంలోనే ఇలాటి గాథవుంది.

"ఫలసంపత్తి ఇ సమోణ అఇ
తుంగా ఇ ఫ్ఫ వివత్తి ఏ
హి అ ఆ ఇ సువురి సాణం
మహా తరుణాం వ సిహరాఇ. (3–82)
ఫల సంపత్యా నమవతాని
తుంగాని ఫల విపత్యా
హృదయాని సుపురుషాణాం
మహా తరూణాం చ శిఖరాణి.]

పెద మానులు పళ్ళు నిండుగా వున్నప్పుడు వంగి వుంటాయి. పళ్ళు లేనప్పుడు పైకి లేచి వుంటాయి. గొప్పవారి మనసులు ఐశ్వర్యకాలంలో వినయంగా వుంటాయి. ఐశ్వర్యం లేకపోయినా నీచపు పనికి పాల్పడక ఉన్నతంగా ఉంటాయి.

ఈ భావం కాళిదాసు శ్లోకంలోని మొదటి పాదానికి మూలం కావచ్చు ననడంలో ఎవరికీ అనుమానం వుండదు.

ఇవేకాక విరహోత్తరాబర్డ; విరహశయన, కంటికితకపాల, గోత్రస్ఖలనం, మంగళకలశ, కుడ్యలేఖనం, గృహ ద్వారణ తోరణ; ఏకవీణి, నవమాలిక, అంగణ (మంధార) వృక్ష. ముఖ విధ్మాపనం, మొదలయిన పదబంధాలను, భావాలను కాళిదాసు గాథాసప్తశతి నుంచి గ్రహించాడు.

ఇక దోహద ప్రక్రియలు— అశోకదోహదం, కురవక దోహదం మొదలయిన వాటికి గాథాసప్తశతికి ముందున్న సాహిత్యంలో ఆరకం కనిపించదు. అథర్వవేదంలో, వృక్షాయుర్వేదంలో దీని ప్రశంస కొంత ఉంది. కాని ప్రాకృత జానపద సాహిత్యంలో, ముఖ్యంగా గాథాసప్తశతిలో ఈ దోహద క్రియ కోకొల్లలు దీనిని కాళిదాసు మొదలయిన రాజ రంజక కవులు గ్రహించి వుంటారు.

భావుకతకు, సహజ సుందర భావ ప్రకటనకు ప్రతి దేశపు కవులూ నేడూ జానపద ప్రజారంజక కవుల వైపు అర్రులు సాచుతున్నారు. ఆ కాలంలోను ఇది సంభావించింది. అజ్ఞాత జానపద కవులకు రాజరంజక కవులు ఎంతగా కృతజ్ఞులై వుండాలో ఊహించలేము. కాళిదాసూ దీనికి అపవాదం కాదు.

[వరంగల్లు స్నాతకోత్తర విద్యా కేంద్రంలో 1974 మార్చి 22, 23 తేదీలలో చదివిన ఎక్స్‌టెన్షన్ ఉపన్యాసాలలో రెండవది.]

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna, Vijayawada. Phones : 75667 & 75226.

శ్రీరస్తు — శ్రీ త్రిపురసుందరీ పరశివాభ్యాం నమః

శ్రీ రాక్షసనామ సంవత్సర పూర్ణశాస్త్రీయ (ఆంధ్రపత్రికా) పంచాంగమ్

బ్రహ్మశ్రీ శ్రీమత్పిడపర్తి సుబ్రహ్మణ్యశాస్త్రిణః పుత్రాభ్యాం చినకృష్ణమూర్తిశాస్త్రి - సుబ్రహ్మణ్యశాస్త్రిభ్యాం ప్రణీతమ్

విఘ్నేశ విధిమార్తాండ చంద్రేంద్రోపేంద్ర వందిత • నమో గణపతే తుభ్యం బ్రహ్మణాం బ్రహ్మణస్పతే.
వేదమయీం నాదమయీం పరపదోద్య దిందుమయీం
మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం.

గమనిక

ఈ సంవత్సరమున రాజు శని, మంత్రి చంద్రుడు, సేనానాయకుడు అర్ఘాధిపతి, మేఘాధిపతి సూర్యుడు! సస్యాధిపతి నీరసాధిపతి బుధుడు! ధాన్యాధిపతి కుజుడు! రసాధిపతి శుక్రుడు! సర్వసస్య సముదాయమగు 16 వీసములలో 6 వీసముల పంట పండును. పశుపాలకుడు, పశువులను దొడ్డి పెట్టువాడు బలరాముడు. గోష్ఠ బహిష్కర్త యముడు. ఒక కుంచెడు వర్షము పగటియం దార్ద్రా ప్రవేశము. వత్సరాది ప్ర॥ చైత్ర బ౧౫ శనివారము ప॥ పడుచు బ్రాహ్మణుని హస్తమందును, తదారభ్య ఆషాఢ శు॥ ౧౪ బుధవారము ప॥ ముదుసలి బ్రాహ్మణుని హస్తమందును, తదారభ్యావత్సరము బాలికయగు వైశ్య హస్తమందును కుంచ ముండును. కార్తిక శు౧౫ మంగళవారమున ఖచ్ఛన్న చంద్రగ్రహణము. మాఘ బ౧౧ బుధ గంగానదీ పుష్కర ప్రవేశము.



మౌఢ్యములు

శ్రావణ శు ౧౨ (18-8-1975) సోమవారము లగాయతు శ్రావణ బ౯ (31-8-1975) ఆదివారము వరకు శుక్రమౌఢ్యము— ఈ వత్సరము గురు మౌఢ్యము లేదు.

కల్యాద్యబ్దాః ౫౦౭౬
శాలివాహనశక: ౧౮౯౭
ఫసలీసన్ ౧౩౮౪-౮౫
హిజరీసన్ ౧౩౯౫-౯౬
క్రీస్తుశకము 1975—76
భారత స్వాతంత్ర్య శకము 28—29.

ఆంధ్రపత్రికా కార్యాలయము, గాంధీనగరం, విజయవాడ - 3.

పంచాంగ పద్ధతి వివరణము

ఇందు కాలమానము యథాప్రకారముగా విజయవాడ, గుంటూరు, ఏలూరు మొదలగు ఆంధ్ర ప్రదేశ్ మధ్యభాగమునకు చూపబడినది. తిథి, నక్షత్రములు ఘటికలలోను, గంటలలోను కూడ చూపబడినవి. శుభ ముహూర్తములు—దుర్ముహూర్తములు—వర్జ్యములు—మహాపాతలు గంటలలో మాత్రం చూపబడినవి. యోగకరణ, అమృత, గ్రహ ప్రవేశములు ఘటికలలో మాత్రం చూపబడినవి. భారత ప్రభుత్వముచే నియమింపబడిన కాలెండరు రిఫారమ్ కమిటీవారి నిర్ణయము ననుసరించి ప్రకటింపబడిన ఇండియన్ ఎఫెమెరీసు అండ్ నాటికల్ అల్మనాక్కునకు సరిపడునట్లు చూపబడినవి. నూతన వేధశాలల యందు కనుగొనబడిన భూకేంద్రమునకు సరిపడు వాస్తవిక రవి చంద్రులచే సాధింపబడిన తిథ్యాదికము, గ్రహసంచారము ఇందు ప్రాధాన్యముగ చూపబడినవి. ఈ తిథ్యాధి గ్రహ సంచారములే పంచాంగమున వ్రాసినట్లు ఆకసమున సరిపడుచున్నవి. న్యాయమును లోకము తెలిసికొనుటకొరకు భేదమును గుర్తింప గలందులకు పూర్వ పద్ధతి పంచాంగము కూడా ఇందు సంగ్రహముగ చూపబడినది. ఇందు చూపబడిన పూర్ణ శాస్త్రీయ పద్ధతియే శాస్త్రీయమని గ్రహింపనగునని మా నిశ్చితాభి ప్రాయము. ఇందు తిథ్యాది, ఘటికలు, ఉదయాస్తమయములు, శుభ ముహూర్తములు, దుర్ముహూర్తములు, లగ్నాంతకాలములు, నిరయణ గ్రహస్ఫుటములును విజయవాడ, గుంటూరు, ఏలూరు ప్రాంతములకు చూపబడినవి. దేశాంతర చక్రములును చూపబడినవి. ఇందు వేదాంగ జ్యోతిషమున సూచింపబడిన అశ్విన్యాదిని గ్రహించి ఈ పంచాంగ రచన చేసియున్నాము. గావున వైదికము సనాతనము గూడ యగుచున్నది. 10 అక్షాంశ లగాయతు 30 అక్షాంశ వరకు లగ్న ప్రమాణములు యివ్వబడినవి. శాస్త్రమునకు ప్రత్యక్షమునకు సమిచితమై యొప్పు ఈ పంచాంగమును గ్రహించి శ్రౌతస్మార్త కర్మల నాచరింప గోరుచున్నాము.

తిథ్యాదికమునందు దేశాంతర చక్రము

	చైత్ర మేష	వైశాఖ వృషభ	జ్యేష్ఠ మిథున	ఆషాఢ కర్కాటక	శ్రావణ సింహ	భాద్ర కన్యా	ఆశ్వీజ తులా	కార్తిక వృశ్చిక	మార్గశిర ధను	పౌష మకర	మాఘ కుంభ	ఫాల్గున మీన
మైసూరు	—౩౯	—౪౯	—౫౬	—౫౯	—౫౬	—౪౯	—౩౯	—౩౦	—౨౩	—౨౦	—౨౩	—౩౦
బెంగుళూరు	—౩౦	—౩౭	—౪౪	—౪౮	—౪౪	—౩౭	—౩౦	—౨౨	—౧౬	—౧౪	—౧౬	—౨౨
అనంతపురం	—౩౦	—౩౪	—౩౮	—౩౯	—౩౮	—౩౪	—౩౦	—౨౬	—౨౩	—౨౧	—౨౩	—౨౬
బళ్ళారి	—౩౮	—౪౦	—౪౩	—౪౪	—౪౩	—౪౦	—౩౮	—౩౪	—౩౨	—౩౧	—౩౨	—౩౪
కర్నూలు	—౨౬	—౨౮	—౨౭	—౨౯	—౨౭	—౨౮	—౨౬	—౨౪	—౨౩	—౨౨	+౨౩	—౨౪
హైదరాబాద్	—౨౧	—౨౦	—౧౭	—౧౭	—౧౭	—౨౦	—౨౧	—౨౩	—౨౫	—౨౫	—౨౫	—౨౩
వరంగల్లు	—౧౦	—౮	—౪	—౩	—౪	—౮	—౧౦	—౧౩	—౧౬	—౧౮	—౧౬	—౧౩
తిరుపతి	—౧౩	—౧౯	—౨౪	—౨౮	—౨౪	—౧౯	—౧౩	—౮	—౨	+౦	—౨	—౮
నెల్లూరు	—౬	—౧౧	—౧౪	—౧౬	—౧౪	—౧౧	—౬	—౨	+౨	+౪	+౨	—౨
కుంభకోణం	—౧౨	—౨౪	౩౪	—౩౦	—౩౪	—౨౪	—౧౨	—౦	+౯	+౧౩	+౯	—౦
కాంచీపురం	—౯	—౧౮	—౨౪	—౨౬	—౨౪	—౧౮	—౯	—౧	+౬	+౭	+౬	—౧
మద్రాస్	—౪	—౧౧	—౧౮	—౨౦	—౧౮	—౧౧	—౪	+౪	+౧౦	+౧౨	+౧౦	+౪
భద్రాచలం	+౩	+౫	+౮	+౭	+౮	+౫	+౩	+౦	—౨	—౩	—౨	+౦
బందరు	+౫	+౫	+౪	+౪	+౪	+౫	+౫	+౬	+౮	+౮	+౮	+౬
రాజమండ్రి	+౧౧	+౧౩	+౧౩	+౧౪	+౧౩	+౧౩	+౧౧	+౧౦	+౯	+౯	+౯	+౧౦
విజయనగరం	+౨౭	+౩౨	+౩౪	+౩౬	+౩౪	+౩౨	+౨౭	+౨౪	+౨౧	+౨౦	+౨౧	+౨౪
బరహంపురం	+౪౨	+౪౭	+౫౩	+౫౫	+౫౩	+౪౭	+౪౨	+౩౬	+౩౧	+౨౯	+౩౧	+౩౬

సూచన

విజయవాడ నుండి భారత ప్రభుత్వము వారిచ్చే నిర్ణయింపబడిన చైత్రాది మాసారంభము (అనగా మేషాది సాయన మాసారంభము) యందు కలుగు దేశాంతర విఘటికలు యీ పై చక్రమునందు చూపబడినవి. స్వగ్రామమునకు సమీపమందున్న పట్టణమునకు అభీష్ట మాసాదియందు గల విఘటికలను యీ చక్రమునసుసరించి విజయవాడకు పశ్చిమ దేశములయందుండు వారు యీ పంచాంగ మందలి తిథ్యాదులలో తీసివేయగాను, ప్రాగ్దేశములవారు కలుపగాను స్వస్థానమునకు సూర్యోదయాది తిథ్యాది కాలము లగుచున్నవి. యీ విజయవాడ యామ్యోత్తర రేఖకు సమీపమందుగల దక్షిణోత్తరదేశముల వారు ఇందు ఆయా మాసములలో చూపిన + ధన — ఋణ చిహ్నలను గుర్తించి సంస్కరించుకొన వలయును. ఇందుచూపిన విఘడియలు మాసాదియందు చూపబడినవి. మాసమధ్యయందు త్రైరాశికముచే దేశాంతరమును గ్రహించి సంస్కరించినచో సూర్యోదయాది స్ఫుటతిథ్యాది కాలములగును. ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలు పై ప్రకారము దేశాంతర విఘటికల కగు నిమిషములను ఈ విజయవాడ కగు సూర్యోదయ గంటలలో ధనరుణ చిహ్నలకు వ్యత్యస్తముగా (అనగా విజయవాడకు పశ్చిమ దేశమందుండు వారు కలుపగను, ప్రాగ్దేశవాసులు (తీసివేయ గను) సంస్కరించిన యెడల స్టాండర్డ్ టైము ననుసరించి ఇష్ట గ్రామమునకు సూర్యోదయ గంటలగును; ఈ ప్రకారము సూర్యాస్తమయ కాలమును చేయరాదు.

లగ్నాంతకాలములయందు దేశాంతర చక్రము

	మీన	మేష	వృష	మిథు	కర్క	సింహ	కన్య	తుల	వృశ్చి	ధను	మక	కుంభ
మైసూరు	+19	+22	+24	+23	+20	+17	+13	+10	+ 8	+ 4	+11	+15
బెంగుళూరు	+14	+17	+19	+18	+16	+13	+10	+ 7	+ 5	+ 6	+ 8	+11
అనంతపురం	+13	+15	+15	+15	+14	+12	+11	+ 9	+ 2	+ 9	+10	+11
బళ్ళారి	+16	+17	+17	+17	+16	+15	+14	+13	+12	+13	+13	+15
కర్నూలు	+11	+11	+12	+11	+11	+10	+10	+ 9	+ 9	+ 1	+10	+10
హైదరాబాదు	+ 8	+ 7	+ 7	+ 7	+ 8	+ 8	+ 9	+10	+10	+10	+ 9	+ 9
వరంగల్లు	+ 3	+ 2	+ 3	+ 1	+ 2	+ 4	+ 5	+ 6	+ 7	+ 6	+ 5	+ 4
తిరుపతి	+ 7	+ 9	+11	+10	+ 8	+ 6	+ 3	+ 1	— 0	+ 0	+ 2	+ 5
నెల్లూరు	+ 4	+ 5	+ 6	+ 6	+ 5	+ 3	+ 1	— 1	— 1	— 1	+ 0	+ 2
మదరాసు	+ 4	+ 6	+ 8	+ 7	+ 5	+ 2	+ 1	— 4	— 5	— 4	— 2	+ 1
కుంభకోణం	+ 9	+13	+15	+14	+11	+ 6	+ 1	— 3	— 5	— 4	— 1	+ 4
కాంచీపురం	+ 6	+ 9	+10	+10	+ 7	+ 4	+ 1	— 2	— 3	— 3	— 0	+ 3
భద్రాచలం	— 2	— 3	— 3	— 3	— 2	— 1	— 0	+ 1	+ 1	+ 1	+ 0	— 1
బందరు	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 3	— 3	— 3	— 3	— 2
రాజమండ్రి	— 5	— 5	— 5	— 5	— 5	— 5	— 4	— 4	— 4	— 4	— 4	— 4
విజయనగరం	—12	—14	—14	—14	—13	—12	—10	— 9	— 8	— 8	— 9	—11
బరహంపురం	—19	—21	—22	—22	—20	—17	—15	—13	—11	—12	—14	—16

ఇందు చూపబడిన లగ్నాంతకాలములు స్టాండర్డు టైము ననుసరించి విజయవాడకు లగ్నాంతకాలము లగుచున్నవి. ఇతర దేశముల వారు, ఈ చూపబడిన దేశాంతర చక్రము ననుసరించి, ఆయా లగ్నాంత కాలములకు చూప బడిన నిమిషములను, విజయవాడకు పశ్చిమదేశముల నుండువారలు ఆ యా కాలములలో కలుపగాను, ప్రాగ్దేశములయందుండువారు తీసివేయగను, స్టాండర్డు టైముననుసరించి ఇష్టమగు నాయానగరములకు లగ్నాంత కాలము లగును. తిథులలో ప్రతిమాసము దిగువను ప్రతిరోజున లగ్నాంత కాలములు చూపబడినవి.

అయనాంశలు { నూతన సంస్కార సంస్కృత చైత్ర పక్షీయనాంశలు
సంవత్సరాదికి 23°-30'-56" వార్షికాయనగతి 50'-26"

ఆంధ్రప్రదేశ్ భారతదేశముల సౌభాగ్యము

మి	వృ	మే	మీ
శ	శు కే		ర బు గు చ
	వర్ష లగ్న కుండలి		క
		రా ల	

మి	వృ	మే	మీ
శ	శు చం కే	ల ర	బు గు
	జగల్లగ్న కుండలి		క
		రా	

వర్షలగ్నాపేక్షయాలగ్నషష్ఠాధిపతియగు కుజునకు పంచమస్థితి, ధనపంచమాధిపతియగు గురునకు అష్టమలాభాధిపతియగు బుధునకు భాగ్యాధిపతియగు చంద్రునకు రాజ్యాధిపతియగు సూర్యునకు పంచమస్థితి. తృతీయవాహనాధిపతియగు శని అష్టమమున నుండి రవి. చంద్ర, బుధ, గురులను దశమదృష్టితో జూచుచుండెను. సప్తమవ్యయాధిపతియగు శుక్రుడు కేతువుతో గలిసి సప్తమమున నుండెను. లగ్నమున రాహుస్థితి. ఇక జగల్లగ్నాపేక్షయా లగ్నమున పంచమాధిపతియగు రవికుచ్చ. ధనసప్తమాధిపతియగు శుక్రుడు వాహనాధిపతియగు చంద్రునితోను కేతువుతోను కలిసి ద్వితీయ స్థితి. రాజ్యలాభాధిపతియగు శని తృతీయ స్థితి. తృతీయ షష్ఠాధిపతియగు బుధుడు నీచస్థితుడై భాగ్యవ్యయాధిపతియగు గురునితోగలిసి వ్యయస్థితి. లగ్నాష్టమాధిపతియగు కుజునకు లాభస్థితి. అష్టమమున రాహుస్థితి. ఈ విధమున పరిమర్శ చేయగా ధనపంచమ భాగ్యరాజ్యాధిపతుల కలయిక వలన రాష్ట్ర ప్రభుత్వము తలపెట్టిన భారీ పరిశ్రమలు విజయవంతమగును కాని దుర్బలుడైన అష్టమాధిపతి కలయికవలన కొంత జాగు కనబడు చున్నది. రాష్ట్ర ప్రభుత్వమున కొన్ని కొన్ని చిన్న మార్పులు వచ్చుటవలన చిన్న చిన్న అలజడులు వచ్చినను కేంద్రప్రభుత్వ అజమాయిషీచే నాంధ్ర ప్రభుత్వము నిమ్మకు నీరెత్తినట్లుగా సుస్థిరముగా నుండును. భాగ్యరాజ్యాధిపతుల కలయికవలన రాష్ట్రాదాయము అభివృద్ధిజెంది కొత్త పథకములను రూపొందించుటవలన కొంత కేంద్రసహాయమును పొందగలరు. సుఖస్థానాధిపతియగు శని అష్టమమునుండి భాగ్యరాజ్యాధిపతులను చూచుటవలన ప్రజలలో కొంత అసంతృప్తి గోచరమగును. జగల్లగ్నమున పంచమాధిపతియగు రవి ఉచ్చస్థితుడై యుండుటవలన కేంద్రప్రభుత్వము ప్రపంచరాజ్యములలో మిత్రరాజ్యముగా వన్నెగాంచినను ఆర్థికపరిస్థితులలోనపుడపుడుకొరతయేర్పడుచుండును. ధనవాహనాధిపతులను లగ్నాధిపతి చూచుచుండుట వలన ప్రజాసహకారముతో కేంద్ర రాష్ట్రముల మధ్య సన్నిహిత సంబంధముకల్గి తలమానికము కాగలదు. రాష్ట్రప్రభుత్వసన్నులును క్షేంద్ర పరిశీలనముతో ప్రజలకు శిరోధార్యము కాగలవు. షష్ఠ భాగ్యాధిపతులకు వ్యయస్థితి యుండుటవలనను వారిని రాజ్యాధిపతియగు శని దశమ దృష్టితో చూచుట చేతను కొన్ని రాష్ట్రములలో ఆహార సమస్య తలయెత్తును. మరికొన్ని రాష్ట్రములలో వ్యతిరేక భావము కనబడుచున్ననూ కేంద్ర ప్రభుత్వము తన వాకచక్యముచే సరిదిద్దగలదు.


కార్తెలు – ఫలములు

75 మే	25	రోహిణికార్తె	ప గం 1—45లకు	అపుడపుడు వృష్టి
జూన్	8	మృగశిరకార్తె	ప గం 11—37	సాధారణ వృష్టి
	22	ఆర్ద్రకార్తె	ప గం 10—36	సామాన్య వృష్టి
జులై	6	పునర్వసుకార్తె	ప గం 10—14	సువృష్టితుల్య
	20	పుష్యమికార్తె	ప గం 9—44	మేఘాడంబర వృష్టి
ఆగస్టు	3	ఆశ్లేషకార్తె	ప గం 8—42	సువృష్టి
	17	మఘకార్తె	ఉ గం 6—18	సువృష్టిరవి
	30	పూర్వ ఫల్గునికార్తె	రా గం 2—21	సువృష్టి
సెప్టెంబర్	13	ఉత్తరకార్తె	రా గం 08—8	సస్యోచిత వృష్టి
	27	హస్తకార్తె	ప గం 11—42	మధ్యే మధ్యే సువృష్టి
అక్టోబర్	10	చిత్తకార్తె	రా గం 12—37	చిత్ర వృష్టి
	24	స్వాతికార్తె	ప గం 11—10	ఖండవృష్టి
నవంబర్	6	విశాఖకార్తె	సా గం 7—15	వాతాధి కాల్ప వృష్టి
	19	అనూరాధకార్తె	రా గం 1—19	సవాతవృష్టి

చంద్ర గ్రహణమ్ 18 11-1975

ఏ తత్సంవత్సర కార్తిక శు ౧౫ మంగళవారే కృత్తికా నక్షత్ర వృషభ రాశౌ ఖచ్చన్న చంద్ర గ్రహణం కేతుగ్రస్తం పింగళ వర్ణమ్.

		IST
సూర్యాస్తమయాది స్పర్శకాల:	౧౧-౩౯	రా గం 2— 9
నిమీలన కాల:	౧౫-౫	రా గం 3—33
మధ్య కాల:	౧౫-౫౯	రా గం 3—53
ఉన్మీలన కాల:	౧౬-౪౧	రా గం 4—14
శుద్ధమోక్షకాల:	౩౦-౧౧	తె గం 5—38
బింబాదర్శనకాల:	౧-౪౩	0—41
ఆద్యంత పుణ్య కాల:	౮-౪౩	3—29



దక్షిణ గోల:. అపసవ్య గ్రహణం ప్రాగీశాన్య మధ్యే స్పర్శ:. దక్షిణ నైఋతి మధ్యే నిమీలనం దక్షిణాగ్నేయ మధ్యే ఉన్మీలనం. వాయవ్యా సన్నేమోక్ష:

నిత్యభోజన ప్రత్యాబ్దికములను యథాకాలమున నిర్వర్తించుకొనవలెను.

గ్రహణ ఫలము

వృషభము, సింహము, ధనుస్సు, మేషము రాశులవారికి అధమ ఫలము
మిథునము, వృశ్చికము, కన్య, మకరము, ,, మధ్యమఫలము
కర్కాటకము, తుల, కుంభము, మీనము ,, శుభఫలము

N.B.:— అధమఫలమువారు శాస్త్రోక్తశాంతి చేసుకొనవలెను. శాంతి విధానం ఉత్తర పీఠికలో గోచారము తరువాత వ్రాయబడినది.

భారతదేశమున ఆయా అక్షాంశ ప్రదేశములకు మేషాది నిరయణ రాశి ప్రమాణములు — ఘటికలు-విఘటికలు-పరలు

అక్షాంశ	మేషము	వృషభము	మిధునము	కర్కాటకము	సింహము	కన్య	తుల	వృశ్చికం	ధనుస్సు	మకరం	కుంభం	మీనం
	ఘ. విఘ. పర.	ఘ. విఘ. పర.	ఘ. విఘ. పర.	ఘ. విఘ. పర.	ఘ. విఘ. పర.	ఘ. విఘ. పర	ఘ. విఘ. పర.	ఘ. విఘ. పర	ఘ. విఘ. పర	ఘ. విఘ. పర.	ఘ. విఘ. పర.	ఘ. విఘ. పర.
10	౪-౩౫-౧౬	౫-౮-౧౦	౫-౨౮-౧౧	౫-౨౦- ౧	౫- ౨-౧౯	౪-౫౭-౫౧	౫-౧౧-౧౩	౫-౨౭-౨౧	౫-౨౦-౫౧	౪-౫౦-౧౬	౪-౨౨-౧౭	౪-౧౬-౧౪
11	౪-౩౩-౨౬	౫- ౭-౧౧	౫-౨౮-౩౫	౫-౨౦-౩౨	౫- ౪-౨౨	౪-౫౯-౫౯	౫-౧౩- ౪	౫-౨౮-౨౦	౫-౨౦-౨౮	౪-౪౮-౪౪	౪-౨౦-౧౪	౪-౧౪- ౬
12	౪-౩౦-౩౪	౫- ౬-౧౧	౫-౨౮-౫౭	౫-౨౩- ౫	౫- ౬-౨౬	౫- ౨- ౮	౫-౧౪-౫౫	౫-౨౯-౨౦	౫-౨౦- ౫	౪-౪౭-౧౨	౪-౧౮-౧౧	౪-౧౧-౫౭
13	౪-౨౯-౪౧	౫- ౫-౧౧	౫-౨౯-౨౦	౫-౨౪-౩౮	౫- ౮-౩౧	౫- ౪-౧౮	౫-౧౬-౪౭	౫-౩౦-౨౧	౫-౧౯-౪౨	౪-౪౫-౩౮	౪-౧౬- [illegible]	౪-౯-౪౮
14	౪-౨౭-౪౮	౫- ౪- ౯	౫-౨౯-౪౪	౫-౨౬-౧౨	౫-౧౦-౩౮	౫- ౬-౨౮	౫-౧౮-౪౧	౫-౩౧-౨౧	౫-౧౯-౧౯	౪-౪౪- [illegible]	౪-౧౩-౫౯	౪- ౭-౩౭
15	౪-౨౫-౫౩	౫- ౩-౯	౫-౩౦- ౭	౫-౨౭-౪౭	౫-౧౨-౪౫	౫- ౮-౩౯	౫-౨౦-౩౬	౫-౩౨-౨౩	౫-౧౮-౫౫	౪-౪౨-౨౯	౪-౧౧-౫౨	౪- ౫-౨౫
16	౪-౨౩-౫౮	౫- ౨- ౭	౫-౩౦-౩౦	౫-౨౯-౨౩	౫-౧౪-౫౩	౫-౧౧-౫౩	౫-౨౨-౩౧	౫-౩౩-౨౫	౫-౧౮-౩౧	౪-౪౦-౫౩	౪- [illegible]-౪౩	౪- ౩-౧౨
17	౪-౨౨- ౧	౫- ౧-౩	౫-౩౦-౫౫	౫-౩౦- ౦	౫-౧౭- ౨	౫-౧౩- ౮	౫-౨౪-౨౮	౫-౩౪-౨౮	౫-౧౮- ౭	౪-౩౯-౧౬	౪- ౭-౩౪	౪- ౦-౫౭
18	౪-౨౦- ౩	౪-౫౯-౫౯	౫-౩౧-౨౦	౫-౩౨-౩౯	౫-౧౯-౧౩	౫-౧౫-౨౪	౫-౨౬-౨౭	౫-౩౫-౩౨	౫-౧౭-౪౨	౪-౩౭-౩౭	౪- ౫-౨౩	౩-౫౮-౪౧
19	౪-౧౮- ౩	౪-౫౮-౫౪	౫-౩౧-౪౫	౫-౩౪-౧౯	౫-౨౦-౨౬	౫-౧౭-౪౧	౫-౨౮-౨౭	౫-౩౬-౩౭	౫-౧౭-౧౭	౪-౩౫-౫౮	౪- ౩- ౯	౩-౫౬-౨౪
20	౪-౧౬- ౧	౪-౫౭-౪౮	౫-౩౨-౧౦	౫-౩౬- ౦	౫-౨౩-౪౧	౫-౨౦- ౧	౫-౩౦-౨౮	౫-౩౭-౪౨	౫-౧౬-౫౩	౪-౩౪-౧౬	౪- ౦-౫౫	౩-౫౪- [illegible]
21	౪-౧౩-౫౮	౪-౫౬-౪౧	౫-౩౨-౩౬	౪-౩౭-౪౩	౫-౨౫-౫౭	౫-౨౨-౨౨	౫-౩౨-౩౧	౫-౩౮-౪౯	౫-౧౬-౨౭	౪-౩౨-౩౩	౩-౫౮-౩౯	౩-౫౧-౪౪
22	౪-౧౧-౫౨	౪-౫౫-౩౪	౫-౩౩- ౨	౫-౩౯-౨౭	౫-౨౮-౧౫	౫-౨౪-౪౫	౫-౩౪-౫౬	౫-౩౯-౫౩	౫-౧౬- ౧	౪-౩౦-౪౯	౩-౫౬-౨౧	౩-౪౯-౨౧
23	౪-౯-౪౫	౪-౫౪-౨౫	౫-౩౩-౨౮	౫-౪౧-౧౪	౫-౩౦-౩౫	౫ ౨౭-౧౧	౫-౩౬-౪౩	౫-౪౧- ౭	౫-౧౫-౩౩	౪-౨౯- ౩	౩-౫౪- [illegible]	౩-౪౬-౫౬
24	౪- ౭-౩౭	౪-౫౩-౧౪	౫-౩౩-౫౫	౫-౪౩ - ౨	౫-౩౨-౫౮	౫-౨౯-౩౭	౫-౩౮-౫౩	౫-౪౨-౧౭	౫-౧౫- ౬	౪-౨౭-౧౫	౩-౫౧-౩౯	౩-౪౪-౨౮
25	౪- ౫-౨౫	౪-౫౨- ౨	౫-౩౪-౨౩	౫-౪౪-౫౨	౫-౩౫-౨౨	౫-౩౨- ౬	౫-౪౧- ౩	౫-౪౩-౨౯	౫-౧౪-౩౯	౪-౨౫-౨౫	౩-౪౯-౧౪	౩-౪౧-౫౯
26	౪- ౩-౧౧	౪-౫౦-౪౮	౫-౩౪-౫౨	౫-౪౬-౪౪	౫-౩౭-౫౦	౫-౩౪-౩౮	౫-౪౩-౧౩	౫-౪౪-౪౩	౫-౧౪-౧౧	౪-౨౩-౩౨	౩-౪౬-౪౭	౩-౩౯-౨౭
27	౪- ౦-౫౪	౪-౪౯-౩౪	౫-౩౫-౨౦	౫-౪౮-౩౯	౫-౪౦-౧౯	౫-౩౭-౧౩	౫-౪౫-౩౪	౫-౪౫-౫౮	౫-౧౩-౪౧	౪-౨౧-౩౮	౩-౪౪-౧౭	౩-౩౬-౫౩
28	౩-౫౮-౩౫	౪-౪౮-౧౭	౫-౩౫-౫౧	౫-౫౦-౩౫	౫-౪౨-౫౨	౫-౩౯-౫౦	౫-౪౭-౫౩	౫-౪౭-౧౪	౫-౧౩-౧౨	౪-౧౯-౪౧	౩-౪౧-౪౪	౩-౩౪-౧౫
29	౩-౫౬-౧౪	౪-౪౬-౫౮	౫-౩౬-౨౧	౫-౫౨-౩౫	౫-౪౫-౨౭	౫-౪౨-౩౧	౫-౫౦-౧౫	౫-౪౮-౩౩	౫-౧౨-౪౧	౪-౧౭-౪౧	౩-౩౯- ౯	౩-౩౦-౩౪
30	౩-౫౩-౪౮	౪-౪౫-౩౮	౫-౩౬-౫౨	౫-౫౪-౩౮	౫-౪౮- ౬	౫-౪౫-౧౪	౫-౫౨-౪౦	౫-౪౯-౫౪	౫-౧౨-౧౦	౪-౧౫-౩౯	౩-౩౬-౨౯	౩-౨౮-౫౧

N. B. :- పది అక్షాంశ ప్రదేశమున గల పూర్వ ప్రాంతము మొదలు ముప్పది అక్షాంశ ప్రదేశమున గల పశ్చిమ ప్రాంతముల వరకు ఈ చూపిన నిరయణ మేషాది లగ్న ప్రమాణములను స్వీకరించవచ్చును. భారతదేశమున చాలా భాగము వరకు ఈ లగ్న ప్రమాణములను మార్చి స్వీకరించు కొనవచ్చును.

విజయవాడ ప్రాంతములకు

మేషాది నిరయణ లగ్న ప్రమాణములు—పుష్కరలు

	లగ్న ప్రమాణములు			పుష్కర ప్రమాణములు	
మేషము	౪-౨౩	గం 1—45	మేషము	౩- ౪	గం 1—14
వృషభము	౫- ౨	గం 2—01	వృషభము	౨-౨౦	గం 0—56
మిధునము	౫-౩౦	గం 2—12	మిధునము	౪-౨౪	గం 1—46
కర్కాటకము	౫-౩౦	గం 2—12	కర్కాటకము	౧-౧౮	గం 0—31
సింహము	౫-౧౬	గం 2—06	సింహము	౩-౪౦	గం 1—28
కన్య	౫-౧౨	గం 2—05	కన్య	౨-౨౬	గం 0—58
తుల	౫-౨౪	గం 2—10	తుల	౪-౧౯	గం 1—44
వృశ్చికం	౫-౩౪	గం 2—14	వృశ్చికం	౧-౧౮	గం 0—31
ధనుస్సు	౫-౧౮	గం 2—07	ధనుస్సు	౩-౪౩	గం 1—29
మకరం	౪-౪౦	గం 1—52	మకరము	౨-౧౦	గం 0—52
కుంభము	౪- ౮	గం 1—39	కుంభము	౩-౧౮	గం 1—19
మీనము	౪- ౨	గం 1—37	మీనము	౦-౫౬	గం 0—22

N. B. :— గత లగ్నాంత కాలములో ముహూర్త లగ్న సంబంధమైన పుష్కర గంటలను కలిపిన శుభ ముహూర్త లగ్నమందు పుష్కర సమయము వచ్చును

రాజమండ్రి ప్రాంతములకు

మేషాది నిరయణ రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౨	తులాయాః	౫-౨౪
వృషభస్య	౫- ౧	వృశ్చికస్య	౫-౩౫
మిధునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౮
కర్కాటకస్య	౫-౩౧	మకరస్య	౪-౩౯
సింహస్య	౫-౧౭	కుంభస్య	౪- ౮
కన్యాయాః	౫-౧౩	మీనస్య	౪- ౧

విజయనగర ప్రాంతములకు

మేషాది నిరయణ రాశిప్రమాణములు

మేషస్య	౪-౨౦	తులాయాః	౫-౨౭
వృషభస్య	౫- ౦	వృశ్చికస్య	౫-౩౬
మిధునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౭
కర్కాటకస్య	౫- ౩౩	మకరస్య	౪-౩౮
సింహస్య	౫-౧౯	కుంభస్య	౪- ౫
కన్యాయాః	౫-౧౬	మీనస్య	౩-౫౮

ధర్మ నిర్ణయ సారాంశము

1 బహ్వృచానాము పాకర్మ

(శ్రావణ శు॥ సో ౪౭-౦ హస్త ౪౦-౧౦ నవోపనీతానాం బహ్వృచానాము పాకర్మ. తదుక్తం ధర్మ సింధౌ నూతనోపనీతానాం శ్రావణ మాస గత పంచమీ హస్త శ్రవణాదికాలేషు గురు శుక్రాస్తాది ప్రతిబంధేన ఉపాకర్మారంభాభావే భాద్రపద మాస గత పంచమీ శ్రవణాదయో గ్రాహ్యా ఇతి. యత్తు పురుషార్థ చింతామణౌ'' తేన శ్రావణ శ్రవణాదౌ గ్రహ సంక్రాంత్యాదిదోషే తత్పంచమీ విధిః ప్రథమోపాకర్మణ్యపి యథా ప్రవర్తతే ఏవంభాద్ర పద శ్రవణాది విధిరపి. అస్తాదినా శ్రావణాతి క్రమేపి ప్రవర్తత ఇతి బోధ్యమితి వ్యవస్థా కృతా. తత్ప్రథమ నాద మాత్ర పరం.విచార్యమాణే సతి భాద్రపద గత పంచమ్యాది గ్రహణే సతిద్వయోరపిగౌణకాలత్వం. శ్రావణ గతపంచ మ్యాది గ్రహణేసతి. పంచమ్యాదీనాం గౌణకాలత్వేపి మాసస్యముఖ్యకాల త్వమితివిశేషః అత ఏవ ధర్మసింధూక్తం సమీచీన మిత్యవగమ్యతే. ప్రకృతే శ్రావణశుక్ల పంచమ్యాః నిర్దుష్టత్వాత్. తద్దైవ హస్తస్యాపి విద్యమానత్వాచ్చ. నవోపనీతైః ఋగ్వేదిభిః శ్రావణ శు॥ సోమ వాసరే ఉపా కర్మకర్తవ్యమిత్యలం. బహు విస్తరేణ.

2 మత్త్రయ శ్రీకృష్ణ జయన్తీ

(శ్రా. బ॥ శు ౭౭-౧౩ కృ ౪౫-౩౩

౦ శ ౭౭.౫౦ రోహి ౪౮.౧౦మత్త్రయ శ్రీ కృష్ణ జయన్తీ

తదుక్తం కాలజ్ఞ దర్పణే— ఉదయే చాష్టమీ కించిత్. నవమీ సకలాయది. ప్రాజాపత్యర్క్ష సంయుక్తా సైవో పోష్యా మహో ఫలా ఇతి. వహ్ని పురాణేపి. ''కృష్ణాష్టమ్యాం భవేద్యత్ర కలైకా రోహిణీయది జయన్తీనామ సాప్రోక్తా ఉపవాసేమహాఫలా. 'ఇతి' కాలమాధవీయే ''యస్మిన్వర్షే జయన్త్యాఖ్యో యోగోజన్మాష్టమీ తదా! అంతర్భూతా జయంత్యా స్వాధృక్ష యోగ ప్రశస్తి ఇతి. అత్ర ప్రకృతే శుక్ర వాసరే అష్టమ్యా అర్ధరాత్రి వ్యాప్తిః పరేద్యు రష్టమీరోహిణీయోగః. రోహిణ్యా అర్ధరాత్రి వ్యాప్తిరిత్యత: పరదినే స్థిరవాసర ఏవ మత్త్రయ స్యాపి శ్రీ కృష్ణ జయన్తీ వ్రతమిత్యలం

పూర్ణ శాస్త్రీయ (వాస్తవిక) పంచాంగే

3 సిద్ధి వినాయక చతుర్థీ

భాద్రపద శు 3 సో ౧౯-౬౧ మధ్యాహ్నాంత: ౧౯-౭౭ సిద్ధి వినాయకచతుర్థీ

౪ మం ౧౧-౫౭ మధ్యాహ్నాది: ౧౬-౧౯ విజయ నగర్యాది ప్రాచ్య దేశానాం సిద్ధి వినాయకచతుర్థీ ధర్మసింధౌ ''పామధ్యాహ్న వ్యాపినీ గ్రాహ్యా'' దినద్వయే సాకల్యేన మధ్యాహ్న వ్యాప్తౌ వ వ్యాప్తౌ వా పూర్వేతి. ప్రకృతే చతుర్థ్యాః దినద్వయేపి మధ్యాహ్న వ్యాప్త్య భావాత్ జయా యోగ ప్రాశస్త్యాత్పూర్వదినే సోమవాసరే సిద్ధి వినాయకచతుర్థీ వ్రతం కార్యమితి సుధృష్టోయం పంథాః కి౦ చ విజయనగర్యాది ప్రాచ్యదేశానాం పూర్వదినే సోమవాసరే లేశతోపి మధ్యాహ్న స్పర్శోనాస్తి. పరదినే మంగళ వాసరే ఏవ మధ్యాహ్న స్పర్శినీ వర్తతే''. తత్ర ధర్మ సింధు: పూర్వదినే సర్వథా మధ్యాహ్నస్పర్శో నాస్త్యేవ పరదినే ఏవ మధ్యాహ్న స్పర్శినీ తద్దైవ పరేతి. తస్మాత్పరదినే భౌమ వా సరే. విజయ నగర్యాది ప్రాచ్య దేశానాం చతుర్థ్యాః కర్మకాల వ్యాప్తే స్సత్వాత్ సిద్ధి వినాయక వ్రతం కార్యమిత్యలం శాఖా చంక్రమ ణేన.

N.B ;— పైనిచూపిన ప్రమాణములవలన 1 శ్రావణ శు॥ సోమవారమున ఋగ్వేదులకు పాకర్మయని 2 శ్రావణ బ॥ శనివారం. మత్త్రయ శ్రీకృష్ణజయంతిఅని, 3విజయనగరం అగాయతు తూర్పు దేశములకు భాద్ర పద శు ౪ మంగళవారమున సిద్ధి వినాయకచతుర్థి అనియు. విజయనగరం అగాయతు పశ్చిమ దేశములకు భాద్రపద శు 3 సోమ వాసరమున సిద్ధి వినాయక చతుర్థియనియు ఫలితార్థము.

పూర్వపద్ధతి పంచాంగే

శారద నవరాత్ర ప్రారంభః

అమా. ఆ ౯-౧౧ శారద నవరాత్ర ప్రారంభః. కలశ స్థాపనం.

శు. పా. సో. 3-౬౬ విష్య ౫౪-౧౪

యత్ర పూర్వ దినే ప్రతిపదః అమా విద్ధావర్తతే ద్వితీయదినే ప్రతిపద భావః తత్ర కోట్యంతరాభావా త్పూర్వదిన అమా యామేవేతి నిర్వివాదమేవ. యదాపూర్వ దినోదయాదారభ్య ప్రవృత్తా. ద్వితీయ దినే కించిన్న్యూన ముహూర్త త్రయ పర్యంతా ప్రతిపత్ తదా సంపూర్ణత్వా త్పూర్వైవ గ్రాహ్యేత్యపి నిర్వివాదమేవ. ప్రకృతేఽత్ర పూర్వదినే ముహూర్త చతుష్టయానంతరం ప్రవృత్తా. ద్వితీయ దినే ముహూర్త ద్వయ న్యూనా తదుపరి సంపూర్ణా ద్వితీయా వర్తతే. తస్మాత్ శారద నవరాత్ర ప్రారంభః పూర్వస్మిన్వా. పరస్మిన్వేతి వి చికిత్సాయాం. జయసింహ కల్పద్రుమోదాహృత దేవీ పురాణ వచనాని ''అమా యుక్తైవ కర్తవ్యా ప్రతిప చ్చండికార్చనే. న గ్రాహ్యా పరసంయుక్తా శుద్ధ సంతాన కాంక్షిభిః. ద్వితీయా శేష సంయుక్తా ప్రతిప చ్చండికార్చనే.మోహాదథోప దేశాద్వా కృతా పుత్ర వినాశకృత్. ఆరంభే నవరాత్రస్య. ద్వితీయా త్రుటి సమ్మితా. న కేవలం తిథిం హన్తి వేధాత్పు పుత్ర సంపదం. ద్వితీయాది కలోపేతా ప్రతిప చ్చండికార్చనే. వర్జనీయా ప్రయత్నేన విషలేశో యథాంభసి. ప్రతిపచ్ఛేష సంయుక్తా ద్వితీయాయాం (ప్రతి పది దినత్రయే సతీత్యర్థః) మమార్చనం. కృతం ధర్మం నాశయతి సంతతిం పుత్రపౌత్రకీం. అమా యుక్తైవసాగ్రాహ్యా ప్రతిప చ్చండికార్చనే. అన్యథా కరణేతా వద్రాజ్యభంగః ప్రజాయతే. ఇతిః అత ఏవ పురుషార్థ చింతా మణౌ. యదా పూర్వ దినే ముహూర్త పంచకానంతరం ప్రవృత్తా ద్వితీయ దినే ముహూర్త ద్వయాది పరిమితా. త్రిముహూర్తాన కర్తవ్యాయా తిథిః క్షయగామినీ. ఇతి వచనోత్తర నిషేధాత్పూర్వైవ. ఇతి ధర్మ సింధోరపి క్షయగామిన్యాం ద్వితీయాయాం అమాయుక్త ప్రతిపద్యేవ శారద నవరాత్ర ప్రారంభ కరణే తాత్పర్య మితి స్పష్టం. ధర్మ సింధావేవం వర్తతే ''క్వచిన్ముహూర్తన్యాపిన్యా మప్యుక్త ఇతి'' అత్ర స్థిత క్వచిచ్ఛబ్దేన వృద్ధి సామ్య పక్ష యోః పరదిన ఇతి. క్షయపక్షే పూర్వదిన ఇతి స్పష్ట మవగమ్యతే. కించ ద్వితీయాశేష సంయుక్తా. ప్రతిపచ్ఛేష సంయుక్తా ద్వితీయాయామిత్యుక్తత్వేనచ యదోదయ గామిన్యాం ప్రతి పది సంపూర్ణా ద్వితీయా వర్తతేతస్మిన్దినే శారద నవరాత్ర ప్రారంభః న కర్తవ్య ఇతి పురోప దర్శిత దేవీ పురాణ వచనైర్జ్ఞాయతే. ఏ వంచ యాని అమా యుక్త నిషేధ వచనాని తాని సర్వాణి వృద్ధి సామ్య పక్షయోః యోజ్యాని. యానిద్వితీయాయుక్త నిషేధ వచనాని వర్తంతే తాని సర్వాణిక్షయ పక్షే యోజ్యా నీతి నిబంధన గ్రంథ కర్తౄణాం ఆశయ ఇతి విదుషాం స్పష్టమేవ. అతఏతన్నిర్ణయమేవ సర్వ నిబంధన గ్రంథానుసారీతి విద్వద్భి స్పష్ట మవగమ్యతే. ప్రకృతే ప్రతి పదః ద్విముహూర్తన్యూనత్వాత్. ద్వితీయా తిథేస్సంపూర్ణ స్థితత్వాచ్చ పూర్వ దినే అమా యుక్త భానువాసర ఏవ శారద నవరాత్రారంభ ఇత్యలం ప్రసంగా గత విచారణయా.

తా: శారద నవరాత్ర ప్రారంభము పాడ్యమి రోజున విదియ విష్యముగుచో అమావాస్యతో కలసిన పాడ్యమి నాడే చేయవలెనని సర్వ గ్రంథములు చెప్పుటచే 5—10—1975 ఆదివారం చేయుట శాస్త్రసమ్మతము.

శ్రీ మేధా దక్షిణామూర్తి పరబ్రహ్మణేనమః

శ్రీ రాక్షస నామ సంవత్సర పంచాంగ పీఠికా

